ఏప్రిల్
2017

132

సంపుటి : 11 సంచిక : 12 వెల రు. 10/-

ఈ సంచికలో........

పెట్టుబడిదారీ విధానాన్ని కూకటివేళ్లతో కూల్చివేయాలి
చైతన్యంతో పార్టీని నిర్మించాలి
మార్పుచెందుతున్న మధ్యతరగతి
నిరుద్యోగాన్ని పెంచిన నోట్ల రద్దు
భారత పునరుజ్జీవనోద్యమం
మహిళాభివృద్ధికి మార్గం పరిచిన విప్లవం
భారతదేశంలో మహిళల ఉపాధి సమస్య
ఆర్థిక సంస్కరణలు భారతదేశంలో వ్యవసాయాభివృద్ధి
మతతత్వాన్ని ఎదుర్కోడానికి ఎన్నికల ఎత్తుగడలే సరిపోవు
ఉద్యమ 'సూర్యుడు' సజ్జా సూర్య బాలానందం

నివాళి

## ఉద్యమ 'సూర్యుడు'

# సజ్జా సూర్య బాలానందం

వై. సిద్ధయ్య

సజ్జా సూర్య బాలానందం... ఆ పేరు వింటేనే ఆనాటి యువకుల్లో ఉత్సాహం నిండేది. చేనేత ప్రజల్లో చైతన్యం రగిలేది. భయంలేని ధీరునిగా ఆయన్ని యువకులు ఆదర్శంగా తీసుకునేవారు. పోలీసులపైనా తిరుగుబాటు చేసే పోరాట యోధునిగా గుర్తించేవారు. బాలానందం దృఢకాయుడు. మంచి బాక్సర్. వెంట ఎప్పుడూ ఏదో ఆయుధం వుంచుకునేవారు. ఆయన వెంట సాగేందుకు ఆనాటి యువకులు ఇష్టపడే వారు. బాలానందం పక్కనుంటే చాలు ప్రపంచాన్ని జయిస్తామన్నంత ధైర్యం వారిలో కలిగేది. రోషం, అన్యాయాలపై తిరగబడే నైజం సూర్యబాలానందం సొంతం. పోలీసులపైనా తిరగబడే ఆయన సాహసాన్ని అందరూ మెచ్చే వారు. ఎన్ని అవరోధాలొచ్చినా తాను నమ్మిన మార్గాన సాగిన ఆయన ఆదర్శనీయుడు. వేటపాలెం మండలం జాండ్రపేట గ్రామ ప్రజలు నేటికీ ఆయన సాహస కార్యాలను కథలు కథలుగా చెప్పుకుంటారు.

వేటపాలెం మండలం జాండ్రపేటలో సజ్జా కోటి నాగులు, అచ్చమాంబ దంపతులకు సూర్య బాలానందం జన్మించారు. వారి కుటుంబం చేనేత వృత్తిలో జీవనం సాగించేది. బాలానందం భార్య పేరు శారదాంబ. వారికి ముగ్గురు పిల్లలు. మొదటి సంతానమైన వెంకటసుబ్బారావు ఇటీవలే మరణించారు. రెండో కుమారుడు నాగాచారి ప్రస్తుతం బెంగుళూరులో నివసిస్తున్నారు. మూడో బిడ్డ అచ్చమాంబ హస్తినాపురంలో వున్నారు.

బాలానందానికి పట్టుదల ఎక్కువ. ఎక్కడ అన్యాయం జరిగినా తిరగబడేవాడు. ఒకసారి రామన్న పేటలో పోలీసులపై తిరగబడ్డాడు. స్థానికంగా పట్టా ఆశీర్వాదం రౌడీ పనులు చేసేవాడు. ఓ రోజు జాండ్రపేటలో నాటక ప్రదర్శన చూస్తున్న ఆడపిల్లల్ని ఆయన అల్లరి చేయడం బాలానందం కంటపడింది. వెంటనే ఆశీర్వాదాన్ని పట్టుకుని చితకబాదాడు. బాలానందానికి బొడ్డు సుబ్బారావు, సజ్జా భాస్కరరావు మంచి స్నేహితులు. వీరంతా ప్రారంభంలో చేనేత కార్మిక సంఘంలో పని చేసేవారు. కమ్యూనిస్టు పార్టీ జాండ్రపేట శాఖలో బాలానందం చురుకైన సభ్యుడు. చేనేత వృత్తి చేస్తూనే పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేవాడు. మండపేటలో జరిగిన రాష్ట్ర మహాసభ తరువాత చేనేత కార్మిక సంఘం రెండుగా చీలింది. ఆ సమయంలో బాలానందం పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేశారు. పార్టీ చెప్పిన బాటలో నడిచారు. ఈ క్రమంలోనే కస్తూరి కుటుంబరావు గారితో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ తరువాత పార్టీ సభ్యుడిగా మరింత చైతన్యవంతంగా ఎదిగారు. ఎప్పుడూ ఆయన వెన్నంటే సాగే వారు. ఆత్మీయమైన స్నేహితులుగా వారిని స్థానిక ప్రజలు గుర్తించారు. ఉద్యమ బాటలోనూ తుదిశ్వాస వరకూ కలిసి కట్టుగా సాగిన వారి స్నేహం ఎందరికో ఎందరినో ఉత్తేజపరిచింది.

వారి కృషితో జాండ్రపేటలో చేనేత కార్మిక సంఘం బలపడింది. గతంలో వున్న పార్టీ శాఖ మరింత పటిష్టమైంది. పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగింది. యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పార్టీకి అండగా నిలిచారు. ఇందులో బాలానందం కృషి కీలకమైనది. కస్తూరి క్రమశిక్షణ, అధ్యయనంతో పాటు బాలానందం చొరవ, ధైర్య సాహసాలు పార్టీ అభివృద్ధికి ఉపయోగపడ్డాయి.

1947 ప్రకాశం ఆర్డినెన్స్‌తో పార్టీపై నిర్బంధం పెరిగింది. గుర్తింపు కలిగిన నాయకులందరినీ అరెస్టు చేయడం ప్రారంభమైంది. ఫలితంగా పార్టీ నాయకులతో పాటు సూర్య బాలానందం కూడా రహస్య జీవితానికి వెళ్ళారు. ఆయన పరిచయాలు, చొరవ వల్ల కుందేరు తూర్పు ప్రాంత పాలేల ప్రజలు రహస్య దళానికి ఎంతో సహకరించారు. జాండ్రపేట వాసులు కూడా కష్టకాలంలో కమ్యూనిస్టులకు అండగా నిలిచారు.

జాండ్రపేట మునసబు గుత్తి వెంకట సుబ్బయ్య అపర హిట్లరు! ప్రజలను వేధించే వాడు. అతనో కిరాతకుడు!! ప్రజలు ఆయన్ని తీవ్రంగా ద్వేషించేవారు. అతని దుర్మార్గాలకు అడ్డుకట్ట వేయాలని కమ్యూనిస్టు పార్టీ భావించింది. గ్రామ శాఖ దానిపై సుదీర్ఘంగా చర్చించింది. అతన్ని మార్చడం, ఏమార్చడం సాధ్యం కాదని భావించింది. చివరకు ఆయన్ని ఖతం చేయడం ఒక్కటే మార్గమని నిర్ణయించింది. ఈ నిర్ణయంలో శాఖా కార్యదర్శి గౌరబత్తిన చంద్రమౌళి కూడా భాగస్వామే! అయితే ఇటువంటి తీవ్ర నిర్ణయాన్ని చేయడం పట్ల ఆయనలో భయం ఏర్పడింది. మెజారిటీ నిర్ణయాన్ని కాదనలేక పోయాడు. బయటకొచ్చిన తర్వాత ఆలోచనలో పడ్డాడు. చివరకు ఉద్యమానికి ద్రోహం చేయడానికే సిద్ధమయ్యాడు. శాఖా నిర్ణయాన్ని గ్రామస్తులకు చెప్పేశాడు. వెంటనే ఊరొదిరలి వెళ్లిపోయాడు. అతను ఓజిలికి పారిపోయినట్లు పార్టీ సభ్యులు గుర్తించారు. మునసబును మట్టుబెట్టడానికి పార్టీ నిర్ణయించినట్లు తెలియగానే గ్రామంలో పోలీసు నిఘా పెరిగింది. వెంటనే స్థానిక కమ్యూనిస్టు నాయకులపై హత్యాయత్నం నేరం మోపారు. దాన్నే సాకుగా తీసుకుని కమ్యూనిస్టుల కోసం వేట ముమ్మరం చేశారు. నిర్బంధం ప్రయోగించారు. కనిపిస్తే కాల్చేయాలనీ, అరెస్టు చేయాలనీ పోలీసులకు ఆదేశాలందాయి. ఈ విషయాన్ని పసిగట్టిన పార్టీ నాయకులు వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లారు. గ్రామంలోని పేద ప్రజలు వారికి అండగా నిలిచారు. అక్కున చేర్చుకున్నారు. గ్రామం చుట్టుపక్కలే వారికి రహస్యంగా ఆశ్రయం కల్పించారు. ఎంత వేధించినా వారి ఆచూకీ చెప్పకుండా ప్రజా నేతలకు రక్షణ కల్పించారు.

అప్పటికే పార్టీ నేతలుగా బాగా గుర్తింపు పొందిన కస్తూరి కుటుంబరావు, సజ్జా సూర్య బాలానందం, బండారు సుబ్బారావు సముద్ర తీరంలో తలదాచుకున్నారు. ఈపూరుపాలెం, తోటవారిపాలెం పల్లెల్లో తలదాచుకున్నారు. పత్తిపాటి ఆదినారాయణ, బండారు వెంకటేశ్వర్లు పడమర వైపు పల్లెలకు వెళ్లారు. పశ్చిమ ప్రాంతం వైపు వెళ్లి రక్షణ తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఆ సమయంలోనే రాష్ట్రమంతా తీవ్ర నిర్బంధం అమలవుతోంది. ముఖ్య నేతలంతా అడవుల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. ఆ విధంగా ప్రత్యేక దళాలలోకి ఎంపిక చేసిన వారికి కొత్తపట్నం పరిసరాలలో శిక్షణా శిబిరాన్ని పార్టీ ఏర్పాటు చేసింది. వేటపాలెం ప్రాంత నాయకులూ దానికి బయలుదేరారు. చినగంజాం వరకు వెళ్ళిన తరువాత కొత్తపట్నం రావద్దని కబురొచ్చింది. దళమంతా వెనక్కి వచ్చేసింది. వారిలో సజ్జా సూర్య బాలానందం, వేటపాలెం గ్రామ పార్టీ కార్యదర్శి సోడెం రంగయ్య వున్నారు. సోడెం రంగయ్య,

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **ఉద్యమ 'సూర్యుడు' సజ్జా సూర్య బాలానందం**
వై. సిద్ధయ్య.................. 2

2. **మానవాళి భవిత కోసంపెట్టుబడిదారీ విధానాన్నికూకటివేళ్లతో కూల్చివేయాలి**
జాన్ బెల్లమీ ఫాస్టర్ ......... 4

3. **చైతన్యంతో పార్టీని నిర్మించాలి**
ఎస్.వీరయ్య .................. 9

4. **మార్పుచెందుతున్న మధ్యతరగతి**
ఎ కోటిరెడ్డి ................. 11

5. **నిరుద్యోగాన్ని పెంచిన నోట్ల రద్దు**
టి.కె. రాజలక్ష్మి ............. 16

6. **భారత పునరుజ్జీవనోద్యమం**
కె యన్ ఫణిక్కర్........... 21

7. **మహిళాభివృద్ధికి మార్గం పరిచిన విప్లవం**
... 25

8. **భారతదేశంలో మహిళల ఉపాధి సమస్య**
ఇంద్రాణి మజుందార్ .... 27

9. **ఆర్థిక సంస్కరణలు భారతదేశంలో వ్యవసాయాభివృద్ధి**
శంతను డి. రాయ్....... 31

10. **మతతత్వాన్ని ఎదుర్కోడానికి ఎన్నికల ఎత్తుగడలే సరిపోవు ................** 34
బి వి రాఘవులు



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248**
**మేనేజర్: 040-27673787**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# హిందూ రాష్ట్ర

ముస్లిం మైనారిటీలపై నిత్యం విషం చిమ్మే మతతత్వవాది, నేరపూరిత చర్యల్లో ఆరితేరి అనేక కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తి దేశంలోనే అత్యంత అధిక జనాభా గల రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నియమించబడ్డారు. ఆయన పేరులో యోగి ఆధిత్యనాథ్. కట్టేది కాషాయ వస్త్రాలు. కాని ఆయనపై...హత్యా ప్రయత్నం, దొమ్మీలు, మారణాయుధాలతో తిరగడం, మతఘర్షణలు రెచ్చగొట్టడం, మత ప్రదేశాలను అపవిత్రపరచడం...వగైరా అనేక క్రిమినల్ కేసులున్నాయి. మతోన్మాద గూండా గుంపు అయిన 'హిందూ యువ వాహిని' అనే సంస్థ స్థాపకుడాయన. ఒకవైపు ఈ సంస్థ మైనారిటీ ప్రజలపై భౌతిక దాడులకు పాల్పడుతుంటే మరోవైపు యోగి ఆధిత్యనాథ్ వారిపై ప్రచారదాడి జరుపుతుంటారు.

యుపి ఎన్నికల ముందు సూచన ప్రాయంగా కూడా తెలపకుండా, ఎన్నికల్లో పూర్తి మెజారిటీ సాధించిన వెంటనే తన రాజకీయ విభాగమైన బిజెపి పార్టీలో కూడా చర్చ పెట్టకుండా ఆధిత్యనాథ్‌ను ముఖ్యమంత్రిని చేయడం వెనుక ఆర్ఎస్ఎస్ వ్యూహం దాగివుంది. భారత దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలన్నది ఆర్ఎస్ఎస్ లక్ష్యం. భారత దేశం లౌకిక, ప్రజాస్వామ్య, ఫెడరల్ దేశంగా ఉండాలని బాబా సాహెబ్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రూపొందించబడిన మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. దాన్ని కేంద్రీకృత, హిందూత్వ రాజ్యంగా మార్చాలని ఆర్ఎస్ఎస్ ఎప్పటినుండో ప్రయత్నిస్తోంది. భారత దేశాన్ని పుణ్యభూమిగా కొలిచేవారంతా ఈ దేశంలో ఉండాలి కానివారు దేశంలో రెండో జాతి పౌరులుగా మాత్రమే ఉండాలన్న తన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టేందుకు ఈ సంస్థ నేతలు స్వాతంత్ర్య పూర్వం నుండీ ప్రయత్నిస్తున్నారు. దీనికోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో నిస్సిగ్గుగా రాజీపడ్డారు కూడా. స్వాతంత్ర్యానంతరం తన లక్ష్యం నెరవేర్చుకునేందుకు ఆర్ఎస్ఎస్ అనేక విధాలుగా ప్రయత్నించింది. దేశ ప్రజల్లో మెజారిటీ మతతత్వాన్ని పెంచి పోషించేందుకు అనేక ప్రయత్నాలు చేసింది. అనేక ముసుగులు వేసుకుంది. అనేక సంస్థలను స్థాపించింది. రాష్ట్రాల్లో, కేంద్రంలో ఇతర అధికార కేంద్రాల్లోకి చొచ్చుకు పోయేందుకు రకరకాల ప్రయత్నాలు చేసింది. దేశంలోని అన్ని వ్యవస్థల్లోకీ హిందూత్వ భావజాలాన్ని చొప్పించేందుకు, హిందూత్వ వాదులను ప్రవేశపెట్టేందుకు పలువిధాలా ప్రయత్నించి ఫలితాలు సాధించింది.

హిందూత్వ వాదులు మొదటినుండి సామ్రాజ్యవాదానికి సాగిలపడుతూ వచ్చారు. దేశ ప్రజల్లో నెలకొని ఉన్న సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయతా భావాలను చెరిపివేసి హిందూత్వ జాతీయ వాదం నింపివేయడానికి పడరాని పాట్లు పడ్డారు. స్వదేశీపేరు చెబుతూనే విదేశీ పెట్టుబడికి కొమ్ముకాశారు. మరోవైపు దేశంలోని బడా పెట్టుబడిదారుల సేవలకు సదా సిద్ధంగా ఉంటూ వచ్చారు. ఆరు దశాబ్దాలకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలు, పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రాంతీయ పార్టీల దివాళాకోరు విధానాల వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. అది తిరుగుబాటువైపు మళ్లకుండా ఉండాలంటే ఆర్ఎస్ఎస్ లాంటి శక్తి, మోడీ లాంటి వ్యక్తి పాలక వర్గాలకు అవసరమైనారు. అందుకే కార్పొరేట్ పెట్టుబడి గత పార్లమెంటు ఎన్నికల్లోనూ, తరువాత జరిగిన ఎన్నికలన్నిటా మోడీనీ, బిజెపినీ నెత్తిన పెట్టుకుని మోస్తున్నది. కార్పొరేట్ ప్రచార సాధనాలు, డబ్బు, పలుకుబడి వారికి వెన్నుదన్నుగా నిలిచింది. దానికి ప్రతిఫలంగా మోడీ ప్రభుత్వం విదేశీ, స్వదేశీ పెట్టుబడికి ఊడిగం చేస్తున్నది.

అందుకే కేంద్రంలో మోడీ ప్రభుత్వం రావడమంటే బడాపెట్టుబడి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదం కలిసిన కాక్‌టెయిల్ ప్రభుత్వం అధికారంలోకి రావడమేనని సిపిఐ(ఎం) చెప్పింది. నేడు యుపిలో పచ్చి మతోన్మాది ఆధిత్యనాథ్ పట్టాభిషేకం దీనికొక నిరూపణ. భారత దేశాన్ని హిందూరాజ్యంగా మార్చే తన దీర్ఘకాల లక్ష్యంలో భాగంగా ఆర్ఎస్ఎస్ బరితెగించి తీసుకున్న చర్య ఇది. దీని పర్యవసానాలు మన దేశ సమైక్యత, సమగ్రత, లౌకిక, ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థల మీద తీవ్రంగా ఉంటాయి. పాలక వర్గాల విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రజాబాహుళ్య ఐక్యతను నిర్మించడం, అడుగడుగునా ఉమ్మడి పోరాటాలు నిర్వహించడమే ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనే సాధనం.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

## మానవాళి భవిత కోసం

# పెట్టుబడిదారీ విధానాన్ని కూకటివేళ్లతో కూల్చివేయాలి

**జాన్ బెల్లమీ ఫాస్టర్**



రచయిత
ఆర్థిక సామాజిక విశ్లేషకులు

ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఏ విధంగానైనా ప్రపంచంలోని మొత్తం చమురు, బొగ్గు, తదితర ఇంధనాలను వెలికితీసి విని యోగించటాన్ని లక్ష్యంగా పెట్టుకొని తద్వారా పర్యావరణంలో సంభవించే మార్పులను తిరస్కరించటం ట్రంప్ జమానా లక్ష్యంగా ఉన్నది. నోమ్‌చోమ్‌స్కీ మాటల్లో చెప్పాలంటే 'ఇది మానవజాతికి మరణ మృదంగం మోగించటమే'. 'పర్యావరణంపై మనం ఆడుతున్న ఆటకు ఇది ముగింపు అవుతుందని నేను భయపడుతున్నాను' అని ప్రఖ్యాత పర్యా వరణ నిపుణుడు మైకేల్ ఇ మాన్ చెప్పాడు.

వాతావరణం వేడెక్కకుండా నివారించ టానికి తీసుకుంటున్న చర్యల వైఫల్యం ఒక్కసారిగా కనిపించదు. అన్ని ప్రాంతాలను, అందరు ప్రజలను ఒకే విధంగా ప్రభావితం చేయదు. కానీ తక్షణ భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణ పట్ల కొద్ది సంవత్సరాల నిర్లక్ష్యం తర్వాత పది వేల సంవత్స రాల కాలంలో సరిచేయలేనంత నష్టాన్ని కలిగి స్తుంది. పర్యావరణాన్ని విధ్వంసం చేయటంలో మనం తిరిగి రాలేనంత దూరం వెళితే, అంటే ప్రపంచ సాధారణ ఉష్ణోగ్రత పెరుగుదలలో రెండు సెంటిగ్రేడ్ డిగ్రీలు దాటితే మానవుడు అదుపు చేయలేని స్థాయికి చేరుకుంటుందని నాసా మాజీ డైరెక్టర్, అమెరికాలోని మొదటి తరం పర్యావరణ నిపుణులలో ఒకరైన జేమ్స్ హాన్‌సన్ చెప్పాడు. అది క్రమంగా నాలుగు డిగ్రీల సెంటిగ్రేడ్ వేడి పెరగటానికి కారణమౌతుందని, అటువంటి పరిస్థితి మానవ నాగరికత అంతం కావటానికి దారితీస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రస్తుతం ప్రపంచంలో విడుదలవుతున్న కార్బన్-డై-ఆక్సైడ్ వాయువుల్లో అమెరికా 15 శాతం విడుదల చేస్తున్నప్పటికీ దాన్ని తగ్గించటంలో దాని అశక్తత ప్రపంచాన్ని రెండు సెంటిగ్రేడ్ డిగ్రీల వేడిమి పెరిగే వైపుగా తీసుకువెళుతుంది. తలసరి న అత్యధికంగా కార్బన్-డై-ఆక్సైడ్ వాయువులను విడుదల చేస్తున్న, ప్రపంచంపై ఆధిపత్యం చెలాయిస్తున్న శక్తి తన బాధ్యత నుంచి తప్పుకుంటే కర్బన వాయువుల విడుదలను తగ్గించటానికి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. ఈ కారణంగా పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టేందుకు పర్యావరణ శాస్త్రవేత్తలు అంతకంతకు ఎక్కువగా చైనా వైపు చూస్తున్నారు.

చరిత్రలో ఇటువంటి క్లిష్టమైన పరిస్థి తులలో మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఈ మధ్య కాలంలో శాస్త్రీయంగా వెల్లడైన సాక్ష్యాలు పర్యావ రణ విధ్వంసాన్ని గురించిన మన దృక్పథాన్ని గురించి ఏమి చెబుతున్నాయి? డోనాల్డ్ ట్రంప్ ప్రతినిధిగా ఉన్న ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడి రానున్న భౌగోళ విధ్వంసానికి ఏ విధంగా దోహ దం చేస్తున్నది? ప్రపంచాన్ని విధ్వంసాన్నుంచి కాపాడటానికి మానవాళికి ఉన్న అవకాశాలు ఏమిటి?

**తీవ్రమైన అసమానతల వైపుగా...**

పర్యావరణ మార్పులపై ఈ మధ్య వెల్ల డౌతున్న సమాచారం తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నది. పారిశ్రామికాభివృద్ధి ప్రారంభం నాటికన్నా అమెరికా ఎన్నికలు జరిగిన 2016, నవంబరు 8వ తేదీ నాటికి ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.2 డిగ్రీలు అదనంగా పెరిగిందని, (2015లో పారిస్‌లో జరిగిన పారిస్ వాతావరణ ఒప్పందం పెట్టిన 1.5 డిగ్రీల పరిమితిని దాటిపోతున్నామని) ప్రపంచ పర్యావరణ సంస్థ చెప్పింది. 2014, 2015 సంవత్సరాలు అంతకు ముందు రికార్డులను అధిగ మించి అత్యంత వేడిమి గల సంవత్సరాలుగా నమోదయ్యాయి. 2016 వాటిని మించి వేడిమి గల సంవత్సరంగా నమోదైంది.

నేషనల్ ఓషనిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన వార్షిక ఆర్కిటిక్ రికార్డ్ కార్డ్ 2016 డిసెంబర్‌లో విడుదల చేసిన నివేదిక ననుసరించి 20వ శతాబ్దం ప్రారంభం నుంచి ఆర్కిటిక్ ఉష్ణోగ్రత ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగు దల కన్నా రెట్టింపు వేగంతో పెరుగుతున్నది. 20వ శతాబ్దం ప్రారంభం నాటికన్నా ఇప్పుడు 3.5 శాతం ఎక్కువగా పెరిగింది. ఆర్కిటిక్ సముద్రంలోని మంచుగడ్డలు పర్యావరణ స్థిరత్వానికి అత్యంత కీలకమైనవి. సముద్రంలో మంచు కరిగిపోవటం, దాని స్థానంలో వేడిని పీల్చుకొనే 'నల్ల సముద్రం' మిగలటం ప్రధానాంశంగా ఉంది. 2016 సెప్టెం బరులో ఆర్కిటిక్ సముద్రంలో మంచు ఇప్పటికి రికార్డయిన వాటిలో రెండవ అతి తక్కువ స్థాయిలో ఉన్నది. ఇదేకాలంలో గ్రీన్‌లాండ్ హిమ పలక మందం తగ్గిపోతుండటంతో సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. 2016 నవంబరులో ప్రచురిం చిన ఆర్కిటిక్ రిసాలియన్స్ నివేదికలో సంవత్స రంలో ఆ సమయంలో సాధారణంగా ఉండే దానికన్నా 20 డిగ్రీలు ఎక్కువగా ఉన్నదని చెప్పింది. 19 పాయింట్లు పెరిగితే ఆర్కిటిక్ ప్రాంతంలో స్థిర త్వాన్ని దెబ్బతీస్తుందని, అది మొత్తం ప్రపంచ పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుందని చెప్పింది.

ఈ శతాబ్దంలో సముద్రమట్టం గతంలో వేసిన అంచనాలను మించి రెండు రెట్లు పెరుగుతుందని గత రెండు సంవత్సరాల నుంచి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే ఎనిమిది అంగుళాలు పెరగటంతో ద్వీప రాజ్యాలు, సముద్రతీరంలోని పల్లపు ప్రాంతాలు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. 2100 సంవత్సరం నాటికి సముద్రమట్టం ఆరు అడుగులకు మించి పెరుగుతుందని, రెండు శతాబ్దాలకు 20 అడుగులకు మించి పెరుగుతుందని, 2500 సంవత్సరం నాటికి

49 అడుగులు పెరుగుతుందని ప్రకృతిని గురించి అధ్యయనం చేసిన ఒక సర్వేలో వెల్లడైంది. ప్రస్తుత విధానాలు నిరాటంకంగా కొనసాగితే రానున్న 20 సంవత్సరాలలో వేడిమి 2 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పెరుగుతుంది. లక్ష కోట్ల మెట్రిక్ టన్నుల కర్బన వాయువుల విడుదలకు ప్రపంచం దగ్గరయ్యే కొలది ప్రపంచ కర్బన బడ్జెట్ విచ్ఛిన్నం కాకుండా చూడాల్సిన అవసరం పెరుగుతున్నది. ప్రస్తుతం ప్రపంచంలో సంవత్సరానికి 3 శాతం చొప్పున కర్బన వాయువుల విడుదలను తగ్గించాల్సి ఉంది. ఎక్కువ ఆదాయాలున్న, ప్రస్తుతం విడుదల వుతున్న కర్బన వాయువులలో నాలుగో వంతుకన్నా ఎక్కువ విడుదల చేస్తున్న, చారిత్రకంగా అత్యధిక కర్బన వాయువులను విడుదల చేసిన దేశాలు ఇందుకు మూడు రెట్లు అధికంగా తగ్గించాలి. ఈ సమస్యను పరిష్కరించటానికి వారికి విస్తారమైన సంపద, ఇతర భౌతిక వనరులు ఉన్నాయి.

ప్రపంచ వేడిమి ఎక్కువగా పెరుగుతున్నదని ప్రసిద్ధమైన హాకీస్టిక్ ఛార్ట్‌ను రూపొందించిన యాజ్‌మాన్ 2016లో రాసిన తన పుస్తకంలో పేర్కొన్నాడు. ముఖ్యమైన అంశం ఏమిటంటే మళ్ళీ వెనక్కురాలేని స్థితికి చేరుకుంటున్నాం. ఆపటానికి వీలులేని విధంగా భూగోళాన్ని మనం వేడెక్కిస్తున్నాం. పారిశ్రామికీకరణకు ముందు నాటికన్నా భూగోళం 3.6 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడెక్కి తే పర్యావరణంలో ప్రమాదకర పరిణామాలకు దారితీసి మనం సరిచేయలేని మార్పులు సంభవి స్తాయి. ఇప్పటికే మనం 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడిని పెంచాం. మరొక 0.9 శాతం పెంచటానికి సిద్ధంగా ఉన్నాం. మరో దశాబ్దం ఇలాగే జరిగితే 3.6 డిగ్రీల వరకు పెరుగుతుంది. అది మనలను అత్యంత ప్రమాదకర పరిస్థితిలోకి తీసుకువెళుతుంది.

ప్రస్తుతం మనం వినియోగిస్తున్న తీరులో సంవత్సరానికి 30 గిగా టన్నుల చొప్పున కర్బన వాయువులను విడుదల చేస్తే 30 సంవత్సరాలలో మన కర్బన బడ్జెట్‌కు సరిపోనూ ఖర్చుచేస్తాం. మనం బడ్జెట్ పరిధికన్నా తక్కువలో ఉండాలంటే ఉద్గారాల విడుదలను ప్రతి సంవత్సరం కొంత శాతం తగ్గించుకుంటూ పోవాలి. 20 సంవత్స రాలలో దాన్ని ప్రస్తుత వాడకంలో 33 శాతానికి తగ్గించాలి. అది అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్నదానికి సమానం అవుతుంది. ఈ శతాబ్దం మధ్య నాటికి కర్బన వాయువుల విడుదలను సున్నా శాతానికి తగ్గించాలి. ఈ మధ్య నిర్వహించిన ఒక సర్వేలో స్పష్టమైన దానిని బట్టి కర్బన వాయువులను 33 శాతానికి తగ్గించాలంటే ఇప్పటికి

❝ పెట్టుబడిని పోగుచేసుకోవటానికి పర్యావరణంపై తీవ్రమైన ఒత్తిడిని పెంచటం వర్గ సంబంధాలు, పోటీ, అసమానతలతో ముడిబడి ఉందని దశాబ్దాల తరబడి జరిగిన అధ్యయనంలో స్పష్టమైంది. మరోవైపున ఈ దాడిని ఎదుర్కొనే శక్తి పర్యా వరణానికి పరిమితంగానే ఉంది. పర్యావరణంపై ఒత్తిడి పెరగటం ప్రస్తుతం తీవ్రమైన రూపం తీసుకున్నది. ❞



పర్యావరణ వ్యతిరేకులతో నిండిన ట్రంప్ కేబినెట్

వెలికితీయాల్సిన చమురు లో 33 శాతం, సహజవాయువులో 50 శాతం, బొగ్గులో 80 శాతం ఎప్పటికీ భూమి లోపలనే ఉండిపోవాలి. కాబట్టి మనముందున్నది చిన్న సమస్య కాదు.

### పెట్టుబడిదారీ విధానం-పర్యావరణం

మానవులకు నివాసంగా ఉన్న భూగోళాన్ని నాశనం చేసేలా పర్యావరణ మార్పులు జరగటాన్ని సామాన్యశాస్త్రం మనకు తెలియజేస్తుంటే, పర్యావరణంలో మార్పులు సంభవించటానికి వాస్తవ కారణాలను అర్థం చేసుకోవటానికి, దాన్ని పరిష్కరించటానికి మనం సామాజిక శాస్త్రాలను అర్థం చేసుకోవాలి. కానీ ప్రారంభం నుంచి సామాజిక శాస్త్రాలు రాజీ పడుతూనే ఉన్నాయి. ఆర్థికాంశాలు, సైద్ధాంతికంగా పెట్టుబడిదారీ విధానం నిర్దేశించిన పరిధిలోనే, పెట్టుబడిదారీ విధానానికి, దాని పరిధికి ఎటువంటి సవాలు ఎదురు కాని విధంగా నిర్దిష్టమైన అంశాలకు సామాజిక శాస్త్రాలు సమాధానం ఇస్తాయి. అందువల్ల మనం నివసిస్తున్న చారిత్రక వ్యవస్థను, మౌలిక నిర్మాణం, దాని పని విధానాన్ని ప్రశ్నించ టానికి సామాజిక శాస్త్రవేత్తలు నిరుత్సాహ పరచబడుతుంటారు. దీనికనుగుణంగానే పర్యా వరణంలో మార్పులకు సంబంధించిన కారణాలను మనం అర్థం చేసుకోవటానికి దోహదం చేసినవి పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేసిన సామాజిక శాస్త్రాలలో ప్రధాన స్రవంతికి బయట నుంచి ఉద్భవించాయి. పెట్టుబడిని పోగుచేసుకోవటానికి పర్యావరణంపై తీవ్రమైన ఒత్తిడిని పెంచటం వర్గ సంబంధాలు, పోటీ, అసమానతలతో ముడిబడి ఉందని దశాబ్దాల తరబడి జరిగిన అధ్యయనంలో స్పష్టమైంది. మరోవైపున ఈ దాడిని ఎదుర్కొనే శక్తి పర్యా వరణానికి పరిమితంగానే ఉంది. పర్యావరణంపై ఒత్తిడి పెరగటం ప్రస్తుతం తీవ్రమైన రూపం తీసుకున్నది. పెట్టుబడిని సమీకరించటానికి శిలాజ ఇంధన ఉత్పత్తి, వినియోగంపై పెట్టుబడిదారీ వ్యవస్థ ఎక్కువగా ఆధారపడుతున్నది. అధికారాన్ని , ఆర్థికశక్తిని వినియోగించుకొని స్వలా భాపేక్షాపరులు సాంప్రదాయేతర ఇంధనం వైపు పరివర్తన కోసం జరుగుతున్న ప్రయత్నాలను వమ్ముచేస్తున్నారు.

తర్కబద్ధంగా చారిత్రక పరిణామాన్ని పరిశీలిస్తే పెట్టుబడిదారీ విధానం పెట్టుబడిని పోగుచేసుకొనే వ్యవస్థ. దానిలోని ప్రతి నూతన అభివృద్ధీ పెట్టుబడిని మరింతగా అభివృద్ధి చేయటానికి దారితీస్తుంది. అది అలా నిరంతరం జరిగిపోతూనే ఉంటుంది. పెట్టుబడిదారీ విధాన చరిత్రలో ప్రకృతిలో తాను సృష్టించిన విపరిణామా లను తరచుగా ఇతర చోట్లకు మళ్ళించి, అత్యంత బలహీనమైన ప్రజలపై వాటిని రుద్దుతుంది. ప్రస్తుతం పెట్టుబడిదారీ

**❝ ఇదే సమయంలో మధ్యేవాద, మితవాద పార్టీలు, అధ్యయన సంస్థలలో వారిని బలపరిచేవారు తాము విధించుకున్న పరిధులను తొలగించుకొని, భూగోళంపై పెట్టుబడిదారీ విధానం చేస్తున్న దాడిని అర్థం చేసుకోవటంలో విఫలమయ్యారు. ఆధిపత్యం వహిస్తున్న సామాజిక శాస్త్రాలు నైతిక, సైద్ధాంతిక వైఫల్యం చెందాయి. ❞**

విధానం పెట్టుబడిని సమీకరించే కార్యకలాపాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. పర్యావరణ మార్పుల రూపంలో భూగోళపు జీవరసాయనిక వ్యవస్థను దెబ్బ తీస్తున్నది. ఈ వ్యవస్థలోనే సాంప్రదాయేతర ఇంధనాల కోసం ప్రయత్నం చేయటానికి అవకాశం ఉన్నది. తక్కువ కాలంలోనే లాభాలు కావాలని పెట్టుబడి డిమాండ్ చేయటం, పోటీతత్వం, స్వలాభాపేక్ష, దీర్ఘకాలిక లక్ష్యాలతో ప్రణాళిక రూపొందించుకోవటంలో దాని అశక్తత, తదితరా లు సరైన ఇంధనం కోసం జరుగుతున్న ప్రయ త్నాలకు విఘాతం కలిగిస్తున్నాయి.

పెట్టుబడి సమీకరణతో ప్రారంభమయ్యే సమస్యలను గురించి 150 సంవత్సరాల క్రితం కార్ల్‌మార్క్స్ పెట్టుబడి గ్రంథంతో ప్రారంభించిన సామాజిక శాస్త్రాల అధ్యయనం గత శతాబ్దం ఆఖరులో ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపత్యంతో మరింత క్లిష్టమైంది. ఈ దశలో ప్రపంచస్థాయిలో ఆర్థిక కేంద్రీకరణ జరగటం, ఉత్పత్తి ప్రపంచీ కరించబడటం, ద్రవ్యపరంగా సంపదను పోగు చేసుకొనే విధానం, నయా ఉదారవాద రాజకీయ వ్యవస్థ కొన్ని సందర్భాలలో నయా ఫాసిజం తలెత్తటానికి అవకాశం కల్పిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలోనూ, మొత్తం ప్రపంచవ్యాప్తంగా సంపద సమీకరణ స్తంభించిపోవటం అంతర్గ తంగా, వ్యవస్థాగతంగా దీనికి సంబంధించిన అంశం. నూతన ద్రవ్య పెట్టుబడిదారీ విధానంలో సంపద స్వేచ్ఛగా ప్రవహించటం, కూడబెట్టు కోవటంపై ఉన్న ఆంక్షలన్నింటినీ నయా ఉదార వాద విధానాలు తొలగిస్తున్నాయి. మొత్తం ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ద్రవ్యరంగంలోకి తరలించాలని, సామ్రాజ్యవాదంలో నూతన దశలో ప్రపంచవ్యాప్తంగా అసమాన మారకం జరిగే విధానాన్నిరూపొందించాలని ప్రయత్నిస్తున్నారు.

అమెరికా ఆధిపత్యం క్షీణిస్తూ చైనా అగ్రస్థానానికి చేరుతున్న స్థితిలో సామ్రాజ్యవాద దుష్ట త్రయమైన అమెరికా, యూరప్, జపాన్‌ల ద్వారా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితులలో అణుశక్తి, శిలాజ ఇంధనాలు, సైనిక కేంద్రీకరణ, ద్రవ్యరంగంపై అదుపు, వలసదారులను, జాతి రీత్యా అన్యులను అణచివేయటం తదితరాలను దిగువస్థాయికి నెట్టబడుతున్న, నైతిక స్థైర్యం కోల్పోయిన తెల్లజాతి కార్మికవర్గం ద్వారా సాధించాలని అమెరికా పాలకవర్గాలలోని కొన్నిశక్తులు, ఈ దుష్ట త్రయం ప్రయత్నం చేస్తున్నాయి.

ఆర్థికంగా, పర్యావరణపరంగా ప్రపంచం సంక్షోభంలో చిక్కుకుపోయిన స్థితిలో ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న వ్యవస్థ ప్రతిస్పందనకు ఉన్న పరిమితులు స్పష్టం అవుతున్నాయి. సంపద పోగుచేసుకోవటానికి ఉన్న మౌలిక అవకాశాలకు ప్రమాదం కలిగించనంత వరకు మాత్రమే పెట్టుబడి నాయకత్వంలో నడిచే ప్రభుత్వాలు సంస్కరణలకు అవకాశం ఇస్తాయి. ఆ స్థితికి చేరుకోవటానికి ముందుగానే స్వప్రయోజనాలను కాంక్షించేవారు సంస్కరణలకు విఘాతం కలిగిం చటానికి పూనుకుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేయాల్సిన అవసరమైన సంస్కరణలు తాము సంపదలను కొల్లగొట్టటానికి తక్షణం ప్రమాదం కలిగిస్తాయని, తమ అధికారానికి ప్రమాదం కలిగించటంతో పాటు మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడకే ప్రమాదం కలిగి స్తాయని వీరు భావిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవటం కన్నా తమ అధికారాన్ని కాపాడుకోవటం ప్రాధాన్యత కలదిగా వారు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పర్యావరణ సంస్కరణలు తమ లక్ష్యం సాధించటానికి చాలా పరిమితులుంటాయి. ప్రపంచ పాలకవర్గాలలో అత్యధిక భాగానికి ప్రాతి నిధ్యం వహిస్తున్న శిలాజ ఇంధన కంపెనీలలో పెట్టుబడులు పెట్టినవారు, వారి మిత్రుల నుంచి నిరంతర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇదే సమయంలో మధ్యేవాద, మితవాద పార్టీలు, అధ్యయన సంస్థలలో వారిని బలపరిచేవారు తాము విధించుకున్న పరిధులను తొలగించుకొని, భూగోళంపై పెట్టుబడిదారీ విధానం చేస్తున్న దాడిని అర్థం చేసుకోవటంలో విఫలమయారు. ఆధిపత్యం వహిస్తున్న సామాజిక శాస్త్రాలు నైతిక, సైద్ధాంతిక వైఫల్యం చెందాయి. దాని ఫలితంగా భూగోళం త్వరగా క్షీణించిపోతూ, అత్యవసర పరిస్థితికి దగ్గరౌతుండగా అసమర్థమైనవిగా రుజువైన పర్యావరణ విధానాలు, వాటిని అమలు జరపటం పేరుతో విలువైన సమయాన్ని కోల్పోతున్నాం.

మధ్యేవాద పర్యావరణ విధానం ఈ విధం గా విఫలమైన పరిస్థితుల్లో ఈ కీలకమైన విషయా న్ని 'మితవాదులే సరిగా అర్థం చేసుకున్నారు' – "ది రైట్ ఈజ్ రైట్' అని వామపక్షాన్ని మేల్కొల పటానికి నవోమి క్లైన్ చెప్పాడు. పెట్టుబడిదారీ విధానమూ, పర్యావరణమా అనేదాన్ని అర్థం చేసుకోవటంలో మితవాదులు సరిగానే ఉన్నారు. అయితే పర్యావరణానికి ప్రతిగా పెట్టుబడిదారీ విధానాన్ని ఎంచుకోవటంతో వారు తప్పు చేశారు. పర్యావరణంపై పోరాటం చేయటంలో ఇప్పటి వరకు పెట్టుబడిదారీ విధానం విజయం సాధించిందని క్లైన్ చెప్పాడు. లాభాలు సంపాదించుకోవటం కోసం వేగంగా పరుగెడుతున్న రైలుకు బ్రేకులు వేయటానికి ఈ విధానం ఏ మాత్రం శ్రద్ధ చూపించటం లేదు. ఈ సమయంలో తిరుగుబాటు చేయకపోతే ప్రపంచ ప్రజలు బందీలుగా మారతారు.

### కర్బన సంస్కరణల వైఫల్యం

గత కొన్ని దశాబ్దాల నుంచి పర్యావరణాన్ని మార్చటం కోసం జరుగుతున్న ప్రయత్నాల ముఖ్య లక్ష్యం పెట్టుబడిదారీ విధానాన్ని పర్యావరణపరంగా ఆధునీకరించటమే. పెట్టుబడి సమీకర ణకు అవకాశం కల్పించే పరిధులలో మాత్రమే అది జరగాలి. పారిస్ వాతావరణ ఒప్పందం సందర్భంగా ఈ విధమైన ధోరణి అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తమైంది. పర్యావరణంలో మార్పులు తీసుకురావటం కోసం 193 దేశాలు పాల్గొని సంతకాలు చేశాయి. కానీ ప్రస్తుత ప్రపంచంలో ఉన్న అత్యవసర పరిస్థితితో పోల్చుకుంటే వారు చేసుకున్న ఒప్పందం అందుకు ఉపయోగించిన కాగితం విలువ కూడా చేయదు. ఆయా దేశాలు తీసుకున్న కోటాలన్నీ స్వచ్ఛందంగా అమలు జరిపేవే. అమలుకు ఏ విధమైన నిర్బంధం లేదు. కాబట్టి వాటిని పూర్తిచేయటం జరగదు. అమలును

పర్యవేక్షించటానికి ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి యంత్రాంగం లేదు. ఒకవేళ అమలు జరిపినప్పటికీ ఈ దేశాల కోటాలను పూర్తి చేసినా పర్యావరణంలో వేడిమి 2 డిగ్రీలను దాటి, ప్రపంచ సగటు 3.7 డిగ్రీలకు చేరుకోవటానికి దగ్గరలో ఉంటుంది. పర్యావరణ విధానంలో కీలక మైన 'క్లీన్ పవర్ పాలసీ' (సిపిపి) ప్రాతిపదికపైనే ఒబామా నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం పారిస్ ఒప్పందం అమలుకు సహకారం అందిస్తుంది. ఇది ప్రస్తుతం కోర్టులో ఉన్నప్పటికీ ఈ ప్రణాళికను ప్రతిపాదించినవారు దీని ప్రాతిపదికన అమెరికా విడుదల చేస్తున్న కర్బన వాయువులను 2005 ప్రాతిపదికగా 2025 నాటికి 26–28 శాతానికి తగ్గించటానికి రూపొందిం చామని చెబుతున్నారు. విద్యుత్ ఉత్పత్తిచేసే కేంద్రాలలో విడుదల చేసే కార్బన్–డై–ఆక్సైడ్ వాయువులను క్రమబద్ధీకరించటానికి క్లీన్ ఎయిర్ యాక్ట్‌ను అమలు చేయటానికి సంబంధించిన కొన్ని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లకు సంబంధించినవి సిపిపిలో ఉన్నాయి. వీటిని పర్యావరణ పరిరక్షణ సంస్థ అమలు జరుపుతుంది. ఒబామా ఆలోచనలు ఏవైనప్పటికీ ధనిక దేశం పర్యావరణ పరిరక్షణకు చేయాల్సిన దానిలో అమెరికా చేస్తున్నది చాలా తక్కువగా ఉంటోంది. 2005లో అమెరికా అత్యధికంగా కర్బన వాయువులను విడుదల చేసింది కాబట్టి ఆ సంవత్సరాన్ని కర్బన వాయువుల తగ్గింపుకు ప్రాతిపదికగా తీసుకున్నారు. అమెరికా చెబుతు న్నట్లుగా 2025 నాటికి 25 శాతం ఉద్గారాలను తగ్గించినప్పటికీ 1990 క్యోటో ప్రొటోకాల్‌తో పోల్చుకుంటే 7 శాతం మాత్రమే తగ్గుతుంది. 2012 నాటికి 7 శాతం కర్బన ఉద్గారాలను తగ్గించాలని క్యోటో ప్రొటోకాల్ అమెరికాను ఆదేశించింది. కాబట్టి ఆ గడువును మార్చిన ఫలితంగా ప్రస్తుతం కర్బన వాయువుల విడుదల తగ్గింపు లక్ష్యాన్ని కుదించారు. పర్యావరణ విధ్వంసం ఫలితంగా త్వరగా వినాశనానికి దగ్గరవుతున్న మానవాళిని రక్షించటానికి ఇదేమాత్రం సరిపోదు. కర్బన వాయువుల విడుదలను తగ్గించటంలో గతంలో అసమర్థమైనవిగా రుజువైన మార్కెట్ ఫ్రెండ్లీ కార్బన్ ట్రేడింగ్ విధానం ద్వారా ఈ తగ్గింపును కూడా అమలు జరపటానికి పూనుకుంటున్నారు.

కర్బన వాయువుల విడుదలలో మౌలిక అంశాలను పక్కన పెట్టినప్పటికీ పారిస్ వాతావరణ ఒప్పందం, ఒబామా చెబుతున్న క్లీన్ పవర్ ప్లాన్‌లు శిలాజ ఇంధనాలతో ప్రయోజనాలు పొందుతున్న పెట్టుబడిదారుల నుంచి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొంటు న్నాయి. సిపిపిని ఆచరణలోకి తీసుకురావటానికి ఒబామా అమెరి కా కాంగ్రెస్‌ను తప్పించుకో వలసి ఉండటమే కాక, శిలాజ ఇంధన పెట్టుబడి దారులకు సన్నిహితంగా ఉన్న 24 రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టుకు వెళ్ళటంతో ఈ మొత్తం వ్యవహారం కోర్టుల్లో ఉన్నది. ట్రంప్ యంత్రాంగం సిపిపిని రద్దుచేస్తానని, ప్యారిస్ ఒప్పందం నుంచి ఉపసంహరించుకుంటానని చెబుతున్న పరిస్థితుల్లో ఇదంతా నిరుపయోగ మౌతుంది. పర్యావరణ మార్పులు పెద్ద కట్టుకథ అని ట్రంప్ ప్రచారం చేసున్నాడు. అందుకను గుణంగానే అధికార మార్పిడి కోసం తాను నియ మించిన బృందాన్ని, కేబినెట్‌ను పర్యావరణ సైన్స్‌ను తిరస్కరించే వారితో నింపేశాడు. 1. పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి ఉపసంహరించుకోవటం. 2. క్లీన్ పవర్ ప్లాన్‌ను రద్దుచేయటం. 3. పైప్‌లైన్ ప్రాజెక్టులకు అంగీకారాన్ని తెలియజేయటం పర్యావరణ విధానానికి సంబంధించి ట్రంప్ ప్రభుత్వ ప్రాధాన్య తలుగా ఉన్నాయని వెల్లడౌతున్నది.

"సాధారణంగా ఉన్న నిబంధనలను కూడా నీరు గార్చటం, శాస్త్రీయ విజ్ఞానాన్ని అపహాస్యం చేయటం, తదితరాలు శిలాజ ఇంధనాలను ఉపయోగించటం వల్ల మానవ జాతికి ఏ ప్రమాదం రాదని నమ్మించటానికి శిలాజ ఇంధనాలలో పెట్టు బడులు పెట్టిన వారికి ఇవి అవసరం. సమాజానికి ఏమి జరిగినా వారి లాభాలు పరిరక్షించుకోవటం వారి లక్ష్యం."

పర్యావరణ మార్పులను తిరస్కరిస్తున్న వారి నాయకత్వంలో ఉన్న ఈ పాలనాధి కారులను అజ్ఞానులుగా భావించటం పొరపాట వుతుంది. సాధారణంగా ఉన్న నిబంధనలను కూడా నీరు గార్చటం, శాస్త్రీయ విజ్ఞానాన్ని అపహాస్యం చేయటం, తదితరాలు శిలాజ ఇంధనాలను ఉపయోగించటం వల్ల మానవ జాతికి ఏ ప్రమాదం రాదని నమ్మించటానికి శిలాజ ఇంధనాలలో పెట్టు బడులు పెట్టిన వారికి ఇవి అవసరం. సమాజానికి ఏమి జరిగినా వారి లాభాలు పరిరక్షించుకోవటం వారి లక్ష్యం. పొగాకు కంపెనీలలో చేస్తున్న పరిశోధనలు పొగాకు వినియోగం వల్ల మనుష ల ప్రాణాలు పోతున్నాయని రుజువవుతుంటే యజమానులు వాటిని కప్పిపెట్టి, పొగాకు వాడకం వల్ల ఎటువంటి ప్రమాదం రాదని చేస్తున్న ప్రచా రాన్ని ఇది ఇంకొంత పెద్దస్థాయిలో పోలి ఉన్నది.

ట్రంప్ ఎన్నిక వల్ల శిలాజ ఇంధనంలో ఉన్న పెట్టుబడులు ఇప్పటికే లాభం పొందటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. 2016లో ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే చమురు, గ్యాస్ కంపెనీల షేర్లు పెరిగాయి. అమెరికాలో అగ్రశ్రేణి బొగ్గు కంపెనీ అయిన పీబాడి ఎనర్జీ షేర్ విలువ ఎన్ని కల ఫలితాల అనంతరం 70 శాతం పెరగటంతో ఆ కంపెనీ దివాలా అంచుల్లో నుంచి బయట పడింది. ట్రంప్ ఆయిల్ డ్రిల్లింగ్ నిబంధనలను చాలా వరకు పక్కన పెడతాడని చమురు రంగంలో పెట్టుబడులు పెట్టినవారు ఆశిస్తున్నారు. అనుకోని విధంగా పర్యావరణ విధ్వంసం జరిగితే అమెరికా, ఆస్ట్రేలియా లాంటి ధనిక దేశాలు శరణార్థుల నుంచి తమను తాము రక్షించుకోవటం కోసం రక్షణ దుర్గాలను నిర్మించుకోవలసిన అవసరం ఉంటుందని గతంలో పెంటగాన్ రూపొందించిన నివేదికలలో చెప్పారు. ప్రపంచ దక్షిణ భాగంలో ఇంధనం, ఆహారం, నీరు లాంటి ప్రకృతి వనరుల కోసం జరిగే ప్రయత్నాలను ధనిక దేశాలు సైనికంగా ఎదుర్కోవాల్సి రావచ్చునని చెప్పారు.

### ప్రస్తుతం రగులుకొంటున్న అగ్ని

విప్లవం అడవిలో రగులుకొనే కార్చిచ్చు లాంటిది. తన దారిలో అడ్డం వచ్చిన ప్రతి దాన్నీ అది దహించివేస్తుంది. విప్లవంలో పాల్గొనే ప్రజలు వ్యవస్థలో భాగంగా ఉండరు. వారు వ్యవస్థను నాశనం చేస్తారు. వ్యవస్థను మారుస్తారు. పరిపూర్ణమైన మార్పు, పూర్తిగా తలక్రిందులు చేయటం విప్లవానికి సరైన అర్థం. కార్చిచ్చు నీ ఇంటిని దహించకుండా ఆపటానికి ఉన్న ఒకే మార్గం నువ్వు నీ అదుపులో ఉండే అగ్నిని రగి లించి, దాన్ని అదుపులో లేని అగ్నికి వ్యతిరేకం గా ఉపయోగించాలి. ఈ విధంగా అదుపులో ఉండే అగ్నిని ఉపయోగిం చటం అనే దానికి అర్థం ప్రతీఘాత విప్లవం.

> **❝లాభాల కోసం చేస్తున్న దోపిడీపై మానవ సహజ స్వభావం పైచేయి సాధించటానికి హరిత విప్లవం దోహదం చేస్తుంది. పర్యావరణాన్ని కాపాడటానికి చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలిగించటం వెనుక ఉన్న ఆర్థిక వాస్తవం భూగోళంపై పెట్టుబడిదారీ విధానం చేస్తున్న పోరాటం. పర్యావరణాన్ని కాపాడాలంటే పెట్టుబడిదారీ విధానాన్ని ఓడించాలి.❞**

తెల్లజాతి ఆధిక్యతావాదంతో ముడిబడిన నయా ఫాసిస్టు శక్తులు పర్యావరణ పరిరక్షణ కోసం, సామాజిక, పర్యావరణ న్యాయం కోసం జరుగుతున్న పోరాటాన్ని ఎదుర్కోవటానికి ప్రతీఘాత విప్లవాన్ని బ్యాక్‌ఫైర్‌గా వినియోగించటానికి ప్రయత్నం చేస్తున్నారు. 'మనం చేయాల్సింది పర్యావరణ మార్పులపై యుద్ధం కాదు. మనకు విప్లవం కావాలి' అని ఎరిక్‌గాడె, ఆరన్ జఫెలు 2016, అక్టోబరులో న్యూయార్క్ టైమ్స్‌లో చెప్పారు. మానవులు అసాధారణమైన జాతి. జీవ, పర్యావరణాన్ని క్రమబద్ధం చేసుకోవ టానికి, ఆహారం, నీరు, నీడ, ఇతర అవసరాలను తీర్చుకోవటానికి ప్రకృతితో సంక్లిష్టమైన సంబం ధాలను ఏర్పరచుకుంటారు. పెట్టుబడిదారీ విధానానికి సహజమైన వర్గ, సామాజిక అసమా నతల వల్ల సంపద కలిగినవారు ఆహార ధరలు పెరిగినా భరించగలరు. కరువులు వచ్చిన సందర్భాలలో మంచినీటి బాటిళ్ళను కొని వినియోగించగలరు. సముద్రాలు పొంగిన సందర్భాలలో ఇళ్ళను, వ్యాపారాలను ఇతర చోట్లకు తరలిం చగలరు. వారితో పోల్చుకొంటే అటువంటి వనరులు లేనివారికి కొద్ది అవకాశాలు మాత్రమే ఉంటాయి. వారు ఎక్కువ ఇబ్బందులను ఎదుర్కొం టారు. ఇదేవిధంగా మౌలికమైన సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం నుంచి రక్షణ పొందే ఇతరమైన వాటికి కూడా వర్తిస్తుంది. ఇవి, మరి ఇతర కారణాల రీత్యా పర్యావరణంలో మార్పులు దేశం లోపలా, ప్రపంచవ్యాప్తంగానూ అణచివేయబడుతున్నవారిని, అవకాశాలులేని వారిని మొదటగా దెబ్బతీస్తాయి.

భూగోళాన్ని విధ్వంసం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో పర్యావరణ, సామాజిక విప్లవాన్ని కొనసాగించాలి. మానవ జాతి భవిష్యత్తును కాపాడటం కోసం ప్రజానీకాన్ని కదిలించాలి. భూగోళ పరిరక్షణ కోసం విప్లవ పోరాటాన్ని కొనసాగించాలి. భూగోళం, మానవ సంబంధాల మధ్య గండికి కారణమౌతున్న, సమా జంలో ఉన్న ప్రయివేటు, దోపిడీచేస్తున్న, బాధ్యతా రహితమైన మార్గంలో వెళుతున్న మానవ స్వభావంపై సామాజిక ఆధిపత్యాన్ని సాధించాలి. ఈ గండిని పూడ్చటం కోసం గతంలో మానవజాతి ఎప్పుడూ చూడనంతగా మెజారిటీ ప్రజలు ప్రపంచ స్థాయిలో తిరుగుబాటు చేయాలి. లాభాల కోసం చేస్తున్న దోపిడీపై మానవ సహజ స్వభావం పైచేయి సాధించటానికి హరిత విప్లవం దోహదం చేస్తుంది. పర్యావరణాన్ని కాపాడటానికి చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలిగించటం వెనుక ఉన్న ఆర్థిక వాస్తవం భూగోళంపై పెట్టుబడిదారీ విధానం చేస్తున్న పోరాటం. పర్యావరణాన్ని కాపాడాలంటే పెట్టుబడిదారీ విధానాన్ని ఓడిం చాలి. రెండు దశాబ్దాల అబద్ధాలు, మోసాల తర్వాత 2 డిగ్రీల వేడిని తగ్గించటానికి ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నీటి రక్షణ కోసం మూలజాతి అమెరికన్‌లు జరిపిన పోరాటం వీటికి ఉదాహరణ. చివరి రోజుల్లో మానవ కవచం ఏర్పాటు చేయటంలో 2,000 మంది సైనికాధికారులు పాల్గొన్నారు. రాక్ వాటర్ రక్షణ కోసం పోరాడుతున్నవారు గడ్డకట్టే చలిలో ప్రభుత్వం ప్రయోగిస్తున్న నీటి తూటాలను, ప్రాణహాని చేయని బుల్లెట్లను, బాష్ప వాయువు, తదితరాలను వారాల తరబడి భరిస్తూ రోజుకు 5,70,000 బ్యారెళ్ళ చమురును రవాణా చేసే పైప్‌లైన్ నిర్మాణాన్ని తాత్కాలికంగా అయినా అడ్డుకున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో భూగోళం, మానవాళి ముందు తక్కువ అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం పర్యావరణం ఉన్న మూల మలుపులో పర్యావరణ, సామాజిక విప్లవం చారిత్రక అవసరం. అమానవీయమైన వ్యవస్థ నుంచి ఎదురౌతున్న విధ్వంసాన్ని అడ్డుకోవటానికి మరోసారి మానవాళి చరిత్రను తన చేతుల్లోకి తీసుకోవాల్సి ఉంది. రెండు దశలుగా దీన్ని అమలుచేయాల్సి ఉన్నది. 1930, 40లలో ఫాసి జానికి వ్యతిరేకంగా పాపులర్ ఫ్రంటును ఏర్పాటు చేసిన తరహాలో మొదటి దశలో ఏర్పాటు చేయాలి. ఈరోజు పాపులర్ ఫ్రంట్ శిలాజ ఇంధన ద్రవ్య కూటమిని, వారి మితవాద మద్దతుదారులను ఎదుర్కోవాలి. పోరాటం మొదటి దశలో ఈ వ్యవస్థ పరిధిలోనే వివిధ రకాలైన, విస్తృతంగా అంగీక రించే డిమాండ్లను ముందుకు తీసుకురావాలి. కర్బన ఉద్గారాలను నివారించటానికి, ఆర్థిక దుబారాను అరికట్టటానికి కృషిచేస్తూ, పెట్టుబడి తర్కానికి విరుద్ధమైన, ప్రధానంగా శిలాజ ఇంధన పరిశ్రమకు ప్రతికూలమైన పర్యావరణ, సామాజిక అవసరాలను ముందుకు తేవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉనికినే ప్రశ్నించే అంశాలను తక్షణమే ముందుకు తీసుకొని రాకూడదు.

పెట్టుబడిదారీ విధానం నుంచి భూగోళానికి దీర్ఘకాలంలో ఎదురౌతున్న ప్రమాదం ఎంత తీవ్రమైనదైనప్పటికీ అప్పుడప్పుడు చేసే సంస్కరణల ద్వారా దాన్ని నివారించలేం. శిలాజ ఇంధనాలతో దాని సంబంధాలు మారిన ప్పటికీ దాని మౌలికమైన లక్షణాలు మాత్రం మారవు. పెట్టుబడి పోగుపడటం ద్వారా భూ గోళం, పర్యావరణానికి ఏర్పడిన ప్రమాదం ఆవ రించి ఉంటుంది. దీని అర్థం ఏమంటే పర్యావరణ విప్లవం అంతిమంగా ఉత్పత్తి పునాదులకు విస్త రించాలి. జాతులు, లింగ, ఇతర అసమానతలను అనుభవిస్తున్న అందరూ సమానంగా ఉండే వర్గ రహిత సమాజాన్ని సాధించాలి. సామ్రాజ్యవాదాన్ని అంతంచేసి, భూగోళాన్ని భవిష్యత్ తరాల కోసం కాపాడాలి. కాబట్టి దీర్ఘ కాలంలో ఈ పోరాటం సోషలిజం కోసం జరిగే పోరాటంతో మిళితం అవుతుంది. పోరాటం ఎంత విప్లవాత్మకంగా ఉంటే అంత ఎక్కువగా ఎవరి అవసరాలైతే ఎక్కువగా ఉంటా యో వారి కోర్కెలు, దక్షిణ ప్రాంతంవారి సమస్యలు ముందుకొస్తాయి. వ్యవస్థ కేంద్రంలో ఉన్నవారి కన్నా చుట్టూ ఉన్న ప్రజలు వ్యవస్థకు వ్యతిరేకంగా ముందు తిరుగుబాటు చేయటానికి అవకాశాలు న్నాయి. కాబట్టి అత్యంత దుర్భర స్థితిలో ఉన్నవారి తిరుగుబాటుపై ఆశలు ఉన్నాయి. అది వ్యవస్థ కేంద్రంలో పగుళ్ళు ఏర్పడటానికి దారితీస్తుంది. ఇదంతా విఫలమైతే, మన ప్రస్తుత ఆకాంక్షలు నెరవేరకపోతే, ప్రపంచం విధ్వంసానికి మరింత దగ్గరగా వెళితే, ఇప్పటిలాగానే అప్పుడు కూడా ఒకే పరిష్కారం పర్యావరణ, సామాజిక విప్లవమే అవుతుంది. ❋

# చైతన్యంతో పార్టీని నిర్మించాలి

**ఎస్.వీరయ్య**



రచయిత
సిపిఐ(ఎం)కేంద్రకమిటి సభ్యులు

రాజ్యాధికారం సాధించకుండా కమ్యూనిస్టు పార్టీ అంతిమ లక్ష్యం నెరవేరదు. ఇందుకు పార్టీ ప్రతిష్ట మాత్రమే పెరిగితే సరిపోదు. పార్టీ పెరగాలి. పార్టీ పెరగాలంటే పార్టీ ప్రతిష్ట పెరగాలన్నదాంట్లో సందేహం లేదు. కానీ పార్టీ ప్రతిష్ట దానంతటదే పార్టీ బలాన్ని పెంచదు. పార్టీ పునాదిని బలోపేతం చేయదు. పెరిగిన పార్టీ ప్రతిష్ట ఆధారంగా పార్టీ పునాదిని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కృషి అవసరం. పార్టీ ప్రతిష్ట మాత్రమే పెరిగి పార్టీ స్వంత బలం పెరగనప్పుడు అది కమ్యూనిస్టు పార్టీ కన్నా దానితో కలిసి పనిచేసే ఇతర బలమైన పార్టీలకే ఉపయోగం. ముఖ్యంగా బూర్జువా పార్టీలతో కలిసి పనిచేస్తున్నప్పుడు కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టలో కొంత వాటా వారు అనుభవిస్తారు. వారి అప్రతిష్టను కొంత కమ్యూనిస్టు పార్టీకి అంటగడతారు. ముఖ్యంగా ఎన్నికల పొత్తుల సందర్భంగా జరిగేది ఇదే. బలమైన కమ్యూనిస్టు పార్టీ ఉన్నప్పుడు ఇతర పార్టీలకు ప్రయోజనం చేకూరడంతో పాటు వారితో కలిసి పనిచేయడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ కూడా ప్రయోజనం పొందడం సాధ్యమవుతుంది. అందువల్ల కమ్యూనిస్టు పార్టీ స్వంత పునాది కీలకపాత్ర పోషిస్తుంది. బలమైన కమ్యూనిస్టు పార్టీ ఉన్నప్పుడు మాత్రమే తనంతట తానుగా అధికారంలోకి రావటం గానీ, లేదా నిర్ణయాత్మక పాత్ర పోషించటం గానీ సాధ్యపడుతుంది.

విప్లవ పార్టీ దానంతటదే పెరగదు. మనం నిర్మించాలి. మనంలో నేను భాగం అని గుర్తించాలి. నేను నిర్మించాలన్న విషయం గుర్తించాలి. పార్టీ శ్రేణులు ఎవరికి వారు తమ బాధ్యతను గుర్తించినప్పుడే పార్టీని నిర్మించగలరు. పార్టీని ఎవరో నిర్మిస్తారనుకోవటం, పార్టీ పెరగట్లేదని ఆవేదన చెందటం వలన ప్రయోజనం లేదు. దానంతట అది పెరగదని గుర్తించి తాను పార్టీని పెంచడానికి ప్రయత్నం చేస్తే ఫలితం సాధించవచ్చు. ఇల్లు నిర్మిస్తేనే నిర్మాణమవుతుంది కదా! ఆర్థిక వనరులు, అవసరమైన సామాగ్రి ఉన్నంత మాత్రాన దానంతట అది నిర్మాణం కాదుగదా! పార్టీ నిర్మాణం కూడా అంతే. ఇది ప్రయత్నపూర్వకంగా, చైతన్యవంతంగా చేయాల్సిన పని. పార్టీ ప్రతిష్ట పెరుగుదల మొదటి దశ. అయితే గత కొంత కాలంగా పార్టీ ప్రతిష్టకు నష్టం జరిగిన విషయం విశాఖలో జరిగిన అఖిలభారత మహాసభ, కోల్‌కతా ప్లీనం గుర్తించాయి. అందుకు రాజకీయ, నిర్మాణపరమైన కారణాలను విశ్లేషించాయి. తక్షణం అవసరమైన రాజకీయ విధానాన్ని, విప్లవ పార్టీ నిర్మాణానికి తీసుకోవలసిన చర్యలను నిర్దేశించాయి. ఇప్పుడు శ్రేణుల ముందున్న కర్తవ్యం ఒక్కటే. పార్టీని నిర్మించే బాధ్యత నాదే అన్న స్పృహతో ఉన్నామా, లేదా అనేది పరిశీలించుకోవాలి.

ప్రణాళికాబద్ధంగా పనిచేసినప్పుడే బలమైన పార్టీని నిర్మించగలము. యాదృచ్ఛికతకు (స్పాంటెనిటీ) లేదా తోసుకొచ్చే పనులకు అలవాటు పడినప్పుడు పార్టీని నిర్మించజాలము. క్షణం తీరికలేదు గవ్వ రాకడ లేదు అన్నట్టు మన కృషి తయారవుతుంది. శ్రమకోర్చి నిర్విరామంగా పనిచేసినప్పటికీ నిర్దిష్ట ఫలితాలు సాధించలేము. ఆకలినీ, ఆరోగ్యాన్నీ ఖాతరు చేయకుండా పనిచేసే కార్యకర్తలు అనేకమంది ఇక్కడే పొరపాటు పడుతుంటారు. తమ కష్టాన్ని పార్టీ గుర్తించడం లేదని బాధపడతారు. కష్టాన్ని గుర్తించవలసిందే... కానీ కష్టపడుతున్నందుకు జాలిపడటమే తప్ప దానివల్ల ఫలితముండదు. ఎదుటి కామ్రేడ్ నుండి జాలినీ, ఓదార్పునూ ఆశించవచ్చు. కానీ ఫలితం సాధించాలి. పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు పడుతున్న కష్టమంతా విప్లవం కోసం. ఈ అంతిమ ఫలితం కోసమే ఎన్ని త్యాగాలయినా చేయడానికి సిద్ధపడుతున్నారు. ఈ ఫలితం సాధించకుండా ఎంత కష్టపడితే మాత్రం ఉపయోగమేమిటి? ఇది విప్లవానికే కాదు. రోజువారీ నిర్ణయించుకునే లక్ష్యాలన్నింటికీ వర్తిస్తుంది. ఎప్పటికప్పుడు నిర్ణయించుకున్న ఫలితాలు సాధించకుండా అంతిమ ఫలితం సాధించగలమనుకోవడం భ్రమ. అంతిమ ఫలితం సాధించడానికి పునాది సరైన రాజకీయ విధానం. ఒకసారి తగిన రాజకీయ విధానాన్ని రూపొందించుకున్న తర్వాత దానిని ఆచరణలో పెట్టటం, అందుకు అనుగుణమైన పార్టీని నిర్మించడం పార్టీ శ్రేణుల బాధ్యత. అందుకే ఎప్పటికప్పుడు నిర్ణయించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలి. ప్రణాళికలో కనీసం ఆరు ప్రాథమిక ప్రశ్నలకు తగిన సమాధానం ఉండాలి. 1) ఏం చెయ్యాలో స్పష్టత ఉండాలి 2) ఎందుకు చెయ్యాలో కూడా స్పష్టమైన అవగాహన ఉండాలి. తద్వారా ఏమి సాధించదలిచామో ముందే నిర్ధారించుకోవాలి. 3) నిర్దిష్ట కాలపరిమితి నిర్ణయించుకోవాలి. అంటే ఎప్పటిలోగా ఆ పని పూర్తికావాలో నిర్ధారించుకోవాలి. 4) ఆ కర్తవ్యం నిర్వహించవలసింది ఎక్కడో కూడా స్పష్టత ఉండాలి 5) ఆ పని స్వభావాన్ని బట్టి దానిని నిర్వహించగల సామర్థ్యం ఉన్న కార్యకర్తను గుర్తించాలి, బాధ్యత అప్పగించాలి. 6) ఆ కర్తవ్యాన్ని నిర్వహించవలసిన మార్గాన్ని కూడా సూచించాలి. ఈ ఆరు అంశాల పట్ల స్పష్టత ఇవ్వగలిగితే అదే కనీస ప్రణాళిక అవుతుంది. పరిస్థితులను బట్టి, వస్తున్న మార్పులను బట్టి ఈ ప్రణాళికలో కూడా తగు సవరణలు చేసుకోవచ్చు. పథకం ప్రకారం పని అన్నా లేదా ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నా అర్థం ఇదే.

నిర్దిష్ట ప్రాంతంలో లేదా రంగంలో సాధించవలసిన ఫలితాల కోసం ప్రణాళిక రూపొందించుకునేటప్పుడు అందుకు అవసరమైన సమాచారం సేకరించుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువ సమాచారం సేకరించాలి. తద్వారా సరైనవి ఎంచుకోవడానికి మనకు అవకాశాలు పెరుగుతాయి. తక్కువ సమాచారం సేకరించి తక్కువ అంశాలనే పరిశీలించినప్పుడు ఉన్న పరిమిత అవకాశాలలోనే ఉన్నతమైనది ఎంపిక చేసుకోగలుగుతాము. ఎక్కువ సమాచారంతో

**“అనేక అనుకూల, ప్రతికూల అంశాల మధ్య ఏదో ఒకటి కీలకమైన అంశం ఉంటుంది. ఆ కీలకాంశాన్ని గుర్తించి దానిని పరిష్కరించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. ఉదాహరణకు భారతదేశ ఆర్థికవ్యవస్థను సమూ లంగా మార్చివేయాలని మన పార్టీ నిర్ణయిం చుకున్నది. సమాజంలో ఉన్న అనేక వర్గాలను గుర్తించింది. శతృవర్గాలను, మిత్ర వర్గాలను విశ్లేషించింది.”**

ఎక్కువ అవకాశాలను పరిశీలించినప్పుడు అంతకన్నా ఉన్నతమైన మార్గం అందుబాటులోకి రావచ్చు. కలిసి పనిచేయడానికి అవసరమైన సంస్థలను గురించి పరిశీలించేటప్పుడు సాధ్యమై నన్ని ఎక్కువ సంస్థలను నేను పరిగణనలోకి తీసుకోగలిగినప్పుడే ఉన్నతమైన అవకాశాన్ని వినియోగించుకోగలుగుతాను. తక్కువ సంస్థలనే పరిగణలోకి తీసుకున్నప్పుడు వాటికన్నా ఉన్నత మైన సంస్థ వాటి వెలుపల ఉండవచ్చు. ఎంపిక చేసుకునేందుకు నాకు అవకాశమే ఉండక పోవచ్చు. అందుకే ఉన్న అవకాశాలన్నీ పరిశీలిం చాలి. ఎక్కువ సమాచారం సేకరించడం ద్వారానే అది సాధ్యం. నిర్దిష్ట ప్రాంతంలో, లేదా రంగంలో పని చేసేందుకు ఉన్న అనుకూ లతలనూ, ప్రతికూలతలను కూడా గుర్తించాలి. అనుకూల అంశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతికూల అంశాలను సాధ్యమైనంత పరిమితం చేసుకునేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించుకోవాలి. అనేక అనుకూల, ప్రతికూల అంశాల మధ్య ఏదో ఒకటి కీలకమైన అంశం ఉంటుంది. ఆ కీలకాంశాన్ని గుర్తించి దానిని పరిష్కరించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. ఉదాహరణకు భారతదేశ ఆర్థికవ్యవస్థను సమూ లంగా మార్చివేయాలని మన పార్టీ నిర్ణయిం చుకున్నది. సమాజంలో ఉన్న అనేక వర్గాలను గుర్తించింది. శతృవర్గాలను, మిత్ర వర్గాలను విశ్లేషించింది. అనేక సమస్యలను గుర్తించింది. ఈ వ్యవస్థను మౌలికంగా మార్చివేసే కృషిలో భూస్వామ్య సంబంధాలను బద్దలు కొట్టటమే అత్యంత కీలకమైన కర్తవ్యంగా గుర్తించింది. సమస్యలు అనేకం ఉన్నాయి. కానీ భూ సమస్య పరిష్కారం ద్వారా ఇతర సమస్యలు వేగంగా పరిష్కరించుకోడానికి మార్గం సుగమవుతుందని పార్టీ అంచనా. ఇక్కడ భూస్వామ్య సంబంధా లను బద్దలు కొట్టడం కీలకాంశం. నేను పని చేయవలసిన ప్రాంతం లేదా రంగంలో కూడా అనేక సమస్యలున్నప్పటికీ వాటిలో కీలక సమస్యను గుర్తించేందుకు ప్రయత్నించాలి. దాన్ని పరిష్కరించడం ద్వారా మిగతా కర్తవ్యాలు నిర్వహించడం సులభతరం అవుతుంది. ఫలితాలు సాధించడం సాధ్యమవుతుంది. ప్రణాళిక రూపొందించడంలో కీలకాంశాన్ని గుర్తించడమే కేంద్ర బిందువు. ఆ ప్రాంతం లేదా రంగంలో ఉన్న పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే అది సాధ్యం.

కీలక కర్తవ్యం పట్ల రెండు పొరపాటు ధోరణులు వ్యక్తమవుతున్నాయి. అవి, 1) కీలక కర్తవ్యాన్ని మాత్రమే చూడటం 2) అన్ని కర్తవ్యాలకు సమ ప్రాధాన్యతనివ్వటం. కీలక కర్తవ్యం పేరుతో ఆ ఒక్కదానికే పరిమితమై మిగతా కర్తవ్యాలన్నింటినీ విస్మరించడం సరైంది కాదు. మనకున్న వనరులలో ముఖ్యమైన భాగం కీలక కర్తవ్యాలకు కేటాయించుకుంటాము. మిగతా కర్తవ్యాలు శక్తిమేరకు నిర్వహించేందుకు ప్రయత్నిస్తాము. అంతే తప్ప పూర్తిగా విస్మరించకూడదు. మరోవైపు అన్ని కర్తవ్యాలకు సమ ప్రాధాన్యతనివ్వడమంటే కీలక కర్తవ్యాన్ని విస్మరించటమే. దీనివల్ల లక్ష్యసాధన సాధ్యం కాదు. వనరులను తగు లక్ష్యం లేకుండానే వెద జల్లినట్టవుతుంది. అందువల్ల ఈ రెండు పొర పాటు ధోరణులకు లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదాహరణకు పది కర్తవ్యాలను ప్రాధాన్యతా క్రమంలో రాసినప్పుడు మొదటి కర్తవ్యం, పదవ కర్తవ్యం సమాన ప్రాధాన్యత కలిగి ఉంటాయనుకోకూడదు. అదే సమయంలో మొదటిది మినహా మిగిలినవి కర్తవ్యాలే కాదని భావించకూడదు. అందుబాటులో ఉన్న ఆర్థిక, కార్యకర్తల వనరు లను అదే ప్రాధాన్యతా క్రమంలో కేటాయిం చుకోవాలన్న విషయం గుర్తుంచుకోవాలి.

పార్టీ నిర్మాణం పట్ల సమగ్ర దృక్పథం అలవర్చుకోవాలి. సాధారణంగా తమకు కేటాయించిన రంగం లేదా ప్రాంతం పరిధిలోనే ఆలోచించడం చూస్తుంటాము. ఇది సరైంది కాదు. ఒక కార్యకర్త ఏ రంగంలో ఉన్నా లేదా ఏ ప్రాంతానికి బాధ్యత వహిస్తున్నా దేశవ్యాపి తంగా పార్టీ బలోపేతమయితేనే విప్లవం సాధ్యమన్న విషయం గుర్తించాలి. తాను పనిచేస్తున్న రంగం లేదా ప్రాంతంలో మాత్రమే బలపడితే విప్లవం రాదు. తన చుట్టూ ఉన్న మిగతా రంగాలు, మిగతా ప్రాంతాల్లో కూడా పార్టీ బలోపేతం కావాలన్న స్పృహతో ఉండాలి. అందుకనుగుణంగా పార్టీ నిర్దేశించిన మేరకు పరస్పర సహకారంతో కృషి చేయాలి. దీనర్థం తనకు అప్పగించిన ప్రాంతం లేదా రంగాన్ని వదిలిపెట్టి ఇతర పనులు చేయాలని కాదు.

పార్టీ పెరుగుదల అంటే కూడా సమగ్రమైన అవగాహన అవసరం. పార్టీ సభ్యత్వం పెరగాలి. అది విప్లవ చైతన్యంతో కూడిన సభ్యత్వం అయి ఉండాలి. అత్యధిక జనాభా కలిగి, అనేక భాషలు, కులాలు, మతాలతో విశాలంగా ఉన్న భారతదేశంలో అందుకు తగిన సంఖ్యలో పార్టీ సభ్యులు లేకుండా లక్ష్యం సాధించలేము. అందుకే పార్టీ బలం గురించి పరిశీలించినప్పుడు పార్టీ సభ్యత్వం ఒక ప్రాతిపదిక అవుతుంది. కేవలం పార్టీ సభ్యులే విప్లవం సాధించజాలరు. శ్రామిక జన సందోహం ప్రత్యక్షంగా పాల్గొనేది విప్లవం. అందుకే రాజకీయ సమస్యల మీద ప్రజా సమీకరణ శక్తి కూడా ఒక ముఖ్యమైన ప్రాతిపదిక. ఆర్థిక సమస్యల మీద సహజంగానే సమస్యల తీవ్రతను బట్టి ప్రజల కదలిక ఉంటుంది. అది ప్రజల అవసరాన్ని బట్టి వారి భాగస్వామ్యాన్ని నిర్ణయిస్తుంది. దాన్ని పార్టీ బలంగా భావించలేము. అందుకే రాజకీయ సమస్యలపైన ప్రజాసమీకరణ శక్తినే ప్రాతిపదికగా తీసుకోగలం. ఎన్నికల రంగంలో పనిచేస్తున్నంత కాలం ప్రజా పునాదికి ఓట్లు కూడా ఒక ప్రాతిపదిక అవుతాయి. పార్టీకి ఉన్న పరపతి, బలాన్ని బట్టే నిధి వసూళ్ళకు అవకాశం ఉంటుంది. అందువల్ల నిధి వసూళ్ళ సామర్థ్యం కూడా ఒక ప్రాతిపదిక. పార్టీని నడిపించడంలో పార్టీ పత్రికల పాత్ర విస్మరించరానిది. దిన పత్రికలు, వార పత్రికల సర్క్యులేషన్ మరో ప్రాతిపదిక అవుతుంది. వీటన్నింటినీ మించి పార్టీ నిర్ణయాలు రూపొందించడంలో పార్టీ శాఖల పాత్ర ముఖ్యమైన ప్రాతిపదిక అవుతుంది. ఈ ఆరు అంశాలను కలిపి చూసినప్పుడే ఆ ప్రాంతంలో లేదా రంగంలో పార్టీ బలాన్ని అంచనా వేయగలం.

❊

# మార్పుచెందుతున్న మధ్యతరగతి



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

మధ్యతరగతి, పట్టణాలలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల అధ్యయనానికి పార్టీ ఏర్పాటు చేసిన అధ్యయన బృందం ఆ సమస్యలను అధ్యయనం చేసి, నివేదికను రూపొందించింది. ఆధునిక మధ్యతరగతి రూపొందిన తీరు, వారికి ఉన్న అవకాశాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆలోచనా తీరు తదితరాలను నివేదికలో పొందుపరిచారు.

పట్టణాలలో మధ్యతరగతి ప్రజల సంఖ్య పెరుగుతున్నది. దేశ జనాభాలో 5 నుండి 20 శాతం వరకు మధ్యతరగతి ప్రజలు ఉంటారని అంచనాలున్నాయి. ప్రభుత్వరంగంలో పరిశ్రమలు ఏర్పాటు కావటం, ప్రైవేటురంగంలో పరిశ్రమలు, వాణిజ్యం విస్తరించటం, ఆధునిక, ఆంగ్లవిద్యకు, గ్రామీణపేదలకు ఉపాధి కల్పించే కేంద్రాలుగా పట్టణాలు ఉండటం తదితర కారణాల రీత్యా గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పెరిగాయి. శివారు గ్రామాలను పట్టణాలలో కలపటం కూడా పట్టణాల విస్తరణకు దోహదం చేసింది. పట్టణాల నుండి వస్తున్న ఆదాయం పెరిగి జిడిపిలో 60 శాతానికి చేరింది. ఉపాధి, రాజకీయాలు, ప్రజా ఉద్యమాలకు పట్టణాలు కేంద్రాలుగా మారుతున్నాయి. అభివృద్ధి, సంపద, సదుపాయాలు పట్టణాలలో కేంద్రీకృతమౌ తున్నాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణరంగాల కార్యకలాపాలు విస్తరిస్తుండటంతో పట్టణాలలో మౌలిక సదుపాయాలు కూడా పెరుగుతున్నాయి. కుల, మతాలతో నిమిత్తం లేకుండా ధనికులందరూ పట్టణ శివారు ప్రాంతాలకు తరలిపోతున్నారు. వారు నివసిస్తున్న ప్రాంతాలకు ప్రభుత్వం, పట్టణాభివృద్ధి సంస్థలు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాయి. పేదలు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారు, మధ్యతరగతిలోని దిగువ భాగం పాతబస్తీలలోనే నివసిస్తున్నారు. సౌకర్యాలు, సదుపాయాల లేమితో ఈ ప్రాంతాలు కునారిల్లు తున్నాయి. పట్టణ పేదలను వేధిస్తున్న వాటిలో ఇళ్ళకొరత ప్రధాన సమస్యగా ఉన్నది. పట్టణాలలోని ఇళ్ళ కొరత, పేదలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకో కుండా 100 ఆధునిక నగరాల (స్మార్ట్‌సిటి)ను నిర్మించటానికంటూ 7,000 కోట్ల రూపాయలను కేటాయించింది. సరళీకరణ విధానాల అమలులో భాగంగా ఒకవైపున పట్టణాలను ఆధునిక నగరా లుగా అభివృద్ధి చేయటానికి ప్రయత్నిస్తూ, మరో వైపున ప్రజలకు అందిస్తున్న వివిధ రకాలైన సేవలు, కల్పిస్తున్న సదుపాయాలపై పన్నులను విధిస్తున్నది.

**పట్టణ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు**

అభివృద్ధిలో పట్టణీకరణ అత్యంత ప్రధానాం శమని పాలకపార్టీలు ప్రచారం చేస్తున్నాయి. పట్టణ ప్రజలకు సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రచారం చేస్తున్న పాలకపార్టీలు అభివృద్ధి కోసం పురపాలక సంస్థలకు ఇస్తున్న నిధులను, సబ్సిడీలను తగ్గిస్తూ, రుణాలను పెంచటం ద్వారా వాటిపై భారం మోపుతున్నాయి. పురపాలక సంస్థలు అందిస్తున్న వివిధ సేవలకు వినియోగఛార్జీలను విధిస్తూ ప్రజ లందరిపై భారాలు వేస్తున్నాయి. మురికివాడలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతూనే ఆ పేటల్లో నివసిస్తున్న వారిలో అత్యధికులను అక్కడి నుండి ఖాళీ చేయిస్తున్నారు. సరళీకరణ విధానాల అమలు లో భాగంగా రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించటంతో పట్టణాలలో భూముల ధరలు మధ్యతరగతికి కూడా అందుబాటులో లేకుండా పెరిగాయి. పేదలు, కార్మికవర్గం, మధ్యతరగతిలోని దిగువ తరగతిపై పట్టణ సంస్కరణలు మోయలేని భారాలను మోపుతున్నాయి. ఈ సంస్కరణల వలన ప్రయోజ నం పొందిన ఎగువ మధ్యతరగతికి చెందినవారు సంస్కరణలకు గట్టి మద్దతుదారులుగా ఉన్నారు.

**మధ్యతరగతిలో వస్తున్న మార్పులు**

ఈ కాలంలో మధ్యతరగతిలో చాలా మార్పులు వచ్చాయి. స్వాతంత్ర్యానికి ముందుకాలం లో వ్యవసాయేతర ఎగువ కులాల నుండి మధ్య తరగతి ఆవిర్భవించింది. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వలన లబ్ధిపొందిన ఒకభాగం మధ్య తరగతిగా అభివృద్ధి అయింది. సాంప్రదాయకంగా భూములపై యాజమాన్యం ఉన్న కులాలలోనే కాకుండా, గతంలో భూములపై యాజమాన్యంలేని, వృత్తిదారులుగా ఉన్న, వ్యవసాయ అనుబంధ రంగాలలో పనిచేస్తున్న కులాల నుండి కూడా మధ్యతరగతి అభివృద్ధి అయింది. వ్యవ సాయ, వ్యవసాయేతర కులాలుగా ఉన్నవారిలో ప్రభుత్వరంగం, ప్రైవేటు రంగ పరిశ్రమలలో ఉద్యోగాలు పొందినవారు, రిజర్వేషన్ల వలన ప్రభుత్వరంగ పరిశ్రమలలో ఉద్యోగాలు పొందిన దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు తదితరుల నుండి మధ్యతరగతి రూపొందింది. 1990లలో నయా ఉదారవాద విధానాలు ప్రారంభం కావటం, సేవారంగం విస్తరించటంతో మధ్యతరగతిలో నూతన విభాగాలు ఆవిర్భవించాయి.

మధ్యతరగతి ఒకవర్గం కాదు. కార్మికవర్గం నుండి సంపన్నుల వరకు వివిధ వర్గాలకు చెందినవారు ఈ తరగతిలో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, మేధావులు తదితరులు వీరిలో ఉన్నారు. సరళీ కరణ విధానాలతో సమాజంలో వీరు నిర్వహించే పాత్రలో మార్పులు వచ్చాయి. గతంలో వీరు తమ వృత్తిని నిర్వహించుకుంటూ మిగిలిన కాలాన్ని

> **"ఈ పరిణామాలను చూసి కమ్యూనిస్టు ఉద్యమానికి, ముఖ్యంగా సిపిఐ (యం)కు మధ్యతరగతిలో పట్టుతగ్గిందని, అందుకు పార్టి అనుసరించిన ఎత్తుగడల విధానమే కారణమని కొందరు ప్రచారం చేస్తు న్నారు. ఇది పాక్షిక సత్యం మాత్రమే. మధ్యతరగతి ఆవిర్భావ, అభివృద్ధి క్రమాన్ని అర్థం చేసుకోకుండా పైకి కనిపించే అంశాల ప్రాతిపదికగా వీరు విమర్శ చేస్తున్నారు."**



ఐటి రంగం నూతన మధ్య తరగతిని సృష్టించింది

యూనియన్లు, రాజకీయ, సేవా కార్యక్రమాలకు వినియోగించేవారు. వ్యాపారాలు, ఇతర ఆర్థిక కార్యకలాపాలకు, భవిష్యత్తులో తమ పిల్లలు ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా వారిని తీర్చిదిద్దటానికి ఇపుడు తమ అదనపు కాలాన్ని వినియోగిస్తున్నారు.

**నూతన మధ్యతరగతి వామపక్ష భావజాలం**

సాంప్రదాయక మధ్యతరగతిని వామపక్ష, అభ్యుదయ భావజాలం ప్రభావితం చేసింది. స్వాతంత్ర్యానికి పూర్వం మధ్యతరగతిపై జాతీ యోద్యమ ప్రభావం బలంగా ఉంది. జాతీయో ద్యమ నాయకులుగా ఈ తరగతి నుండి అనేక మంది రాజకీయ రంగంలోకి వచ్చారు. వీరు జాతీ యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనటం, లేదా ఉద్యమానికి సహాయ సహకారాలను అందిం చటం చేశారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం అమలు చేసిన స్వతంత్ర ఆర్థికాభివృద్ధి వ్యూహాన్ని మధ్యతరగతి బలపరిచింది. దేశీయంగా పారిశ్రామి కాభివృద్ధి సాధించి, దిగుమతులపై ఆధారపడే విధానానికి స్వస్తి పలకటం, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయటం, ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించటం, విద్య, వైద్యరంగాల అభివృద్ధి తదితరాలకు ఈ తరగతి మద్దత్తు నిచ్చింది. ఈ తరగతిపై వామపక్ష భావజాలం కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపింది. జాతీ యోద్యమంలో భాగంగా అభివృద్ధి అవుతున్న కమ్యూనిస్టుపార్టీకి కొందరు సహాయ సహకారాలు అందించారు. సోవియట్ యూనియన్‌లో విప్లవం జయప్రదం అయిన తర్వాత సోషలిజానికి గట్టి మద్దత్తుదారులుగా మారారు. కమ్యూనిస్టు, అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేయటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. స్వాతం త్ర్యానంతరం కూడా సోషలిస్టు, అభ్యుదయ, లౌకికవాద భావజాలానికి మద్దత్తుదారులుగా ఉన్నారు.

సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత ఆవిర్భవించిన మధ్యతరగతి ఇందుకు భిన్నమైన దృక్పథంతో ఉన్నది. వామపక్ష, అభ్యు దయ భావజాలానికి దూరంగా ఉంటూ సరళీకరణ విధానాలకు మద్దత్తు ఇస్తున్నారు. ఈ పరిణా మాలను చూసి కమ్యూనిస్టు ఉ ద్యమానికి, ముఖ్యంగా సిపిఐ (యం)కు మధ్యతరగతిలో పట్టుతగ్గిందని, అందుకు పార్టి అనుసరించిన ఎత్తుగడల విధానమే కారణమని కొందరు ప్రచారం చేస్తు న్నారు. ఇది పాక్షిక సత్యం మాత్రమే. మధ్యతరగతి ఆవిర్భావ, అభివృద్ధి క్రమాన్ని అర్థం చేసుకోకుండా పైకి కనిపించే అంశాల ప్రాతిపదికగా వీరు విమర్శ చేస్తున్నారు. సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత ఆవిర్భవించిన మధ్యతరగతి వినియోగదారీ దృక్పథంతో, తమ స్వప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. వివిధ అభివృద్ధి నిరో ధక, సనాతన భావజాలానికి, సామ్రాజ్యవాదం పెంచిపోషి స్తున్న వినియోగదారీ విలువలకు మద్దత్తు దారులుగా, ప్రచారకులుగా ఉన్నారు. కెరీ రిజం మినహా సమాజాన్ని గురించి ఆలోచించటం, తోటివారికి తోడ్పాటునందించ టం తదితరాలు వారికి పట్టవు. తమ స్వప్రయోజనాలను గురించి మాత్రమే ఆలోచించేవారికి అభ్యుదయ భావజాలం ఆటంకంగా పరిణమిస్తుంది. సామాజికాభివృద్ధికి తోడ్పాటును అందించటం కూడా తమకు సంబంధించని విషయంగా భావిస్తారు. సరళీకరణ విధానాలు ప్రారంభం కావటానికి ముందున్న మధ్యతరగతి దేశ స్వాతంత్ర్యసాధన, దేశాభివృద్ధి కోసం కృషిచేయగా, సరళీకరణ విధానాలు అమలు జరుగుతున్న కాలంలో అభివృద్ధి అయిన మధ్యతరగతి తమ వ్యక్తిగత ప్రయోజనాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నది. కాబట్టి సాంప్రదాయ కంగా అభివృద్ధి చెందిన మధ్యతరగతిలో వామపక్ష భావజాలం పట్టు సాధించగా, నయా ఉదారవాద విధానాల కాలంలో అభివృద్ధి అయిన మధ్యత రగతిలో వామపక్షేతర, కమ్యూనిస్టు వ్యతిరేక భావజాలం పట్టుసాధించింది.

ప్రపంచీకరణ ఫలితంగా ఆవిర్భవించి, సేవారంగంలో నిమగ్నమైన తరగతిని సరికొత్త మధ్యతరగతిగా పిలుస్తున్నారు. ఈ తరగతికి చెందిన విలువలు, ఆకాంక్షలు సమాజమంతటా వ్యాపించటం ప్రధానమైన అంశంగా ఉన్నది. వీరిని మూడు విభాగాలుగా వర్గీకరించవచ్చు. అత్యధిక ఆదాయాన్ని పొందుతూ ఆధునిక జీవితాన్ని గడిపేవారు మొదటి తరగతి కిందికి వస్తారు. వీరు ఎక్కువగా ఐటి, ద్రవ్యసంస్థలలో పనిచేస్తుంటారు. ఐటి, ఫార్మారంగాలలో అదనపు విలువను ఉత్పత్తి చేస్తున్నవారు కార్మికులే అవుతారు. సాపేక్షంగా ఎవరి వేతనాలైతే మధ్యస్తంగా ఉంటాయో, ఎవరైతే ఆధునిక జీవితం గడపటానికి పెనుగులా డుతుంటారో వారు రెండవ తరగతి కిందికి వస్తారు. ప్రసార మాధ్యమం, మౌలిక సదుపా యాల రంగం, కార్పొరేట్ కార్యాలయాలలో వీరు పని చేస్తుంటారు. రియల్ ఎస్టేట్, మైక్రోఫైనాన్స్, చిట్‌ఫండ్ కంపెనీలు తదితరాలలో పనిచేస్తూ, అదనపు ఆదాయాన్ని పొందుతున్నవారు మూడవ తరగతిలోకి వస్తారు.

### నూతనతరం

మధ్యతరగతికి చెందిన యువజనులు క్రియాశీలురు, సానుకూల దృక్పథం కలవారుగా ఉన్నారు. ఐటిరంగంలో పనిచేసేవారి సగటు వయసు 28 సంవత్సరాలు. వీరు నయా ఉదారవాద ప్రభావానికి లోనుకావటంలో, ఆ విలువలను ప్రచారం చేయటంలో అగ్రభాగాన ఉంటూ ఇతర రంగాలలోని యువజనులను కూడా ప్రభావితం చేస్తున్నారు. పట్టణ జనాభాలో మూడింట ఒకవంతు యువజనులు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగాన్ని కలుపుకుంటే అసంఘటితరంగంలో 94 శాతం ఉద్యోగాలు ఉన్నాయి. రియల్ ఎస్టేట్, పర్యాటక రంగం, ద్రవ్యరంగం, ప్రసార మాధ్యమం, విద్య, ఆరోగ్య సంరక్షణ, కన్సల్టెన్సి, రిటైల్ బిజినెస్, మాల్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్స్, రవాణా , ప్రైవేటు కార్యాలయాలు, నిర్మాణరంగం, మౌలిక సదుపాయాల రంగం, గృహ నిర్మాణం, తదిత రాలలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంతకు ముందు పరిమితంగా ఉన్న దళారితనం ఇపుడు కిందిస్థాయికి వచ్చింది. పట్టణ మధ్యతరగ తిలోని మధ్య, దిగువస్థాయి వారికి ఇది స్వయం ఉపాధిని కల్పిస్తున్నది.

వస్తుతయారి, వ్యాపారరంగంలో ఆటో మేషన్ ప్రవేశించిన ఫలితంగా ఐటి, బిపిఓ పరి శ్రమలు అభివృద్ధి చెందాయి. ఈ రంగంలోని ఉద్యోగాలు రెండు విధాలుగా కుదించుకు పోతున్నాయి. అత్యున్నత నైపుణ్యం అవసరం అయిన ఉద్యోగాలు అభివృద్ధి చెందిన దేశాలకు, తక్కువ నైపుణ్యం అవసరం అయిన ఉద్యోగాలు చౌకగా కార్మికులు లభించే వియత్నాం, ఫిలిప్పైన్స్ వంటి దేశాలకు వెళు తున్నాయి. సంవత్సరానికి లక్షల సంఖ్యలో ఇంజనీరింగ్ పట్టభద్రులు తయారవుతుండగా, ఐటిరంగంలో నియామకాలు సంవత్సరానికి 70,000 నుండి 30,000లకు పడిపోయాయి. ఉద్యోగాలలో ఉన్నవారు అభద్ర తతో ఉ ంటున్నారు. దోపిడీని ఉధృతం చేయటం కోసం పాలకవర్గాలు ఆధునిక పద్ధతులను అమలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరి పనితీరును నమోదు చేయటం, గడువులు, అంచనాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని లెక్కిస్తారు. గడువులు విధించటం, వేర్వేరు ప్రదేశాల నుండి పనిచేసే అవకాశం ఉండటం వలన ఇంటివద్ద నుండి పనిచేయమని వత్తిడి వస్తున్నది. ఆఫీసులో రోజుకు 8.8 గంటలు చేసేపనిని ఇంటివద్ద 12 గంటల వరకు పెంచటంతో ఈ పద్ధతి

> **❝ సంపద పెరిగేకొద్దీ పేదలు క్రమంగా లబ్ధిపొందు తారని సరళీకరణవాదులు చెబుతున్న 'ట్రికిల్‌డౌన్' సిద్ధాంతం తప్పని రుజువు అవుతు న్నది. ఆర్థిక కార్యకలాపాలు పెరగటంతో మరింత డబ్బు చెలామణిలోకి వచ్చింది. ఇది మధ్య తరగతి జీవన విధానాన్ని, సామాజిక చైతన్యాన్ని ప్రభా వితం చేసింది. మానవ సంబంధాలకు ప్రాధాన్యత తగ్గి, డబ్బు సంబంధాలు వారిని కలుపుతున్నాయి. ❞**



గ్రామీణప్రాంతాలకూ విస్తరించిన రియల్ ఎస్టేట్ రంగం మధ్యతరగతిపై ప్రభావం చూపుతోంది

పనిగంటల పెరుగుదలకు దోహదం చేస్తుంది. ఈ రంగంలో దోపిడీ అధికంగా ఉన్నప్పటికీ సాంప్రదాయ పద్ధతుల్లో వీరిని సంఘటితం చేయటం చాలాకష్టం. ఎక్కువ వేతనాలు పొందటం, వృత్తి నైపుణ్యాన్ని పెంపొం దించుకోవటం కోసం వీరు తరచుగా వృత్తిని, యజమానిని మారుస్తారు. వేతనాల పెంపుకోసం పోరాటం చేసే స్థానంలో ఉ ద్యోగాన్ని మార్చుకో వటం వచ్చింది. కాబట్టి సంఘటితం కావటం అనేది కాలం చెల్లిన భావనగా ఉన్నది. పని స్వభావం, పనిచేసే ప్రాంతాలు, పని పద్ధతుల రీత్యా వీరిని సంఘటితం చేయటం కష్టం. ప్రభుత్వ విధానాల ఫలితంగా వీరు నివాసప్రాంతాలలో కూడా దోపిడీకి గురవుతున్నారు.

### ఆధునిక మధ్యతరగతి లక్షణాలు

వేతనాలు, లాభాలు, కమిషన్లు, బ్రోకరేజి, రుణాలు, ప్రభుత్వ పథకాలు తదితరాల ద్వారా వీరు లబ్ది పొందుతుంటారు. వీటి ఫలితంగా ఆదాయాలు పొందుతున్నవారు సంస్కరణలు కొనసాగాలని కోరుకుంటున్నారు. వీరు అభిప్రా యాల సృష్టికర్తలు. ఆధిపత్య భావజాలానికి తేలికగా గురై వాటిని ప్రచారం చేస్తుంటారు. ఏ సమస్య ఎదురైనా ఉద్రేకంతో ఊగిపోతుంటారు. సులభంగా విజయం సాధించాలనుకోవటం, తమ కన్నా తక్కువస్థితిలో ఉన్నవారిని తేలికభావంతో చూడటం, తక్షణ ఫలితాలను ఆశించటం తదిత రాలు వీరి లక్షణాలుగా ఉన్నాయి. వీరు మొత్తంగా నయా ఉదారవాదానికి మద్దత్తుదారులే అయిన ప్పటికీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం దేశసంప దను కబళిస్తున్నదని భావించటంతో అవినీతికి వ్యతిరేకంగా ఇటీవల జరుగుతున్న పోరాటాలలో ఎక్కువ మంది పాల్గొంటున్నారు. వామపక్షాలతో సహా రాజకీయాలన్నా, రాజకీయ నాయకులన్నా వీరు విముఖంగా ఉంటారు. సత్పరిపాలన, నూతన రాజకీయాలకు మోడిని ప్రతినిధిగా భావించటంతో వీరిలో రాజకీయాల పట్ల వైముఖ్యం తగ్గింది. ఢిల్లి ఎన్నికలలో ఆప్‌కు మద్దత్తు ఇచ్చారు.

సంపద పెరిగేకొద్దీ పేదలు క్రమంగా లబ్ధిపొందుతారని సరళీకరణవాదులు చెబుతున్న 'ట్రికిల్‌డౌన్' సిద్ధాంతం తప్పని రుజువు అవుతు న్నది. ఆర్థిక కార్యకలాపాలు పెరగటంతో మరింత డబ్బు చెలామణిలోకి వచ్చింది. ఇది మధ్య తరగతి జీవన విధానాన్ని, సామాజిక చైతన్యాన్ని ప్రభా వితం చేసింది. మానవ

❝ ఈ పరిస్థితిలో క్రమంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. యువజనులలో రాజకీయాల పట్ల ఆసక్తి పెరుగుతున్నది. యువతను ఆకర్షిం చటానికి, వారి మద్దత్తు పొందటానికి అన్ని రాజ కీయ పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. బాలలు, కౌమారదశలోని వారిని లక్ష్యంగా చేసుకొని వివిధ సంస్థలు వాణిజ్య ప్రకటనలు రూపొందిస్తున్నాయి.❞


ప్రైవేటు పరమవుతున్న ప్రభుత్వ పార్కులు

సంబంధాలకు ప్రాధాన్యత తగ్గి, డబ్బు సంబంధాలు వారిని కలుపుతున్నాయి. మార్కెట్‌లోకి వచ్చిన ప్రతి నూతన ఉత్పత్తి ని స్వంతం చేసుకోవాలనే మోజు పెరిగింది. ఇది నయా నాగరికతగా, సామాజిక హోదాగా మారిపోయింది.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి కావటం, హరిత విప్లవంతో ఒబిసిలలో మధ్యతరగతి ఉనికిలోకి వచ్చింది. దళితులు, గిరిజనుల్లో రిజర్వేషన్లు ఇలాంటి మార్పునే తీసుకువచ్చాయి. మధ్యతరగతిలో ప్రస్తుతం ఒబిసిలు గణనీయమైన భాగంగా ఉన్నారు. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు లేకపోవటంతో దళితులు, గిరిజనులు ఇక్కడ కనిపించరు. మధ్య తరగతిలోకి ప్రవేశించిన దళితులలో కొందరు ఉన్నతస్థానాలకు చేరుకున్నారు. వ్యాపారులు, కాంట్రా క్టర్లుగా మారారు. ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న అణగారిన తరగతులకు చెందినవారు కార్మిక సంఘాలలో సభ్యులుగా ఉంటున్నప్పటికీ, కులసంఘాలలో సంఘటితం అవుతున్నారు. వర్గం కన్నా కులపరమైన గుర్తింపుకే వారు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ అంశాలను గమనంలోకి తీసుకో వటం ద్వారా మాత్రమే వీరిని కార్మికసంఘాలలో సంఘటితం చేయటం సాధ్యం అవుతుంది. పట్టణాలలో అంటరానితనం కనిపించనప్పటికీ వివిధరూపాలలో వివక్ష కొనసాగుతున్నది. సామాజిక జీవనంలో మహిళలు క్రియాశీలంగా పాల్గొనటం పెరిగింది. ఫలితంగా పనిస్థలంలో, బహిరంగ ప్రదేశాలలో మహిళల భద్రత ప్రధానాం శంగా ముందుకొస్తున్నది. స్త్రీలపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా నిరసనలు పెరుగుతున్నాయి. లైంగిక వివక్షకు వ్యతిరేకంగా , సమానత్వం కోసం జరిగే పోరాటాలకు మద్దత్తు పెరుగుతున్నది. విద్యాధిక, మధ్యతరగతి మహిళలలో చైతన్యం పెరుగుతున్నది. రకరకాలైన సామాజిక పరిణా మాలు కుటుంబంలో ప్రతిబింబిస్తున్నాయి. పిల్లల పెంపకం, వృద్ధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్త తదితరాలలో కొత్త సమస్యలు వస్తున్నాయి.

ప్రజలకు వినోదం, శారీరక, మానసిక ఆరోగ్యాలకు దోహదం చేసే పార్కులు, ఈతకొలనులు తదితరాలన్నింటినీ ప్రభుత్వం వినియోగ ఛార్జీలతో ముడిపెడుతున్నది. డబ్బు చెల్లించాల్సి రావటంతో సాంస్కృతిక అంశాలకు అవకాశాలు కుదించుకుపోతున్నాయి. పనిభారం, ఆర్థిక సమస్యలు, మార్కెట్ ఒడిదుడుకులు తదిత రాల వలన విపరీతమైన వత్తిడిని ఎదుర్కోవటంతో డాక్టర్లతో పాటు మతగురువులు, బాబాలు, స్వాములు ప్రాధాన్యత సంతరించుకుంటున్నారు. మతతత్వశక్తులు ఈ పరిస్థితిని తమకు అనుకూలం గా మలచుకుంటున్నాయి. అంతర్జాతీయంగా, దేశంలోనూ మార్క్సిస్టు వ్యతిరేక, వామపక్షేతర భావజాలం మేధావులలో ప్రాచుర్యం పొందింది. వామపక్ష ఉద్యమం బలహీనపడటంతో అభ్యు దయ భావజాలవ్యాప్తి తగ్గింది. వివిధరంగాలలో నూతనంగా నియమితమౌతున్న వారికి కార్మిక సంఘాలతో సంబంధాలు లేవు. వారికి మనసంఘ నాయకులకు మధ్య అంతరం ఉండటంతో వారు రాజకీయ రహితంగా మిగిలిపోతున్నారు. అమె రికా, పశ్చిమదేశాలు వీరికి ఆకర్షణీయంగా కని పిస్తూ, సైద్ధాంతికంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక పరిణామాలు ప్రభుత్వ విధానాలకు మధ్య సంబంధాన్ని మరుగుపరచటంలో పాలకవర్గాలు తాత్కాలికంగా సఫలం అయ్యాయి.

ఈ పరిస్థితిలో క్రమంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. యువజనులలో రాజకీయాల పట్ల ఆసక్తి పెరుగుతున్నది. యువతను ఆకర్షిం చటానికి, వారి మద్దత్తు పొందటానికి అన్ని రాజ కీయ పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. బాలలు, కౌమారదశలోని వారిని లక్ష్యంగా చేసుకొని వివిధ సంస్థలు వాణిజ్య ప్రకటనలు రూపొందిస్తున్నాయి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతను మలచటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యువతపై సామాజిక ప్రచార మాధ్యమం ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నది. మిత్రులతో సంబంధాలు, కొత్త స్నేహితులను ఎంచుకోవటం, వారి మధ్య రాజకీయ, సామాజిక భావాలు వ్యాప్తి చెందటానికి ఇది ప్రధాన సాధనంగా ఉన్నది. ప్రస్తుతం యువ తలో ధార్మిక కార్యకలాపాలు, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతున్నది. సాంప్రదాయ పండుగ లను వినియోగించుకొని యువతలోకి చొరబడ టానికి బిజెపి ప్రయత్నం చేస్తున్నది. కేవలం మతం పేరుతో మాత్రమే అందరినీ ఏకం చేయటం సాధ్యం కాదని గ్రహించిన ఆర్‌యస్‌యస్ హిందూ త్వ పరిధిలో కులాలను ఉపయోగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నది.

### విభిన్న తరగతుల మధ్య వైరుధ్యాలు

సామాజిక చెడుగులైన దొంగతనాలు,

నేరాలు, అలజడులు, అపరిశుభ్రత, సుందరీకరణ జరగకపోవటానికి మురికివాడలే కారణమని మధ్యతరగతి భావిస్తున్నది. పేదలకు ఇచ్చే సబ్సిడీలనూ, శ్రామికవర్గం చేసే వివిధ రకాలైన ఆందోళనలు, సమ్మెలు, బంద్‌లు తదితరాలను వ్యతి రేకిస్తున్నది. ఉపాధ్యాయులు క్లాసులలో సరిగా బోధించకపోవటం, ఉద్యోగులు అందుబాటులో ఉండకపోవటం, అవినీతి తదితరాలపై ప్రజలలో ఆగ్రహం పెరుగుతున్నది. అనేక దేశాలలో వినియోగదారీ వ్యతిరేక ఉద్యమాలు కార్పొరేట్ వ్యతిరేక ఉద్యమాలుగా మార్పుచెందాయి. లాటిన్ అమెరికా లో సామాజిక ఉద్యమాల నుండి నూతన శక్తులు పుట్టుకు వచ్చి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదిక ఉద్యమాలకు దారితీశాయి. ఈ అనుభవాల నుండి గుణపాఠాలను తీయవలసి ఉన్నది.

❝ ప్రజలను ప్రభావితం చేయగలిగిన ఈ తరగతులలో కమ్యూనిస్టు ఉద్యమం పట్టు సాధించకుండా ప్రజలలో అభ్యుదయ, వామపక్ష, కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యాపింపచేయటం, మార్క్సిస్టేతర, మార్క్సిస్టు వ్యతిరేక సిద్ధాంతాలు, లౌకికవాద వ్యతిరేక భావజాలంతో చేసే పోరాటం లో పైచేయి సాధించటం సాధ్యంకాదు. ❞

### ప్రస్తుత పరిస్థితి

2010లో ఆర్థికమాంద్యం మొదలవటంతో యువతలో అసంతృప్తి ప్రారంభమైంది. ఉద్యోగావకాశాలు తగ్గుతుండటం అభద్రతను పెంచింది. ఉపాధి కల్పించటానికి పారిశ్రామి కాభివృద్ధి అవసరం. కాని ఆర్థికవ్యవస్థ అందుకు అవకాశాలను కల్పించటం లేదు. అసమ్మతి బద్దల య్యే పరిస్థితి ఏర్పడింది. అభద్రతా భావన, పని సంబంధమైన వత్తిడి పెరుగుతున్నది. ఫలితంగా యువత తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొం టున్నది. ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. నిరు ద్యోగులకు ఉద్యోగావకాశాలు తగ్గటం, అర్హతకు తగిన ఉద్యోగాలు లభించకపోవటం, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో అవినీతి జత కలవటం ఈ వర్గంలో పునరాలోచనకు కారణమౌతున్నాయి. విధానాలు, రాజకీయాలను గురించి ఇపుడు ఆలో చిస్తున్నారు. మధ్యతరగతి సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నందున వారిలో ఇపుడు చైతన్యాన్ని పెంచటం సాధ్యం అవుతుంది. సరైన నినాదాలను, వ్యూహాలను రూపొందించుకుని యువత ముందు ప్రత్యామ్నాయాన్ని ఉంచవలసి ఉంది. ఈ తరగతిని ఆకట్టుకోవటం, ఎంతోకొంత సాధించగలమన్న విశ్వాసాన్ని కల్పించటం కోసం మనం అవసరమైన డిమాండ్లు రూపొందించాలి. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, గృహవసతి, పన్నులు, పౌరసదు పాయాలు, ప్రజాతంత్రహక్కులు, స్త్రీలకు భద్రత కల్పించటం, పర్యావరణం, ఇంకా అనేక సమస్యలు ప్రాధానమైనవిగా ఉన్నాయి. వీటిలోని ప్రతి అంశంపైనా నిర్దిష్టమైన నినాదాలను రూపొందించాలి.

క్షేత్రస్థాయిలో ఉమ్మడి ఆందోళనా పద్ధతులు బృందస్ఫూర్తిని పెంచుతాయి. ఆకస్మికంగా ప్రజలు గుమికూడటం, ఆన్‌లైన్ ఫిర్యాదులు, సామాజిక మాధ్యమాన్ని వినియోగించటం, వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వాములు కావటం, ఆర్‌టిఐ, పిఐయల్‌ను ఉపయోగించటం, ప్రత్యామ్నాయ ప్రసారమాధ్యమాన్ని ప్రోత్సహించటం తదితరాలను వినియోగించుకోవాలి. పండుగల సందర్భాలలో ప్రజలతో పాటు పాల్గొని లౌకిక భావజాలం వైపుకు వారిని ఆకర్షించే ప్రయ త్నం చేయాలి. నాణ్యమైన సేవలను కోరుతున్న ప్రజలు వాటి వ్యయాన్ని భరించలేకపోతున్నారు. కొన్ని ముఖ్యమైన సమస్యలకు సంబంధించి వారి ఆకాంక్షలను వ్యక్తం చేసేందుకున్న అవకాశాలను మనం పోగొట్టుకున్నాం. మధ్యతరగతిని నిర్లక్ష్యం చేశామనే భావం పార్టీలో ఉన్నది. కమ్యూనిస్టు సిద్ధాంతానికి కాలం చెల్లిందని, సోషలిజం విఫలమైందని యువకులు విశ్వసించేలా ప్రచారం చేస్తున్నారు. నవతరాన్ని కమ్యూనిజం వైపుకు ఆకర్షించటమే ఈనాడు మన ముందున్న అతిపెద్ద సవాలు. దీనిని జయప్రదంగా అధిగమించ గలిగితే కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి అవకా శాలు పెరుగుతాయి.

### సంఘ నిర్మాణరూపాలు

సాంప్రదాయ పద్ధతులకు ఆకర్షితులు కాని వృత్తి నిపుణులను రాబట్టటానికి ప్రజాస్వామ్య పని పద్ధతులను అనుసరించాలి. అందుకవసరమైన నూతన నిర్మాణ రూపాలను ఏర్పాటు చేయాలి. ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమాన్ని ప్రోత్సహించి, ఐటి ఉద్యోగులను సంఘటిత పరిచే వేదికగా దీనిని రూపొందించాలి. ఇంజనీరింగ్ కాలేజీలపై కేంద్రీకరించాలి. ఈ పనులు చేసే క్యాడర్‌ను అత్యవసరంగా అభివృద్ధి చేసుకోవాలి. మనం నూతన పోరవేదికలను సృష్టించాలి. లేదా ప్రస్తుతం ఉన్నవాటిలో చేరి పనిచేయాలి. ప్రజల చైతన్య స్థాయికి తగిన నినాదాలను రూపొందించాలి. అందుకు అనుగుణమైన పిలుపులివ్వాలి. నయా ఉదారవాదం ముందుకు తెచ్చిన నూతన సవాళ్ళను ఎదుర్కొనేలా మన క్యాడర్‌కు శిక్షణ ఇవ్వాలి. మన భావజాలాన్ని ప్రచారం చేసేక్రమంలో మనం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కమ్యూనికేషన్ సదుపాయాలను వినియోగించుకోవాలి. నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా పోరాడే మధ్యతరగతికి కార్మికవర్గం మద్దత్తునివ్వాలి. పని స్థలాల్లో పోరాడుతూనే నివాసప్రాంతాలలో కూడా మధ్య తరగతితో కలిసి ప్రభుత్వం, మార్కెట్‌శక్తులు సాగించే దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలలో కార్మికవర్గ నాయకులు పాల్గొనాలి.

### మధ్య తరగతి ప్రాధాన్యత

మధ్యతరగతికి చెందినవారు సామాన్య ప్రజలను నిరంతరం ప్రభావితం చేస్తుంటారు. రచయితలు, కవులు, కళాకారులు, నటులు, సంగీత, నృత్య కళాకారులు తదితరులు వీరిలో ఉంటారు. రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక భావాలను ఈ తరగతి శక్తివంతంగా ప్రచారం చేయగలదు.. సమాజంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న భావాలకు కార్మికవర్గం, పీడిత ప్రజలు, విద్యార్థులు, యువత ఎక్కువగా ప్రభావితం అవుతారు. ప్రజలను ప్రభావితం చేయగలిగిన ఈ తరగతులలో కమ్యూనిస్టు ఉద్యమం పట్టు సాధించకుండా ప్రజలలో అభ్యుదయ, వామపక్ష, కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యాపింపచేయటం, మార్క్సిస్టేతర, మార్క్సిస్టు వ్యతిరేక సిద్ధాంతాలు, లౌకికవాద వ్యతిరేక భావజాలంతో చేసే పోరాటం లో పైచేయి సాధించటం సాధ్యంకాదు. ఈ తరగతులలో పట్టుసాధించటానికి, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, అభ్యుదయ విలువలను ప్రచారం చేయటానికి నిర్దిష్టమైన కార్యక్రమాన్ని రూపొం దించి, అమలు చేయటానికి పూనుకోవాలి. ❋

# నిరుద్యోగాన్ని పెంచిన నోట్ల రద్దు

టి.కె. రాజలక్ష్మి



రచయిత
ప్రముఖ పాత్రికేయురాలు

నోట్ల రద్దు అనంతరం వివిధ రంగాల లో ఉద్యోగ క్షీణత భారీ ఎత్తున కొనసాగు తున్నది. కానీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉన్న ఈ వాస్తవాన్ని పట్టించుకోవడం లేదు. "నేను చేతితో తయారుచేయబడిన వస్తువుల ఎగుమ తిదారుడిని. ఇది దేశంలో ప్రభుత్వరంగ ఉ ద్యోగాల తరువాత రెండవ ఉద్యోగ కల్పనా రంగం. లక్షల సంఖ్యలో ప్రజలు వారి బ్రతుకు దెరువు కొరకు దీనిపై ఆధారపడుతున్నారు. ఈ రంగంలో జరిగే వ్యాపార లావాదేవీలు దాదాపు నగదు రూపంలోనే జరుగుతాయి. చేతివృత్తుల చిత్రకారులు, వ్యాపారస్తుల విద్యా ప్రమాణాల స్థాయి ఇంచుమించు ఒకే విధంగా ఉంటుంది. మా పరిశ్రమ నోట్లరద్దు దెబ్బకు గురై ఇంకా దాని నుండి కోలుకోలేదు. మేము చేతివృత్తి చిత్రకారులకు, తయారీదారులకు చెల్లింపులు చేయలేకపోతున్నాము. ఈ వ్యాపారంలో 22 శాతం నుండి 100 శాతం నష్టాలు వాటిల్లుతున్నాయి. నగదు కొరత కారణంగా నేను కార్మికులకు వారి వేతనాలను మూడు దఫాలుగా చెల్లించాను. ప్రజలు నోట్ల రద్దు నిర్ణయాన్ని విమర్శించడానికి బెదిరి పోతున్నారు. కానీ పిల్లలు మాత్రం రానున్న కాలంలో గుర్తుంచుకుంటారు."

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మొరదాబాద్‌లో ఇత్తడితో తయారుచేసే వస్తువుల ఉత్పత్తి, ఎగుమతిదారుడైన షఫాత్‌ఖాన్ మాట్లాడిన మాటలు. దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రాలలో ఒకటైన మొరాదాబాద్, ఆగ్రాకు చెందిన చిన్న, మధ్యతరగతి పరిశ్రమల అభివృద్ధి సంస్థ అందించిన సమాచారం ప్రకారం ప్రతి సంవత్సరం 2,200 కోట్ల రూపాయల విలువగల ఇత్తడితో తయారైన వస్తువులను ఎగుమతి చేస్తుంది. అక్కడ కొన్ని పెద్దతరహా యూనిట్‌లు ఉన్నాయి కానీ ఆ నగరం యొక్క ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ కల్పనను నిర్వహించేది మాత్రం చిన్నతరహా పరిశ్రమలు.

నగరంలో సుమారు 10 లక్షల మంది ప్రజలు చేతి వస్తువుల ఉత్పత్తి, వ్యాపారంలో ఉన్నారు. ఇక్కడే వేల సంఖ్యలో ఆ వస్తువుల ఎగుమతిదారులు కూడా ఉన్నారు. బ్రతుకుదెరువు కొరకు ప్రధానమైన వనరుగా ఉన్న చేతివృత్తుల ద్వారా వస్తువులు ఉత్పత్తి చేసే పరిశ్రమలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని 18 జిల్లాలలో ఉన్నాయి. కానీ కేంద్రం షఫాత్‌ఖాన్ లాంటి ఎగుమతిదారుల బాధల గురించి పట్టించుకోవడం లేదు.

తాజాగా జరిగిన పార్లమెంట్ సమా వేశాలలో, ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతి పక్షసభ్యులు నోట్లరద్దు కారణంగా ఏర్పడిన ఉద్యోగ క్షీణతకు సంబంధించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించినపుడు ప్రభుత్వం వద్ద దానికి సంబం ధించిన సమాచారం ఏమీ లేదని, ఆ విష యాన్ని ధృవపరిచే ఏ గణాంకాలు లేవని పేర్కొన్నారు.

స్వల్ప, దీర్ఘకాలాలలో ప్రజలు ఎదు ర్కొంటున్న ఆర్థికపరమైన కష్టాలకు సంబం ధించిన గణాంకాలను సేకరించడం అంత ముఖ్యమైన విషయంగా ప్రభుత్వం పరిగణిం చలేదని స్పష్టమవుతుంది. మరొక ప్రశ్నకు స్పందిస్తూ గడచిన మూడు నెలల కాలంలో ఉద్యోగ క్షీణత ఏ రూపంలోనూ లేదని కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ కొట్టిపారేశాడు. 2016 నుండి 2018 వరకు నిరుద్యోగ రేటులో క్షీణత ఉంటుందని తెలియ జెప్పే 'అంతర్జాతీయ కార్మిక సంస్థ' (ILO) నివేదికలో ఉన్న విషయాన్ని ఉటంకించాడు. కానీ నోట్లరద్దు కారణంగా నష్టపోయిన ఉద్యోగాల గురించి మాట్లాడటానికి నిరాకరిం చాడు. సాధ్యమయే పరిస్థితి లేనప్పటికీ, వేతనాల డిజిటలైజేషన్‌ను సులభతరం చేయడానికి అవసరమైన కార్మిక, వేతన చట్టాలను సవరణలు చేయడానికి మాత్రం కేంద్ర కార్మికమంత్రి ముందున్నాడు.

నోట్లరద్దుకు రెండు నెలల ముందు సెప్టెంబర్ 2016లో విడుదల చేయబడిన, లేబర్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించబడిన 5వ వార్షిక ఉద్యోగ–నిరుద్యోగ సర్వే పరిశీలనలు ఈ విధంగా ఉన్నాయి. "ఉద్యోగులుగా గుర్తింప బడిన వ్యక్తులకు, వారు పనికాలంలో ఉన్నంత సమయానికి సరిపడ పని పొందడం లేదు. ఒక వేళ ఏదైనా పని ఉన్నా, వారు అందుబాటులో ఉన్న సమయానికి తగిన విధంగా ఆ పని ఉండడం లేదు. వారి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోని విధంగా వారి పని ఉంటుంది. దాని ఫలితంగా వారు చాలా తక్కువ ఆదాయాలను పొందుతున్నారు. వీరందరూ కూడ ఉద్యోగులుగానే పరిగణిం చబడుతున్నారు."


ఆర్‌యస్‌యస్, బిజెపికి సిద్ధాంతపరంగా కూడ అనుబంధంగా ఉన్న కార్మిక సంఘం, భారతీయ మజ్దూర్ సంఘ్ (బియంయస్) ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించడం ఆశ్చర్యం కాదు. కానీ అనేక పరిశ్రమలు మూతపడిన కారణంగా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న కార్మికులను ఆదుకోవడానికి కేంద్ర బడ్జెట్‌లో ఏ విధమైన కేటాయింపులు చేయకపోవడం పట్ల తీవ్రంగా ప్రతిస్పందించింది. 2.5 లక్షల నమోదు చేయబడని యూనిట్లు బలవంతంగా మూయించబడడం వలన కార్మికులు తీవ్రంగా బాధలు పడుతున్నారు. 'నల్లడబ్బు' తో స్థాపించ బడిన రియల్ ఎస్టేట్ రంగం, కోట్ల మంది కార్మికులను పని నుండి బయటకు నెట్టి తీవ్రంగా దెబ్బతిన్నదని బియంయస్ పేర్కొన్నది. "ప్రభుత్వం తన బడ్జెట్‌లో కార్మికవర్గానికి కొంత కేటాయిస్తూ ప్రకటన చేస్తుందని మేము ఆశించాం, కానీ ఆ పని చేయలేదని", బియం యస్ ప్రధాన కార్యదర్శి వర్జేష్ ఉపాధ్యాయ 'ఫ్రంట్‌లైన్'కు చెప్పడం జరిగింది.

దేశం అంతటా రాజస్థాన్ మోడల్ కార్మిక చట్టాలను ప్రవేశపెడతామన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటనను బియంయస్ ఆక్షేపించింది. అదే విధంగా కార్మిక చట్టాలలో ప్రతిపాదించబడిన మార్పులను దేశంలోని అన్ని కార్మిక సంఘాలు

వృతి రేకిస్తున్నాయని కూడ పేర్కొన్నది. ఊహించిన విధంగానే రాజస్థాన్ రాష్ట్రంలో పెట్టుబడులలో లేదా పారిశ్రామికీకరణలో ఏ విధమైన వేగం పుంజుకోలేదని బియంయస్ పేర్కొన్నది. అదే విధంగా ప్రభుత్వరంగ ఎంటర్‌ప్రైజెస్‌లోని వాటాలను అమ్మాలని, ఫారిన్ ఇన్‌వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (యఫ్ఐపిబి) ని రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాలను బియంయస్ తీవ్రంగా ఆక్షేపించింది. 2016 నవంబర్, 25న "ఈ దేశంలోని సాధారణ ప్రజలు , కార్మికులు నోట్లరద్దును విజయవంతం చేయాలని" బియంయస్ చేసిన విజ్ఞప్తికి అది పూర్తి భిన్నమైనది. అదే విధ:గా ఆ సంఘం నోట్లరద్దు అనంతరం వసూలు చేయబడే ఆదాయం అంతా సామాజిక రంగాలకు, సామాజిక భద్రతా నిధి, మౌలిక సదుపాయాల కల్పనను బలోపేతం చేయడానికి ఖర్చు చేయబడుతుందని ఆశించింది. ఫిబ్రవరి 1వ తేదీన "నోట్లరద్దు ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం వసూలు చేయబడింది, కానీ ఆ మొత్తం సామాజిక రంగాల అభివృద్ధికి ఖర్చు చేయడానికి బదిలీ చేయబడలేదని" బియంయస్ పేర్కొన్నది.

**నష్టాలు, క్షీణతలు:** ప్రభుత్వం కాదన్నప్పటికీ యాజమాన్య సంస్థలచే నిర్వహించబడిన సర్వేలు, అధ్యయనాలు సంక్షోభం యొక్క తీవ్రతను సూచించాయి. నోట్లరద్దు నిర్ణయం అనంతరం 30-35 శాతం ఉద్యోగాలు కోల్పోవడం జరిగిందని, మార్చి నాటికి అది 35-60 శాతంకు పెరుగుతుందని అఖిల భారత ఉత్పత్తిదారుల సంస్థ అంచనా వేసింది. నవంబర్ 8 నోట్లరద్దు ప్రకటన అనంతరం మొదటి 34 రోజులలో ఆ నిర్ణయం యొక్క ప్రభావం ఎలా ఉందని ఎఐయంఒ సర్వే చేయించి, అన్ని పరిశ్రమలు బాగా దెబ్బతిన్నాయని, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు మరింత దెబ్బతిన్నాయన్న నిర్ధారణకు రావడం జరిగింది. 48 శాతం సిబ్బంది తమ ఆదాయాలను కోల్పోయారని "సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ" పేర్కొన్నది. దీనిలో రోజువారీ వేతన కార్మికులు 25 శాతం ఆదాయాలు, వ్యాపారం దెబ్బతిన్న చిన్న వ్యాపారస్తులు, స్వయం ఉపాధి చేసుకునేవారు వీధుల వెంట తిరిగి అమ్ముకునేవారు 8 శాతం, వ్యాపారస్తులు, సంఘటిత రైతాంగం 15 శాతం ఉన్నారు. ఇతరులతో పోల్చిచూస్తే వేతనాలు పొందే ఉద్యోగవర్గం వారిపై ఈ నిర్ణయ ప్రభావం తక్కువగా ఉన్నది. 16 సం.ల కాలంలో డిసెంబర్ మాసంలో ఆటోమొబైల్ అమ్మకాలు చాలా పెద్ద ఎత్తున క్షీణించాయని నివేదికలో పేర్కొనబడినది. కార్మికుల అవసరం తక్కువగా ఉండడంతో పెద్ద ఆటోమొబైల్ కంపెనీలు చాలామంది కార్మికులను తొలగించాయి.

"నవంబర్ 8 నోట్లరద్దు ప్రకటన అనంతరం మొదటి 34 రోజులలో ఆ నిర్ణయం యొక్క ప్రభావం ఎలా ఉందని ఎఐయంఒ సర్వే చేయించి, అన్ని పరిశ్రమలు బాగా దెబ్బతిన్నాయని, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు మరింత దెబ్బతిన్నాయన్న నిర్ధారణకు రావడం జరిగింది. 48 శాతం సిబ్బంది తమ ఆదాయాలను కోల్పోయారని "సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ" పేర్కొన్నది."



నోట్ల రద్దుతో ధరలు పడిపోయి మార్కెట్ యార్డులో దిక్కు తోచక కూర్చున్న రైతు

పంజాబ్‌లోని లూథియానా నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో వలస వెళ్ళారని యునైటెడ్ సైకిల్ అండ్ పార్ట్స్ మన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజీవ్ జైన్ 'ఫ్రంట్‌లైన్' తో చెప్పాడు. "మా వద్ద కేవలం 25-30 శాతం వర్కర్లు మాత్రమే ఉన్నారు. సైకిళ్ళు కావాలన్న ఆర్డర్లు కూడ బాగా క్షీణించాయి. చెక్‌ద్వారా చెల్లింపులు తీసుకోవడానికి కార్మికులు సిద్ధంగాలేరు. వారు వేతనాన్ని కోల్పోతున్నారు". అని జైన్ పేర్కొన్నాడు. ఉత్తర భారతదేశంలో పెళ్ళిళ్ల సీజన్‌లో నోట్లరద్దు నిర్ణయం వలన, సైకిళ్ళు అమ్మకాలు, తక్కువ ఖరీదు ద్విచక్ర వాహనాల అమ్మకాలు తగ్గినాయి. పెళ్ళిళ్ల సమయంలో సైకిళ్ళు, కార్లు సాధారణంగా బహుమతులుగా ఇవ్వబడతాయి. సైకిళ్ళ ఉత్పత్తి , డిమాండ్ తగ్గడమే కాదు, స్టీల్, ప్లాస్టిక్ ధరలు కూడ పెరిగినాయని జైన్ అంటాడు. రెండవ తప్పిదమేమంటే చెల్లింపులు చెక్‌ద్వారా లేదా ఆర్టిజియస్ ద్వారా చేయాలని ఒత్తిడి చేయడం. దాని ఫలితంగా పని నెమ్మదిగా జరుగుతుంది. మేము ప్రధానంగా ప్రభుత్వ టెండర్లపైనే ఆధారపడతాం. మేం విడిభాగాలు సరఫరా చేస్తాం. కమీషన్ కంపెనీలు మా ధరలను తగ్గించమని మమ్ములను అడిగితే, మేం తగ్గించవలసి ఉంటుంది. నోట్లరద్దు నిర్ణయం వలన ఏమి సాధించిందో ప్రభుత్వం ఈనాటికి కూడ మాకు ఏమీ చెప్పలేదని" అతను అన్నాడు.

ఉద్యోగాలు కోల్పోయినవారి అంచనాల సంఖ్య10 లక్షల వరకు ఉంటుందని సిఐటియు ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు తపన్‌సేన్ పేర్కొన్నాడు. "కేవలం 1,15,000 ఉద్యోగాలు మాత్రమే సృష్టించబడినట్లు లేబర్‌బ్యూరో అంకెలు మనకు తెలుపుతున్నాయని", 5వ వార్షిక ఉద్యోగ-నిరుద్యోగ నివేదికను ఉటంకిస్తూ సేన్ చెప్పాడు.

**"నేను 10 లక్షల రూపాయలు పాతనోట్లు డిపాజిట్ చేశాను. ఇప్పుడు కొత్త రూపంలో వేధింపు మొదలైంది. మేము డిపాజిట్ చేసిన డబ్బు ఎక్కడి నుండి వచ్చిందో తెలుపుతూ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటుకు జవాబు పంపవ లసి ఉంటుంది. ఇప్పటికే దెబ్బతిన్న నా వ్యాపా రాన్ని నిర్వహించుకోవాలా? లేక ఈ ప్రశ్నలకు సమాధానాలు పంపూతూ సమయం గడపాలా? అని అతడు అంటాడు."**



గుర్‌గావ్ లో పనుల కోసం ఎదురు చూస్తున్న వలస కార్మికులు

**జంట దాడులు:** పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలోని మీరట్ రోడ్ నుండి కొద్ది దూరంలో 25 సం.ల క్రితం నిర్మించిన ఎఐయుంఒ ప్రాంతీయ శాఖ కార్యాలయం భవనం ఉన్నది. 9 లక్షల ఓటర్లు ఉన్న అతిపెద్ద నియోజకవర్గం ఘజియాబాద్ జిల్లాలోని ఒకప్పటి పారిశ్రామిక ప్రాంతం గత జ్ఞాపకం ఆ భవనం. అయినప్పటికీ బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు, అసంఘటితరంగంలో పని కొరకు 'పని అడ్డాలకు' ఇప్పటికీ వస్తారు. పరిశ్రమ నుండి తీసుకున్న సమాచారం ఆధారం గా ఈ సంస్థకు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఓ.పి. గుప్తా, సుమారు 80 శాతం చిన్న యూనిట్లు (జాతీయ రాజధాని ప్రాంతంలో) మూతపడినాయని, చిన్నతరహా పరిశ్రమలన్నీ కూడ అసంఘటిత రంగానికి చెందినవి, ఎక్కువ గా వలస కూలీలనే పనికి నియమించుకుంటారు అని అంటాడు.

చిన్నతరహా పరిశ్రమలలోని సంఘటిత, అసంఘటిత రంగానికి చెందిన యూనిట్‌లలో నగదు కొరత కారణంగా పనిని నిలుపుదల చేయవలసి వచ్చింది. అవి ఆహారం, మద్యం తయారీకి సంబంధించిన యూనిట్‌లు కావడంతో వివిధ కాలాలలో పనిచేసే కార్మికులను నియ మించుకుంటాయి. కాలానుగుణంగా హీటర్‌లు, కూలర్‌లు తయారుచేసే యూనిట్‌లు వాటిలో ఉంటాయి. చాలామంది కార్మికులకు బ్యాంక్ అక్కౌంట్‌లు ఏ విధంగా నిర్వహించాలో తెలియదు. "ఆ పనివారంతా సహజంగానే వలస కూలీలుగా వచ్చినవారు. చెక్‌ద్వారా వేతనాలు పొందడం వారికి ఇష్టం ఉండదు. చెక్కుల ద్వారానే చెల్లింపులు జరగాలన్న ఒత్తిడి కొనసాగితే, పరిశ్రమ ఒక పెద్ద సమస్యను ఎదుర్కొంటుందని" ఒక బేకరీ యజమాని అంటాడు. తన సమస్యల గురించి చెబుతూ, తాను పాతనోట్లను తీసుకోవడానికి అంగీక రించలేదని, అన్నీ పది రూపాయల నాణేలు ఇచ్చారని అంటాడు.

"నేను 10 లక్షల రూపాయలు పాతనోట్లు డిపాజిట్ చేశాను. ఇప్పుడు కొత్త రూపంలో వేధింపు మొదలైంది. మేము డిపాజిట్ చేసిన డబ్బు ఎక్కడి నుండి వచ్చిందో తెలుపుతూ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటుకు జవాబు పంపవ లసి ఉంటుంది. ఇప్పటికే దెబ్బతిన్న నా వ్యాపా రాన్ని నిర్వహించుకోవాలా? లేక ఈ ప్రశ్నలకు సమాధానాలు పంపూతూ సమయం గడపాలా? అని అతడు అంటాడు.

ఘజియాబాద్‌లో కొన్ని సంవత్సరాలుగా పరిశ్రమలు మూతపడుతూ వస్తున్నాయి. ప్రతి పరిశ్రమ, రైల్వేస్టేషన్‌లు కలిగి ఉన్న మోదీనగర్ లాంటి పారిశ్రామిక నగరాలు అప్పుడు ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంతాలు నెమ్మదిగా మాల్స్, షాపింగ్ సెంటర్స్‌కు స్థానం కల్పిం చాయి. నోట్లరద్దు అనంతరం మురాద్‌నగర్ పవర్‌లూమ్ యూనిట్‌లలో, ఇతర పారిశ్రామిక ప్రాంతాలలో పనిచేసే 10,000 మంది ని అక్కడి నుండి మార్చివేశారు. "వారు నిరసన తెలియజేశారు కానీ ఏమీ జరగలేదు", అని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దినేష్ మిశ్రా పేర్కొన్నాడు. కార్మిక సంఘానికి చెందిన కార్య కలాపాల ఖర్చుల నిమిత్తం, అతి తక్కువ మొత్తాన్ని చందాగా ఇవ్వడానికి సంఘసభ్యులు తమ అశక్తత ప్రదర్శించిన అనంతరం మాత్రమే కార్మికుల కష్టాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో తమ కార్మికసంఘం లాంటి వాటికి అర్థం అయిందని అతడన్నాడు.

నిర్మాణ పనులు ఒక దశకు వచ్చిన అనం తరం, మార్కెట్‌లో మంచి పేరున్న సంస్థలు కూడ పని చేయించడం నిలిపివేయడం జరిగింది. భవన నిర్మాణ కార్మికులు వారి మానా న వారు వదిలివేయబడినారు.

**కార్మికుల నిరుత్సాహం:** నాసిక్‌పూర్ రైల్వే క్రాసింగ్ వద్దనున్న "పని అడ్డా" ఘజియాబాద్ జిల్లాలోని 24 పని అడ్డాలలో ఒకటి. ఒక్కొక్క పనికి ఒక్కొక్క అడ్డా ఉంటుంది. పురుషులు, మహిళా కూలీలు పరిశ్రమలలో పని చేయడానికి అక్కడికి వచ్చి కాంట్రాక్టర్‌లు లేదా స్వతంత్ర వ్యక్తులతో మాట్లాడి ఆ పనులలోకి వెళ్ళి పోతారు. రోజువారి వేతనాలకు ఏ విధమైన నియమ నిబంధనలు లేకుండా పనిచేస్తారు. పని కావాలనుకున్నవారు ఆ ప్రాంతానికి వచ్చి, ఉదయం 5 గం.ల నుండి 10 గం.ల వరకు పని కొరకు ఎదురు చూస్తూ ఉంటారు. పని కొరకు ఒక్కొక్క ప్రాంతానికి సుమారు 500 మంది కార్మికులు వస్తుంటారు. పని కొరకు వచ్చిన గుంపులో ఉన్నతవిద్య నభ్యసించిన యువకులు కూడ ఉంటారు. అలాంటి కార్మికు లకు ఏ విధమైన షెల్టర్లు నిర్మించలేదు. సంవత్స రమంతా అన్ని కాలాలలో పని కొరకు ఆరు బయటే ఎదురుచూస్తూ ఉండాలి. ఘజియా బాద్‌కు చుట్టుప్రక్కల జిల్లాలు, జార్ఖండ్, ఒడిశా, చత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుండి కూడ కార్మికులు వస్తారు.

నోట్లరద్దు వారిని బాగా దెబ్బతీసింది. "మాకు 10 రోజులలో ఒక్కసారి మాత్రమే పని దొరుకుతుంది. కేవలం 10 రోజులు మాత్రమే పనిచేసి ఒక మనిషి తన కుటుంబాన్ని ఎలా పోషిస్తాడు? ఒకవేళ మాకు పనిదొరికి పనిచేస్తే, కాంట్రాక్టర్ మాకు చెల్లింపులు చేయడు. తన యిష్టం వచ్చినట్లు వేతనంలో కోత విధిస్తాడు. మాకిచ్చే వేతనం కనీసం రాష్ట్ర ప్రభుత్వంచేత నిర్ణయించబడదు. మేము వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండాలి", అని 50 సం.ల మహ్మద్ షాహీద్ అంటాడు. నిర్మాణరంగంలో పేరున్న పెద్ద కంపెనీలు వారికోసం పనిచేసే కార్మికులను సరఫరా చేసే కాంట్రాక్టర్లను నియమించుకుంటారు. కానీ కార్మికులు చేసిన పనికి వేతనాలు చెల్లిస్తారన్న గ్యారంటీ లేదు.

కొన్నిసార్లు సాయంత్రం 6 గం.ల వరకు ఎదురుచూపు సాగేది. ఆ తరువాత కార్మికులు ఖాళీ చేతులతో, ఆకలితో ఇంటి ముఖం పడ తారు. రియల్ ఎస్టేట్ పనిమీద పడిన ప్రభావం వారిని బాగా దెబ్బతీసింది. "నేటికి కూడ ఏం పనిలేదు. ఇప్పుడు కంపెనీల నుండి తొలగింప బడిన కార్మికులు ఇక్కడ మాతో కలిసివున్నారు. నోట్లరద్దు వలన మేం పొందిన లాభం ఏమిటి? ఇప్పటికే అక్కడ చాలా వేధింపులున్నాయి. ఏ రాజకీయ పార్టీ అయినా పని అడ్డాల ఎత్తివేత గురించి మాట్లాడి పురుష, మహిళా కార్మికులు తమ శ్రమను అమ్ముకోవడానికి నిలబడాల్సిన పనిలేదన్న గ్యారెంటీ ఇచ్చిందా? మనలాంటి దేశంలో అలాంటి పనిఅడ్డాలు ఉండడం సిగ్గు చేటు", అని ఉమేష్‌కుమార్ అనే పట్టభద్రుడు అన్నాడు. చాలామంది వారి గ్రామాలకు తిరిగివెళ్ళిపోయారని అన్నాడు.

ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (యఫ్ఐయస్‌యంఇ) సెక్రటరీ జనరల్ అనీల్ భరద్వాజ్, నోట్లరద్దు యొక్క వాస్తవ ప్రభావం సంవత్సరం ఆరు నెలల తరువాత తెలుస్తుందని అంటాడు. దాదాపు 90 శాతం కార్మికులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్‌లలో పనిచేసేది అసంఘటితరంగంలోనే. 7–10 శాతం మంది సంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. గడచిన సర్వే ప్రకారం చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో నియమించబడిన సగటు ప్రజలను గురించి అతడు పేర్కొన్నాడు. అందులో పెద్ద సంఖ్యలో ఉన్నది చాలా చిన్న యూనిట్లే. వాటి నిర్వహణ అంతా నగదుతోనే జరుగుతుంది. ముడి సరుకు కొనుగోలు, వేతన చెల్లింపులు , వస్తువుల అమ్మకం అంతా నగదు ద్వారానే నిర్వహించ

> **❝కొన్నిసార్లు సాయంత్రం 6 గం.ల వరకు ఎదురుచూపు సాగేది. ఆ తరువాత కార్మికులు ఖాళీ చేతులతో, ఆకలితో ఇంటి ముఖం పడ తారు. రియల్ ఎస్టేట్ పనిమీద పడిన ప్రభావం వారిని బాగా దెబ్బతీసింది. "నేటికి కూడ ఏం పనిలేదు. ఇప్పుడు కంపెనీల నుండి తొలగింప బడిన కార్మికులు ఇక్కడ మాతో కలిసివున్నారు. నోట్లరద్దు వలన మేం పొందిన లాభం ఏమిటి?❞**



నోట్ల రద్దు వల్ల బాగా దెబ్బతిన్నది అసంఘటిత రంగం

బడుతుంది. "మార్కెట్‌లు నగదు ద్వారా నిర్వహించబడుతాయి కాబట్టి వాటి ఆధారం కూడ నగదే. అక్కడ మొరాదాబాద్‌లో మాదిరిగానే 3,000 పైన సాంప్రదాయ క్లస్టర్లు, 400 వరకు పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయి", అని భరద్వాజ తెలియజేశాడు.

ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతిన్నది. ఎంత నగదు ఉపయోగించబడింది అనే దానిమీద ఆధారపడి 30–70 శాతం ఉత్పత్తి ఉంటుంది. రోజువారీ కార్యక్రమాలపై తీవ్రమైన ప్రభావం పడింది. నగదు అందుబాటులోకి వచ్చాక డిమాండ్ పడిపోయింది. ప్రజలు వచ్చిన డబ్బును ఖర్చు చేయకుండా తమవద్దే ఉంచుకుంటున్నారు. "మేం ఉత్పత్తి చేసినదంతా అమ్మబడడంలేదు. నిర్వహణ బాగా పడిపోయింది. శాశ్వతంగా అవకాశాలు కోల్పోవడం జరిగింది. అప్పుడు ఉత్తర భారతదేశంలో పెళ్ళిళ్లకు మంచి తరుణం. ఈ పెళ్ళిళ్ల తరువాత రిఫ్రిజిరేటర్లు, టీవీలు, కార్లు, ఇతర ఖరీదైన వస్తువులు ఆ ప్రాంతంలో బాగా అమ్ముడుపోతాయని వ్యాపారస్తులు ఆశించారు. ఈ పెళ్ళిళ్ల తరుణంలో వారి అమ్మకాలలో 40 శాతం తరుగుదల ఉంటూ వచ్చింది. మనం ఉత్తర భారతం గురించి మాట్లాడుతున్నాం. రానున్న ఒకటిన్నర సంవత్సరాల కాలంలో దీని ప్రభావం మనకు బాగా అర్థం అవుతుంది. ఎవరైనా ఒక కారు ఖరీదు చేయడాన్ని వాయిదా వేయవచ్చు. కానీ నేను ఈరోజు తినడం మానివేస్తే, నేను రేపు తినలేను. ప్రజలు భోజనశాలలు అద్దెకు తీసుకొనలేరు. కార్మికులు వేతనాలు పొందే అవకాశం కోల్పోయారు. వీరంతా ధనిక ప్రజలు కాదు", అని అతను అన్నాడు.

మూడవ సవాల్ ఏమంటే అవసరమైన మౌలిక సదుపాయాలు లేకుండానే డిజిటల్ చెల్లింపులవైపు నెట్టవేయడం. "అకస్మాత్తుగా, మనం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చెల్లింపులు చేసే పేద ప్రజలను కలిగివున్నాం. గతంలో నగదు చెల్లింపులు చేస్తే ఏమీ ఖర్చు ఉండేదికాదు. కానీ ఇపుడు డిజిటల్ లావాదేవీలు చేయాలంటే 2 శాతం ఖర్చవుతుంది. ప్రజలపై ఈ ఒత్తిడి ఎందుకు? వేతనాలు చెల్లించడానికి నగదు కూడ లేదని" భరద్వాజ అంటాడు. కార్మికులకు సామాజిక భద్రత కల్పించాల్సివస్తే, వారి ఖర్చులు బాగా పెరుగుతాయని చిన్న, మధ్యతరహా పరిశ్రమల యాజమాన్యాలు భయపడుతున్నాయి. కళ్ళముందున్న ఏకైక మార్గం దుకాణాలు మూసివెయ్యడమేనని యజమానులు

> **❝ నోట్లరద్దు ప్రకటనకు ముందే ఉద్యోగాల పరిస్థితి చాలా నిరాశాజనకంగా ఉన్నది. లేబర్ బ్యూరో నివేదిక ప్రకారం 77 శాతం కుటుం బాలలో వేతనాలు సంపాదించే ఒక కుటుంబ సభ్యుడు కూడా లేడు. కేవలం 3 రాష్ట్రాలైన త్రిపుర, మణిపూర్, మేఘాలయలలో మాత్రమే 70 శాతం కుటుంబాలు 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' ద్వారా లబ్ది పొందుతున్నాయి. ❞**

పేర్కొన్నారు. అతడు చెప్పిన ప్రకారం సంఘటిత రంగం బాగా కుంచించుకుపోతున్నది. ప్రభుత్వ నియామకాలు లేకుండాపోయాయి. వ్యవసాయం బ్రతుకుదెరువుకు అనుకూలించడం లేదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు గ్రామీణ మార్కెట్‌లపై ఆధారపడి ఉంటాయి. గ్రామాలలో నిర్మాణ సంబంధ పనులన్నీ నగదుతో నిర్వహించబడ తాయి. పెద్ద పరిశ్రమలలో భాగంగా ఉన్న సిమెంట్, ఇనుము మినహాయిస్తే, నిర్మాణ రంగంలో ప్రతీది చిన్నతరహా పరిశ్రమలలోనే తయారుచేయబడతాయి.

డిజిటల్ చెల్లింపులు నిల్వలను తలక్రిందులు చేస్తాయని యాజమాన్యాలు నమ్ముతున్నాయి. భరద్వాజ చెప్పిన ప్రకారం, గ్రామీణ భారతదేశం పూర్తిగా నగదుపై ఆధార పడి, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పత్తులనే నమ్ముకొని ఉన్నది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కార్మిక చట్టాలను ఒప్పుకోవాలని కార్మిక సంఘాలు ఒత్తిడి చేస్తున్న ప్పటికీ, ఆ సంస్థల ప్రతినిదులతో ఘర్షణ ఉన్నప్పటికీ, అసంఘటితరంగంలో పనిచేసే కార్మికవర్గం యొక్క పరిస్థితిని దిగజార్చింది మాత్రం నోట్లరద్దు నిర్ణయమే. వారు పూర్తిగా నిరుద్యోగం, అనిశ్చిత పరిస్థితిలోకి నెట్టి వేయబడినారు.



ఎఫ్ఐయస్‌యంఈ
ప్రధాన కార్యదర్శి అనిల్ భరద్వాజ్

" ఆ నిర్ణయం దెబ్బనుండి ప్రజలు ఇంకా కోలుకోలేదని, మొరాదాబాద్‌కు చెందిన షఫాత్ ఖాన్ అంటాడు. ఇత్తడి పనులకు సంబంధించిన అవసరమైన బొగ్గును నగదు చెల్లింపుద్వారానే కొనవలసి ఉంటుంది. పోతపోసే పనిలేకుంటే, గ్రైండింగ్, వెల్డింగ్, మౌల్డింగ్ (వంచే) పనులు కూడ ఉండవు. ముడి సరుకుల ధరలు బాగా పెరిగిపోయాయి. ఫిబ్రవరిలో మాకు జాతీయ, అంతర్జాతీయ సంతలు ఉంటాయి. ఢిల్లీ, పారిస్, హాంగ్‌కాంగ్, ఫ్రాంక్‌ఫర్ట్‌ల నుండి వస్తు వుల తయారీ కొరకు మాకు ఆర్డర్లు వస్తాయి. ఈ సంతలలోనే ధరలు నిర్ణయించబడతాయి. కానీ మేము వస్తువుల కొరకు ఆర్డర్లు తీసుకొన లేకపోతున్నాం. "ఏ పనీ లేకుండా ఊరికే కూర్చుంటున్నాం".

వివిధ సమాచార, కథనాల ఆధారంగా ఏ విధమైన పరిష్కారమార్గాలు చూడనటువంటి కేంద్ర ప్రభుత్వాన్ని మన్నించకూడదు. మీడియా సమాచార నివేదికను బట్టి కేంద్ర మంత్రి "నిర్మలా సీతారామన్" నోట్లరద్దు ఉద్యోగాలపై ఏ విధమైన ప్రభావం చూపించలేదని, ఒకవేళ ఉన్నా నిర్ణయ ప్రకటన జరిగిన మొదటి 10 రోజులలో మాత్రమే ఉన్నది అని పేర్కొన్నది. 'డిజిటలైజేషన్' ప్రచారం నిర్వహిస్తున్న వారికి నమస్కారాలు తెలిపింది.

నోట్లరద్దు ప్రకటనకు ముందే ఉద్యోగాల పరిస్థితి చాలా నిరాశాజనకంగా ఉన్నది. లేబర్ బ్యూరో నివేదిక ప్రకారం 77 శాతం కుటుం బాలలో వేతనాలు సంపాదించే ఒక కుటుంబ సభ్యుడు కూడా లేడు. కేవలం 3 రాష్ట్రాలైన త్రిపుర, మణిపూర్, మేఘాలయలలో మాత్రమే 70 శాతం కుటుంబాలు 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' ద్వారా లబ్ది పొందుతున్నాయి. పనిచేసే సిబ్బందిలో 46.6 శాతం స్వయం ఉపాధి రంగంలో పనిచేస్తున్నారు. కేవలం 17 శాతం మాత్రమే వేతనాలు పొందే పనిలో ఉన్నారు. నవంబర్ నుండి సమాజంలో ఈ వర్గాలు నోట్లరద్దు ప్రభావానికి గురి అయ్యారని స్పష్టంగా అర్థం అవుతున్నది. ఎదుటివారి భావాలను, అనుభ వాలను అర్థం చేసుకోకుండా, ఏ తప్పు చేయని ప్రజల బాధలను తీర్చే ప్రయత్నం చేయకపోవడం బాధాకరం.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,ప్రజాశక్తిప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# భారత పునరుజ్జీవనోద్యమం

కె యన్ ఫణిక్కర్



రచయిత
ప్రముఖ చరిత్రకారుడు

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే అభ్యుదయ, విప్లవాత్మక రాజకీయ కార్యక్రమంలో పాల్గొనే ముందు భారతీయులు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాలు పంచుకున్న కాలంగా ఆధునిక భారతీయ పునరుజ్జీవన చరిత్ర ఘటాన్ని పరిగణించవచ్చు. రాజకీయ పోరాటాలకు ముందు జాతీయ వాదానికి పునరుజ్జీవనంగా పిలవబడే సామాజిక, మత పరమైన ఉద్యమాలు అవసరంగా భావించబడ్డాయి. అందువలననే జాతీయవాదం పునరుజ్జీవనం యొక్క సహజ ఫలితంగా భావించడం జరిగింది.

మొన్న మొన్నటివరకూ చరిత్రంటే ఇదే తాత్విక అవగాహన ఉండేది. చరిత్రను కాలాల ప్రాతిపదికగా ఖచ్చితంగా విభజించడాన్ని ప్రశ్నించేవరకూ ఈ అవగాహన కొనసాగింది. కావున పునరుజ్జీవన ఉద్యమాల పరిశోధనకు ఎంతో కీలకమైన చరిత్రను ఈ విధంగా విభజించడాన్ని ప్రశ్నించడానికి మరికొంతకాలం ఆగాల్సి వచ్చింది. చరిత్రను పురాతన, మధ్యయుగాల, ఆధునిక యుగం, సమకాలీన చరిత్రగా విశాల దృక్పథంతో విభజించినా, లేదా విషయానుగుణంగా అంటే సామ్రాజ్యవాద, సంస్కరణ, జాతీయవాద కాలాలుగా విభజించినా అవి అన్నీ నిశితంగా పరిశీలించబడ్డాయి. ఈ రకమైన ఖచ్చితమైన విభజనను పలు మూలాధారాల నుండి ప్రశ్నించడం జరిగింది. జాతీయోద్యమాల మూలాలు సామాజికాంశాలలో ఉన్నట్లు మొదట మార్క్సిస్టు పరిశోధకులు కనుగొనగా, దళిత విద్యావేత్తలు కుల ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చరిత్రను ముందుకు తెచ్చారు. కింది తరగతి చరిత్రకారులు ఆధిపత్యం, అణచివేతపైనే దృష్టిపెట్టి చరిత్ర రచన చేశారు. అయితే కుల, వర్గ సమూహాల ప్రాతిపదికన చరిత్రను పునర్నిర్మించడం, పునఃపరిశీలించడం విశ్లేషణల ప్రపంచంలోనే ఒక మార్పును తెచ్చింది. చారిత్రక ఆలోచనా ప్రపంచంలో వివేకవంత చరిత్రలో, అలా మనం అనుకునేందుకు ఇష్టపడితే, ఆలోచనలను సందర్భోచితానికి పరిమితం చేయడం ముఖ్యంగా దారితప్పడం అనవచ్చు.

**ఆధునీకరణ, పునరుజ్జీవనం**

ఆధునీకరణ, పునరుజ్జీవాల సంబంధాలు అనేకరకాల ప్రశ్నలను లేవనెత్తాయి. సామాజిక వైరుధ్యాలను పునరుజ్జీవనోద్యమం పరిష్కరించ గలిగిందా అన్నదొక ముఖ్యమైన ప్రశ్న. పునరుజ్జీవనోద్యమం తరగతుల విభజనకు అతీతంగా కాక కేవలం మతం, కులం, ఆధారితంగానే ఎందుకు జరిగిందన్నది మరో ప్రశ్న. పునరుజ్జీవనోద్యమం కేవలం పై తరగతుల సామాజిక, మత ప్రయోజనాలను వ్యక్తపరిచేదేనా? పునరుజ్జీవనోద్యమం బ్రాహ్మణవాద సిద్ధాంతాలను అధిగమించలేదని అంచనా వేయడం సబబేనా! విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాలలో (సిలబస్‌లలో) దళితులు, అణగారిన తరగతుల చరిత్రను ఇమడ్చకపోవడం యాదృచ్ఛికమేనా? అణగారిన ప్రజల భవిష్యత్తు పట్ల ఏమాత్రం గ్రాహ్యం లేకుండా ఆధునిక భారత ఆవిర్భావాన్ని, చరిత్ర సాహిత్యమంతా 19, 20 శతాబ్దాలు పునరుజ్జీవన ఉద్యమాలతో నిండిపోయాయంటూ ఎందుకు ఊదరగొట్టింది ఆధునీకరణకు పునరుజ్జీవనోద్యమానికి ఉన్న సంబంధాన్ని గనుక పరిశీలిస్తే ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి.

భారతదేశ ఆధునీకరణ మూలాలు పునరుజ్జీవనోద్యమంతో ముడిపడిన సాంస్కృతిక వైజ్ఞానిక పరిణామాలలోనే ఉన్నాయని భావించబడుతున్నది. పునరుజ్జీవనోద్యమకాలం విలువలలో, సామాజిక స్పందనలలో, సాంస్కృతిక సృజనలలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ పరివర్తనల ఫలితంగా మానవత్వానికి కొత్త వివరణలు, నివేదనలు, నిర్వచనాలు ఏర్పడి, పాతతరంలో ఎన్నడూ చూడని, సాంస్కృతికంగా వివేకవంతుడైన కొత్త మానవుడు ఆవిర్భవించాడు.

ఈ ఆలోచనలు ఉవ్వెత్తున ఎగసి చిత్రలేఖనంలో, శిల్పాలలో, సాహిత్యంలో, సంగీతంలో ఇలా అన్ని రంగాలను చైతన్యపరిచి శక్తివంతమైన కొత్త సృష్టికి నాంది పలికింది. ఈ రససృష్టి సామాజిక నిర్మాణాలతోనూ, ఉత్పత్తి సంబంధాలతోనూ నిర్మాణాత్మక పరిణామానికి దారితీసింది. నిజానికి ఇది పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిలోని వివేచనా పార్శ్వం. ఇదే ఆధునికతగా, పాతదానికన్నా భిన్నమైనదిగా, కొత్తదిగా చలామణీ అయ్యింది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ 'ఆధునీకరణ' అనేక రంగులు సంతరించుకుంది. అందువలన 'ఆధునీకరణ' నిర్వచనమే పెద్ద చర్చనీయాంశమైంది. మునుపటి ఆసియా, ఆఫ్రికా దేశాలలోని ఆధునీకరణ గుణాత్మకంగా, వలసల ద్వారా పశ్చిమ యూరప్ దేశాల నుండి దిగుమతి అయిన ఆధునీకరణకు సరిపోలినదేనా అనేది ఒక చర్చించదగ్గ ప్రశ్న. వలసల పరిపాలనా విధానాన్ని తామే స్వేచ్ఛా సూత్రాల కనుగుణంగా ఆధునీకరించామని సామ్రాజ్యవాద పాలకులు గర్వంగా చెప్పుకోవడం ద్వారా మొదలుపెట్టిన ఆలోచనే సర్వసాధారణంగా అంగీకరించబడింది. అందువలననే సామ్రాజ్యవాదుల ఆధిపత్యకాలంలో, పరిపాలనా నిర్మాణంలో, రవాణాలో, కమ్యూనికేషన్‌లలో, వ్యవసాయాన్ని వ్యాపారీకరించడంలో చేసిన మార్పులను అభివృద్ధిగా వర్ణించడం జరిగింది. ఈ మార్పులన్నీ నిజానికి 'సామ్రాజ్యవాద ఆధునీకరణలే. ఎందుకంటే ఇవి సామ్రాజ్యవాదులకు అనువైన మార్పులు. ఇవి సామ్రాజ్యవాదుల కార్యక్రమాలే గాని ఆధునీకరణ కార్యక్రమాలు ఎంత మాత్రం కాదు. 'సామ్రాజ్యవాద' అధికారిక వివరణలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మార్పులను ఆధునికంగా వర్ణించడం అర్థం చేసుకోవచ్చు. కొత్తగా ఉనికిలోకి వచ్చిన మధ్యతరగతి వర్గం ఉదారవాద ఆంగ్ల విద్యా విధానంలో శిక్షణ పొంది ఉండడం వలన ఈ మాయలోనే మునిగి, దీనికే ఆధునిక జీవితంగా గుర్తింపునిచ్చి, తమనే ఉదాహరణగా చూపుకున్నారు. అందువలన ఇప్పుడు అభివృద్ధిగా మనం ఒప్పుకుంటున్నది పాశ్చాత్య దేశాలు సాధించిన అభివృద్ధి నమూనా; నిజానికి వలసవాద ఆధునీకరణ వారి వికృత రూపం.

వలసవాద ఆధునీకరణ, ఔన్నత్య ఆలోచనలు ఒక్క మధ్య తరగతికే పరిమితం కాలేదు. ఇది సమాజంలోని అన్ని దొంతరలలోకి పాకింది.

> **❝ ఇది వలసదేశ వనరులను క్షీణింప జేసింది. సంప్రదాయ ఉత్పత్తిరంగాన్ని ధ్వంసం చేసింది. సాంస్కృతిక జీవనాన్ని కకావికలం చేసింది. సాంస్కృతిక, సామాజిక, రాజకీయ జీవి తాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఇంత దారుణ మైన విధ్వంసంతో పోల్చుకుంటే వలసవాద అభి వృద్ధి వలన పొందిన ఆధునీకరణ లాభం చాలా స్వల్పమైనది. ❞**

తమను కుల అణచివేత నుండి బ్రిటీష్‌వారే కాపాడారని, వారి జీవితాలలో వెలుగులు నింపార నిదళిత నాయకులు కూడా భావిస్తుంటారు. నిజానికి బ్రిటీష్ పరిపాలకుల జోక్యం వలననే యుగయుగాలుగా వారిపై జరుగుతున్న కుల అణచివేతకు ఒక అంతరాయం ఏర్పడింది. ఈ దృష్టి కోణానికి కారణం మానవ మాత్రులు సహించలేనంత హీన కులతత్వం, మతం పేరుపై సాగిన దౌర్జన్యం, దోపిడీ. బ్రిటీష్‌వారు తమ దోపిడీని కొనసాగించేందుకు ప్రజలపై తమ నియంత్రణను స్థిరపరుచుకునేందుకు అమలు పరచిన మౌలిక సదుపాయాల నిర్మాణాలు ఆధునిక యుగ ఆవిర్భావాలుగా నమ్మించారు. రైల్వేల నిర్మాణం, కమ్యూనికేషన్ వ్యవస్థ, లౌకిక విద్యా సదుపాయాలు ఇందుకు ఉదాహరణలు. కానీ వలస పరిపాలన ఆధునీకరణ కాదు. దోపిడీకి ఆయుధం. ఇది వలసదేశ వనరులను క్షీణింప జేసింది. సంప్రదాయ ఉత్పత్తిరంగాన్ని ధ్వంసం చేసింది. సాంస్కృతిక జీవనాన్ని కకావికలం చేసింది. సాంస్కృతిక, సామాజిక, రాజకీయ జీవి తాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఇంత దారుణ మైన విధ్వంసంతో పోల్చుకుంటే వలసవాద అభి వృద్ధి వలన పొందిన ఆధునీకరణ లాభం చాలా స్వల్పమైనది.

భారతదేశంలో ఆధునీకరణ పశ్చిమ దేశాలు అడుగిడడం వల్ల వచ్చింది కాదు. సామాజిక, మత సంస్కరణలు అమలు చేయడం వలన వచ్చింది. వాటినే పునరుజ్జీవన ఉద్యమాలంటున్నాం. ఇవి యూరప్ అనుభవాల నుండే వచ్చాయి. అయితే సంస్కరణలు, పునరుజ్జీవం ఒకటి కాదు. పునరుజ్జీవం మరింత విశాలమైన సామాజిక, విజ్ఞాన జాగృతి యొక్క అభివ్యక్తం. రాజా రామమోహన్‌రాయ్ మహిళలను వారి దుర్భర జీవితాలనుండి వెలికి తెచ్చే ప్రయత్నంలో అది కనిపిస్తుంది. మతపరమైన అలవాట్లను సంస్కరిం చడంలో కనిపిస్తుంది. ఉత్తర భారతదేశంలో దయానంద సరస్వతి, మహారాష్ట్రలో యం.జి. రనడే



రాజారామ్మోహన్‌రాయ్

స్థాపించిన ప్రార్థనా సమాజ్ కార్యక్రమాలలోనూ వీటి ప్రారంభదశను చూస్తాం. ఇటువంటి ఉద్యమమే ఆంధ్రప్రదేశ్‌లో కందుకూరి వీరేశ లింగం గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ ఉ ద్యమాలన్నింటిలో ఒక సారూప్యం ఏమిటంటే ఇవన్నీ పై తరగతులకు సంబంధించినవే. కొత్తగా అవతరిస్తున్న పై మధ్య తరగతి సామాజిక, ఆధ్యాత్మిక అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడేవే.

**మరో విక్షేపమార్గం**

దక్షిణ భారతదేశంలో, ప్రత్యేకంగా కేరళ, తమిళనాడులలో ఈ కథ మరోరకంగా ఉంది. ఇక్కడ పునరుజ్జీవనోద్యమాలు కొంత ఆలస్యంగా మొదలయ్యాయి. బహుశా ఇక్కడి మధ్యతరగతి ఆలస్యంగా ముందుకు రావడం వలన కావచ్చు. ఈ రోజు కేరళ అని పిలువబడే ట్రావన్‌కూర్, కొచ్చిన్, మలబార్ ప్రాంతం 19వ శతాబ్దంలో సామాజికంగా, విద్యాపరంగా బాగా వెనుకబడి ఉన్నది. తమిళనాడులో కూడా అదే పరిస్థితి. ఈ ప్రాంతం ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ ఉద్యమం కింది తరగతులలో ప్రారంభమైంది. ఉ త్తరాదిలో వలెకాక తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో కింది తరగతుల నుండి సంస్కరణోద్యమాలు ఆవిర్భవించాయి. బెంగాల్‌లో రాజా రామ మోహన్‌రాయ్ ప్రారంభించిన ఉద్యమం పై తరగతికి, పై కులానికి చెందింది. ఆయనను అను సరించినవారు ఆ తరగతులవారే. బెంగాల్‌లో దేవేంద్రనాథ్ ఠాకూర్, కేసబ్‌చంద్ర సేన్, మహా రాష్ట్రలో రనడే, పంజాబ్‌లో దయానంద సరస్వతి, ఆంధ్రలో వీరేశలింగం ఈ కోవకి చెందినవారే.

అందుకు భిన్నంగా కేరళలో పునరుజ్జీవన ఉ ద్యమమంటే క్రింది తరగతుల సంస్కరణలు. నారాయణగురు, అయ్యంకాళిలతో ప్రారంభ మయ్యాయి. అలాగే తమిళనాడులో కూడా ఇవి రామసామి 'పెరియార్', ఇయోన్‌థిథాస్‌లతో కింది కులాలలో ప్రారంభం అయ్యాయి. వాస్తవంగా చెప్పుకోవాలంటే ఇవి సంస్కరణ ఉద్యమాలు కావు. వీరు తీసుకున్న కార్యక్రమాలు సంస్కరణలే అయినా వారు వ్యాప్తి చేసిన భావజాలం విప్లవాత్మకమైనది. ఉదాహరణకి వారు కులాలలో సంస్కరణలు కాక కుల నిర్మూలనకే ప్రాధాన్యతనిచ్చారు. సమాజంలో వారి పాత్ర వలన కొత్త ఆలోచనలకు తావివ్వడమే ఆధునిక సమాజ ఏర్పాటుకు దోహదం చేసింది. శుభ్రతకు, విద్యకు, కష్టించి పనిచేసేందుకు ఇంకా ఇలాంటి భౌతిక విషయాలకే వారు ప్రాధాన్యత నిచ్చారు. ఈ సమాజం కులరహిత, వర్గరహిత సమాజంగా మార్పు చెందాలనే సిద్ధాంతానికి వారు కట్టుబడి ఉన్నారు. ఏ సామాజిక సిద్ధాంతాన్నీ రూపొందించకపోయినా సమానత్వ ప్రాతిపదికన సమాజం నిర్మించబడాలని ఊహించారు. విష్ణుభువ బ్రహ్మచారి, వేదోక్త ధర్మప్రకాశం, బంకిం చంద్ర ఛటర్జీలు రాసిన 'సామ్యో' వ్యాసం ఇందుకు మంచి ఉదాహరణలు.

వీటన్నింటిలో ఉన్న సారూప్యత ఏమిటంటే ఇప్పుడున్న సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను, వివేక శూన్యమైన మతాచారాలు, క్రతువుల నుండి స్త్రీల జీవితాలను అణచివేయడం వరకు అన్నింటినీ మార్చాలన్న తీవ్రమైన కోరిక అందరిలోనూ ఉన్నది. అంధ విశ్వాసాలకు మూలం విగ్రహారాధనను విస్తృతంగా నమ్మటం అని వీరందరి దృష్టిలోనూ ఉన్నది. బ్రహ్మ సమాజం విగ్రహారాధనను బహిష్క రించింది. ఆర్య సమాజం, ప్రార్థనా సమాజం కూడా అదే బాటలో నడిచాయి. నారాయణగురు సరికొత్త బాట నెంచుకున్నారు. సామాజిక విషయాలలో కత్తెర వేయడం పనిచేయదని ఆయన గ్రహించారు. అందువలన విగ్రహారాధనను క్రమంగా మార్చే ప్రయత్నం చేశారు. ముందు విగ్రహం ఉన్నచోట శివుడిగా ఓ రాయిని పెట్టడం మొదలుపెట్టారు. తరువాత ఆ స్థానంలో ఓ అద్దాన్ని పెట్టి, చివరిగా దానినీ తీసివేశారు. విగ్రహారాధనను వ్యతిరేకిం చడానికి విగ్రహాన్ని ఉపయోగించడం అపార్థాల కు దారితీసి పెద్ద కులాల పెత్తందారీతనాన్ని ఒప్పుకుంటున్న దానికి ఉదాహరణగా కూడా దీనిని


చూడడం జరిగింది. నారాయణగురు 19వ శతాబ్ది భారతీయ సాంప్రదాయాలకు అనుగుణంగానే విగ్రహారాధనను వ్యతిరేకించారు. కానీ ఆయన అనుయాయులు ఆయన మరణానంతరం ఆయన విగ్రహాన్ని ఆరాధించడం మొదలుపెట్టడం అత్యంత విషాదకరం.

మహిళల దుర్భర పరిస్థితులు 19వ శతాబ్ది సంస్కర్తల హృదయాలను కలచివేశాయి. సతీసహగమనాన్ని బహిష్కరించాలని ప్రచారం చేసిన రామ్మోహనరాయ్‌తో మొదలుకొని మహిళలను అనాచార శృంఖలాల నుండి తప్పించాలని ఎందరో సంస్కరణవాదులు తీవ్రంగా కృషిచేశారు. ఇది వారి బ్రతుకుల యెడల సానుభూతిని వ్యక్త పరచడం మాత్రమే కాదు. ఈ సంస్కరణలకు ఎన్నో పరిమితులున్నా ఎంతో కీలకమైనవి. మహిళల స్థితిగతులను బాగుపరిచి వారి గౌరవాన్ని కాపాడేందుకు, సామాజిక, మతపరమైన పరిస్థితులను చక్కదిద్దేందుకు చేసిన తొలి ప్రయత్నాలే భారతీయ పునరుజ్జీవనోద్యమం. జీవితాలను నూతనంగా నిర్మించడం పైనే ఈ సంస్కరణలు ప్రధానంగా దృష్టిపెట్టాయి. మూఢాచారాలను, అభివృద్ధి నిరోధక సంప్రదాయాలను ఎంత తొందరగా వదిలించుకుంటే అంత తొందరగా సమాజ గమ్యం మారుతుందని వీరు వాదించారు. అదే సమయంలో ఈ పునరుజ్జీవనోద్యమం రాజకీయాల నుండి దూరంగా ఉండేది. సమాజం ఒకసారి విచక్షణా రహిత పద్ధతుల నుండి వేరుబడితే జాతి జీవనంలోని మిగిలిన అన్ని పార్శ్వాలూ తమంత తాముగా చక్కబడతాయి అని వీరి నమ్మకం. వారి ఉద్దేశ్యంలో అంతరంగిక, సామాజిక బలహీనతలు పరిష్కరించబడడం తక్షణ అవసరం. అవే గనుక పరిష్కరించబడితే దీర్ఘకాలిక రాజకీయ సమస్యలు పరిష్కరించబడడానికి ఎక్కువ సమయం పట్టదు. విదేశీయులు పరిపాలిస్తున్న విషయం అనేకుల మస్తిష్కాంతరాలలో పరోక్షంగా తిరుగాడుతున్నా, అందులన వచ్చే చెడు పర్యవసానాలపై అవగాహనా రాహిత్యంతో ఉన్నారు. చాలా కొద్దిమంది మాత్రమే వలసవాదానికి, సామాజిక స్వేచ్ఛకి గల సంబంధాన్ని చెప్పగలిగారు. వారు కూడా చాలా తేలికగా విమర్శించారు. ఆ రోజుల్లోని భారతీయ బుద్ధిజీవులకు ఆధునికతకు వలస సిద్ధాంతమే మార్గదర్శకంగా ఉండేది. అందువలనే వలస ఆధిపత్యాన్ని దైవ సంకల్పంగా వారు భావించారు.

### జాతీయవాదం, పునరుజ్జీవం

పరిపాలనపై భారతీయ ఆలోచనా పరులకున్న భ్రమలు తొలగిపోయినందు వలన 19వ శతాబ్దంలో జాతీయవాదం బలపడింది. అదే సమయంలో వారు రాజకీయ, సామాజిక కార్యక్రమాలు కలిపి చేయవలసిన అవసరాన్ని గుర్తించారు. ఈ కలయికే కొంతమేరకైనా పునరుజ్జీవనోద్యమం జాతీయవాదంతో మమేకమయ్యేందుకు దోహద పడింది. అయితే ఈ కలయిక ఎంత గట్టిపడిందంటే 'రాజకీయం', సామాజికం'పై పైచేయి సాధించింది. 'సామాజికం' వెనుకపట్టు పట్టింది. భారతీయ సామాజిక సదస్సు ఎదుగుదల, పతనం దీనికో గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు. సంస్కృతి, రాజకీయాల కలబోతకు గుర్తుగా ఈ సామాజిక సదస్సు మొదట భారత జాతీయ కాంగ్రెస్ జరిగినచోటే జరిగింది. కానీ వలసవాద వ్యతిరేక రాజకీయ ఉద్యమం బలపడిన వెంటనే దీనిని వదిలివేశారు. ఈ విధంగా వేరుచేయబడడం జాతీయోద్యమం తనముందు పెట్టుకున్న లక్ష్యాలకు భిన్నమైనది.

**"పరిపాలనపై భారతీయ ఆలోచనా పరు లకున్న భ్రమలు తొలగిపోయినందు వలన 19వ శతాబ్దంలో జాతీయవాదం బలపడింది. అదే సమయంలో వారు రాజకీయ, సామాజిక కార్యక్ర మాలు కలిపి చేయవలసిన అవసరాన్ని గుర్తించారు. ఈ కలయికే కొంతమేరకైనా పునరుజ్జీవనోద్యమం జాతీయవాదంతో మమేకమయ్యేందుకు దోహద పడింది."**



పెరియార్ ఇవి రామస్వామి


మధ్యతరగతి ఎదిగి రాజకీయ, సామాజిక ఉద్యమాలను వేరుచేయడం దీర్ఘకాల పరిణామాలకు దారితీసింది. జాతీయోద్యమం సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన లాంటి రాజకీయ ఉద్యమాలు చేస్తున్న కాలంలో సామాజిక చైతన్యం ఇంకా కులతత్వం, మతతత్వాల ఊబిలోనే చిక్కుకొని ఉంది. ఇందుకు కారణం రాజకీయాలు సంస్కృతితో పూర్తిగా మమేకం కాలేకపోవడమేనా? ఈ సమస్యను గ్రామ స్వరాజ్యం, ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల ద్వారా పరిష్కరించారు. ఇది పునరుజ్జీవనోద్యమం రెండవ దశలోని అత్యున్నత స్థితి. జాతీయవాదం పునరుజ్జీవన విలువలను తనతో మమేకం చేసుకొనే ప్రయత్నం చేసిన కాలం. అయితే ఈ బంధం వాస్తవరూపం దాల్చలేదు.

పునరుజ్జీవనోద్యమానికి ఉత్తేజం మానవత్వం. మానవత్వాన్ని కేంద్రస్థానానికి తెచ్చినందు వలన అన్ని సామాజిక కోణాలూ శిల్పం, గానం, చిత్రం, తాత్వికతలలో సృజనాత్మకత వెల్లివిరిసింది. అయితే వేరు వేరు రంగాలలో భావ ప్రకటన ఉద్ఘాటన వేరు వేరుగా ఉండేది. ప్రాచీనకాలంలో స్వేచ్ఛను నిరాకరించబడిన వారి పట్ల, బానిసత్వానికి బలవుతున్నవారి పట్ల, న్యాయం అందని వారి పట్ల సానుభూతి ఉండేది. అదే మధ్యయుగంలో భూస్వామ్య అణచివేతకు గురవుతున్న వారిపట్ల సానుభూతి ఉండేది. ఆధునికయుగంలో అణగారిన ప్రజల పట్ల, అంచులకు నెట్టివేయబడిన వారిపట్ల సానుభూతి దృక్పథం ఉంటుంది. పునరుజ్జీవనోద్యమం విభిన్నరంగాలలో భిన్నమైన 'మానవత'ను ప్రదర్శించింది.

### మూడు భిన్న దశలు...

బ్రిటీష్ స్వేచ్ఛా భావజాలంతో మొత్తంగా కాకపోయినా, ప్రధానంగా ప్రభావితమైన మధ్యతరగతి ప్రారంభించిన సామాజిక, మతప్రాతిపదిక ఉద్యమాలు మొదటి భారతీయ పునరుజ్జీవన దశ. అయితే ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన మేధావులు మాత్రం ఆంగ్లేయుల వలన ప్రభావితమైన భారతీయులు కాదు. పాత సంప్రదాయాలను శోధించి ప్రస్తుత సమస్యలను అవెలా పరిష్కరించగలవో అంచనా వెయ్యడం ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యం. 'సతి' ఉద్యమం వ్యతిరేకించిన వారితో జరిగిన చర్చలలో రాజా రామమోహనరాయ్ హిందూ గ్రంథాలను ఉటంకించడం, వితంతు వివాహాలను ప్రచారం

> **"అందువలన అందులోని మౌలికాంశాలు పునరుద్ధరించాలని, పునరుజ్జీవనోద్యమం మొదటి దశలోని, అంటే వలసవాద, భూస్వామ్య యుగంలోని విలువలను పునరుద్ధరించాలనుకొనే బదులు వామ పక్షాలు అణగారిన తరగతుల, దోపిడీ చేయబ డుతున్న, అంచులకు నెట్టివేయబడుతున్న వారి దృక్కోణం నుంచి పునరుజ్జీవనాన్ని తిరిగి ఆవిష్కరించాలి."**



నారాయణ గురు



అయ్యంకాళి

చేస్తున్న సందర్భంగా ఈశ్వరచంద్ర విద్యాసాగర్ గాని, ప్రపంచీకరణను ప్రబోధిస్తున్నప్పటి నారాయణగురు చర్యలనుగాని మనం ఇందుకు ఉదాహరణలుగా చూడవచ్చు. వారందరూ చీకటియుగం నుండి బయటపడే ప్రయత్నాలే చేశారు. బాహాటంగా కనిపించే సామాజిక ఛాందసాలను, మత మౌఢ్యాలను, అహేతుక క్రతువులను వారు వ్యతిరేకించడం చాలా సహజం. అంటే మొదటి దశ భారతీయ పునరుజ్జీవనం సామాజిక, సాంస్కృతిక అంశాలకే ప్రధానంగా పరిమితమైనందువలన రాజకీయ అంశాలు సాపేక్షికంగా ఉపేక్షకు గురయ్యాయి. వారి ఆలోచనలలోనే రాజకీయాలు ప్రముఖంగా చోటు చేసుకోలేదు.

అందుకు భిన్నంగా రెండవ దశ వలసవాద వ్యతిరేక రాజకీయాలను సామాజిక ఆధునికతను జోడించే ప్రయత్నం చేయడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. సాధారణంగా అందరూ అనుకున్నట్టు వలసవాద వ్యతిరేకత పునరుజ్జీవనోద్యమాన్ని అనుసరించలేదు. పునరుజ్జీవనోద్యమమే వలసవాద వ్యతిరేకతను అనుసరించింది. పునరుజ్జీవనోద్యమం మొదటి దశలోని విలువలను సైద్ధాంతిక స్వరూపం తీసుకునేటట్టు చేసి, అంతకుముందు చొరబడని చోట్లల్లో కూడా స్పష్టంగా కనిపించే అవకాశం జాతీయోద్యమం కల్పించింది. సామాజిక సమస్యలు రాజకీయాలలో చొరబడకుండా జాగ్రత్తలు తీసుకొని అవసరమైన మేరకే జోక్యం చేసుకొనే విధంగా జాతీయోద్యమం నియంత్రించింది. ఉదాహరణకు గాంధీజీ సత్యాగ్రహులతో పాటు సత్యాగ్రహం చేసినప్పటికీ వైకోమ్ సత్యాగ్రహంతో గాంధీజీ ఒక మధ్యవర్తేగాని భాగస్వామి కాదు.


ఇక మూడవదశ పునరుజ్జీవనం వలసవాద పాలన అంతంతో ప్రారంభమైంది. ఇది పునరుజ్జీవన విలువలు, మార్క్సిజం యొక్క సమ్మిశ్రమం. నిజానికి మార్క్సిజంలోనే పునరుజ్జీవన విలువలు ఉన్నాయి. కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా అంతర్భాగాలుగా ఉన్నాయి. సామాజిక, సాంస్కృతిక సమానత్వం అనే భావనతో ఉన్న మార్క్సిజం కుల, లింగ విషయాలతో సహితం సమానత్వం కోసమే పనిచేస్తుంది. ఇది గతంతో విడగొట్టుకొనడం కాదు. సమానత్వం, లింగ ప్రాతిపదికన కూడా సమన్యాయం, లౌకికతత్వం, మొదటి, రెండవ పునరుజ్జీవన దశల ఆలోచనలలోనూ ఉన్నాయి. అయితే అవి భిన్నమైన మానవత్వ ప్రాతిపదికన ఉండేవి. వామపక్షాలు కేవలం సంస్కరణలు మాత్రమే కాదు, ప్రస్తుతం ఉన్న సాంస్కృతిక, సామాజిక అలవాట్లను సమూలంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆ క్రమంలో పునరుజ్జీవనానికి ఒక కొత్త అర్థాన్నిచ్చాయి. ప్రముఖమైన పోరాటాలలో సంస్కృతి ప్రాధాన్యతను వామపక్ష ఉద్యమ నాయకులెందరో గుర్తించినప్పటికీ సృజనాత్మకంగా అందరినీ ఒక దరికి చేర్చడంలో వారు విఫలమయ్యారు. అందువలన 1930లలో ఈ మూడవ దశలోని విప్లవాత్మక సాంస్కృతిక చైతన్యం మొదలైనప్పటికీ, వాస్తవంలో ఊపందుకోలేదు. వామపక్ష పునరుజ్జీవనాన్ని ఈ వైఫల్యం ఎంతగా దెబ్బతీసిందంటే జాతీయ సాంస్కృతిక జీవనంలో పునరుజ్జీవన చైతన్యం దాదాపు అసంబద్ధంగా మారిపోయింది. సృజనాత్మక మేధావులలో ఒక పెద్ద భాగం వారి వారి ధోరణులకు వదిలివేయబడడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

**మారుతున్న లక్షణాలతో కొత్త పద్ధతులు...**

పునరుజ్జీవనోద్యమం ఒక సంఘటన కాదు. అదో క్రమం. సమాజం, ఆర్థికరంగంలో పెద్ద మార్పులు రావడంతో దాని లక్షణాలు కూడా మారుతూ ఉంటాయి. ఒకే రకమైన సంబంధాలు తిరిగి రెండవసారి ఏర్పడడం సాధ్యపడదు. అలాగే పెట్టుబడిదారీ విధానం, సంస్కరణల వలన ఏర్పడిన పరిస్థితులలో పునరుజ్జీవనోద్యమం మొదటి దశలో ఉన్న విలువలు తిరిగి నెలకొల్పడం సాధ్యపడదు. దానర్థం విలువల ప్రాసంగికత పోయిందని కాదు. వాటి సామాజికతలో మార్పు వచ్చిందని. అందువలన అందులోని మౌలికాంశాలు పునరుద్ధరించాలని, పునరుజ్జీవనోద్యమం మొదటి దశలోని, అంటే వలసవాద, భూస్వామ్య యుగంలోని విలువలను పునరుద్ధరించాలనుకొనే బదులు వామ పక్షాలు అణగారిన తరగతుల, దోపిడీ చేయబడుతున్న, అంచులకు నెట్టివేయబడుతున్న వారి దృక్కోణం నుంచి పునరుజ్జీవనాన్ని తిరిగి ఆవిష్కరించాలి. సామాజిక మానవతా వాదం సమాన సామాజిక, రాజకీయ స్థితిని నెలకొల్పడమే కాదు. సాంస్కృతిక, మేధోపరమైన స్వేచ్ఛను కూడా అది కోరుకుంటుంది. సమాజంలో ఈ రోజు విస్తృతంగా ఉన్న హింస, అసహనం మొదటిదశ పునరుజ్జీవనోద్యమ వైఫల్యం కాదు. దాని విలువలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చడంలో వైఫల్యం. ప్రపంచం భౌతికంగా మారుతున్నది కాని సాంస్కృతిక చింతనాత్మక వాతావరణం క్షీణించకపోయినా నిలకడగా ఉంది. మరింతగా దిగజారుతున్న సామాజిక విలువలను అరికట్టడానికి సంస్కృతి, రాజకీయాలకు మధ్యనున్న సంబంధాలను గురించి పునరాలోచించాలి. రాజకీయాలు సంస్కృతిని ఉత్తేజపరిస్తే, సంస్కృతి రాజకీయాలను శుద్ధి చేస్తుంది. భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ నాల్గవ దశను గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

**అనువాదం కె. ఉషారాణి**

# మహిళాభివృద్ధికి మార్గం పరిచిన విప్లవం




**"ఓ మహిళా!**
**నీ కన్నీళ్లను ఇక తుడిచేయ్**
**ఇక్కడ నవోదయం పొడిచింది**
**మూఢ నమ్మకాలతో**
**భయం లేదిక..**
**క్షుద్ర బంధనాలను తెంచుకొని**
**కొత్త రెక్కలను అన్వేషించు**
**మూఢత్వ చీకటిని చీల్చుకుంటూ**
**నవోదయం కాంతిమార్గాన**
**నవశకం వైపు దూసుకెళ్లు"**

సోవియట్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను మేల్కొలుపుతూ వారికి కల్పించిన కొత్త హక్కులపైనా, అధికారాలపైనా అవగాహన కల్పిస్తూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టింది. ఈ లక్ష్యంతో సోవియట్ ప్రభుత్వం 'కాంతి వైపు ముందుకు' లాంటి పోస్టర్లను రూపొందించింది.

మహిళల క్రియాశీలక భాగస్వామ్యంతో పాత సమాజాన్ని సమూలంగా పునర్ వ్యవస్థీకరించడం ద్వారా మహిళల హక్కుల సమస్యను సోవియట్ యూనియన్ సమర్థవంతంగా పరిష్కరించింది. నూతన సామాజిక వ్యవస్థను సఫలీకృతం చేసిన అక్టోబర్ మహావిప్లవ మార్గదర్శి లెనిన్ స్థాపించిన బోల్షివిక్ పార్టీ విజయవంతమైన విప్లవం పరిష్కరించాల్సిన అత్యంత ప్రధానమైన సామాజిక సమస్యల్లో మహిళల హక్కులు చాలా ప్రధానమైనవని అభిప్రాయపడింది. భూ యాజమాన్యతత్వాన్ని రద్దు చేయడం, వ్యవసాయ కార్మికులకు భూమిని బదిలీ చేయడం, ఉత్పత్తి పైనా, సృష్టించబడిన సంపద పంపిణీపైనా నియంత్రణ ఏర్పాటు చేయడంతో పాటు మహిళల సామాజిక దాస్య విముక్తికి సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించింది.

సోవియట్ యూనియన్ ప్రభుత్వం లెనిన్ సంతకంతో జారీ చేసిన మొట్టమొదటి డిక్రీ (ఉత్తర్వు) శాంతికి, భూమికి సంబంధించిన అంశాలపైనే. ఈ రెండు ఉత్తర్వుల్లోనూ మహిళలకు ప్రయోజనం చేకూర్చే చర్యలు నిర్దేశించారు. భూమిపై జారీ చేసిన డిక్రీ ప్రకారం పురుషులు ఎంత భూమి పొందుతారో అంతే భూమి మహిళలు కూడా పొందుతారు. ఆ తర్వాత జారీ చేసిన డిక్రీల్లోనూ మహిళలపై ప్రభావం చూపే అంశాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వడం విశేషం.

రోజుకు ఎనిమిది పని గంటలకు సంబంధించి అక్టోబర్ 29న (నవంబర్ 11), 1917న జారీ చేసిన డిక్రీ ద్వారా రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే పనుల్లో మహిళల నియామకంపై నిషేధం విధించారు. ఇదే ఏడాది నవంబరు 14(27)న సామాజిక భద్రత కోసం జారీ చేసిన ఉత్తర్వుల్లో మహిళలకు ప్రసూతీ ప్రయోజనాలు కల్పించారు. ప్రసవానికి ముందు, ఆ తర్వాత ఎనిమిది వారాల పాటు వేతనంతో కూడిన

> **"ఈ చట్టం ద్వారా పూర్తి వేతనంతో కూడిన ఎనిమిది వారాల సెలవు, పోషణ (నర్సింగ్) విరామాలు, ఫ్యాక్టరీల్లో విశ్రాంతి సౌకర్యాలు, ప్రసవానికి ముందు తర్వాత ఉచిత సేవలు, నగదు అలవెన్సులు లభిస్తాయి. ఇదంతా కూడా ఆరోగ్య విభాగానికి అనుబం ధంగా బోల్షివిక్ వైద్యులు వెరా లెబెడేవ నేతృ త్వంలోని తల్లీ, బిడ్డల సంరక్షణ కమిషన్ అమల్జేస్తుంది."**



అక్టోబరు విప్లవ సైన్యంలో మహిళా వాలంటీర్లు

సెలవులను, ఇతర ప్రయోజనాలను కల్పించారు.

వేతనాలకు సంబంధించి జారీ చేసిన డిక్రీ ద్వారా పురుష, మహిళ బేధం లేకుండా అంద రికీ సమానంగా ఒక కనీస వేతన స్థాయిని నిర్దేశించింది. మహిళలకు, పురుషులకు ఇద్దరికీ కూడా సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని తేల్చిచెప్పింది. పౌర వివాహాలకు సంబంధించి డిసెంబర్ 18 (31), 1917 తీసుకొచ్చిన డిక్రీలో ఇటు వివాహంలోనూ, తర్వాత కుటుంబంలోనూ పురుషులకు, మహి ళలకు సమాన హక్కులు కల్పించారు. రష్యన్ సోవియట్ ఫెడరేటివ్ సోషలిస్టు రిపబ్లిక్ (ఆర్ఎస్ఎఫ్ఎస్ఆర్) మొదటి రాజ్యాంగం (జులై 1918)లో మహిళా సమానత్వాన్ని, వారి రాజకీయ, పౌర హక్కులను వ్యవస్థీకృతం చేశారు. మహిళా కార్మికుల శాసన లక్ష్యాల్లో పట్టాభిషేకం లాంటి ఈ 1918 మాతృత్వపు బీమా కార్యాక్రమాన్ని రూపొందించడంలోనూ, అమల్లోకి తేవడంలోనూ తొలి ప్రజా దౌత్యవేత్త, సాంఘిక సంక్షేమ శాఖలో 1920 నుంచి 1922 వరకు మహిళా విభాగం (జెన్టాడెల్) అధిపతిగా పనిచేసిన అలెక్జాండర్ కొల్లన్‌టాయ్ కృషి చేశారు. ఈ చట్టం ద్వారా పూర్తి వేతనంతో కూడిన ఎనిమిది వారాల సెలవు, పోషణ (నర్సింగ్) విరామాలు, ఫ్యాక్టరీల్లో విశ్రాంతి సౌకర్యాలు, ప్రసవానికి ముందు తర్వాత ఉ చిత సేవలు, నగదు అలవెన్సులు లభిస్తాయి. ఇదంతా కూడా ఆరోగ్య విభాగానికి అనుబం ధంగా బోల్షివిక్ వైద్యులు వెరా లెబెడేవ నేతృ త్వంలోని తల్లీ, బిడ్డల సంరక్షణ కమిషన్ అమల్జేస్తుంది. మెటర్నటీ క్లినిక్‌లు, సంప్రదింపు కార్యాలయాలు, ఫీడింగ్ స్టేషన్లు, నర్సరీలు వంటి పోషణ కేంద్రాలు, తల్లీ, బిడ్డల కోసం ప్రత్యేక హోమ్‌ల విస్తారమైన నెట్ వర్క్ ద్వారా ఈ కార్యక్రమం అమలౌతుంది. సోవియట్ పాలన లో రష్యన్ మహిళల్లో అమోఘమైన ఆదరణ చూరగొన్న ఏకైక కార్యక్రమం కూడా ఇదే.

గర్భస్రావానికి నేరపూరిత జరిమానాలు విధించడాన్ని రద్దు చేస్తూ సోవియట్ ప్రభుత్వం 1920లో ఒక డిక్రీ జారీ చేసి ప్రపంచంలోనే ఇలాంటి ఆదేశాలు జారీ చేసిన తొలి ప్రభుత్వం గా ఖ్యాతినొందింది. "పాత కాలపు అవశేషాలు, ప్రస్తుత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులు కొందరు మహిళలను గర్భస్రావానికి ప్రేరేపించవచ్చు, కాబట్టి గర్భస్రావానికి శిక్ష విధించడం తగదని ప్రజా ఆరోగ్య, సాంఘిక సంక్షేమ కమిషనరేట్, ప్రజా న్యాయ కమిషనరేట్ నిర్ధారణకొచ్చాయి. మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, స్వార్థపరుల నుంచి అమాయకులను రక్షించేం దుకు డిక్రీ ఈ కింది తీర్మానం చేసింది :

'నేను, మహిళలకు గరిష్ట భద్రత కల్పించే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కృత్రిమ పద్ధతుల ద్వారా ఉచిత గర్భస్రావం జరిగేలా చూస్తాను' – ప్రజా ఆరోగ్య, సాంఘిక సంక్షేమ కమిషనరేట్, ప్రజా న్యాయ కమిషనరేట్ డిక్రీ"

సోవియట్ ప్రభుత్వం ఏర్పడిన వెను వెంటనే మహిళా సాధికారిత కోసం జారీ చేసిన ఈ డిక్రీలన్నింటిని ఉద్దేశించి లెనిన్ మహాశయుడు ఈ విధంగా చెబుతాడు.

"ప్రపంచంలో ప్రజాతంత్ర పార్టీయే కాదు, అభివృద్ధి చెందిన బూర్జువా గణతంత్ర దేశాలు చూసినా ఈ రంగం (మహిళా సాది కారత)లో దశాబ్దాలు తరబడి సాధించింది అంతా కూడా మనం మన ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో సాధించినదాట్లో వందో వంతు కూడా ఉండదు. మహిళలను అసమానత్వం లోకి నెట్టిన అన్యాయమైన చట్టాల పునాదులను మనం బద్ధలుకొట్టాము. పాతకాలపు దురాచా రాలను, బూర్జువా చట్టాలను, వ్యవస్థలను సమూలంగా తొలగించి పునాధిని శుభ్రం చేసి నవ నిర్మాణాన్ని చేపట్టాలి. ఇప్పటిదాకా పునాధి ని మాత్రమే శుభ్రం చేశాం. నిర్మాణం చేపట్టాల్సివుంది"

# భారతదేశంలో మహిళల ఉపాధి సమస్య

**ఇంద్రాణి మజుందార్**



రచయిత
సామాజిక కార్యకర్త

దశాబ్దకాలంగా భారతదేశంలో లింగాధారిత ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లయితే, గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా వివక్ష, నిరుద్యోగం ఓ భూతంలా వెంటాడుతున్నాయి. వికృతరూపం దాల్చిన సంక్షోభం మహిళాలోకాన్ని వెంటాడుతోంది. నిత్యావసర సరుకుల ధరలు అదుపులో లేకపోవడం, కుటుంబ అవసరాలు పెరగడం, పిల్లల చదువులు, ఆహారం, నీరు, బట్టల్లాంటి అనేకానేక గృహావసరాలపై ఖర్చు పెరగడం, ఆదాయ వ్యయాల మధ్య సమతుల్యత లోపించడం వలన మహిళలు ఉపాధి కోసం ఎక్కువగా ముందుకొస్తున్నారు. తదనుగుణంగా అవకాశాలు లభించక పోవడమేగాక, ఉన్న అవకాశాలు సైతం విధ్వంసకర పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నాయి. మహిళా ఉపాధి సంక్షోభానికి సంబంధించిన వాస్తవాలు ప్రపంచానికి సంబంధించిన చర్చ కాదు. కానీ భారతదేశంలో క్షీణిస్తున్న ఉపాధి అవకాశాలను గురించి ఆవశ్యకంగా చర్చించవలసి ఉంది.

మహిళా ఉపాధి అవకాశాలు ఎందుకు క్షీణిస్తున్నాయని లోతుగా పరిశీలిసే దానికి స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నాయి. అయినా ఇది ఒక చర్చనీయాంశంగా లేకపోవడం కూడా ఓ ప్రధాన కారణం. నేషనల్ శాంపిల్ సర్వే సంస్థవారి సర్వేలు నమ్మశక్యంగా లేకపోవడం కూడా! పూర్వకాలంలో మహిళలు ప్రవేశించలేని రంగాలు, చేయలేని పనులుగా భావించిన అనేకానేక ఉద్యోగాలలోకి మన దేశంలోని మహిళలు ప్రవేశించారు. ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ దానికి కారణం. అంతేగాక గతంలోకన్నా పెరిగిన బాలికల విద్య, ఉద్యోగాల పట్ల ఆసక్తి, పోరాడేతత్వం మొదలగు అంశాలు కూడా తోడయ్యాయి. నగర ప్రాంతాలలో, ముఖ్యంగా భిన్నమైన సేవా రంగాలలో నిరక్షరాస్యులు, పాక్షికంగా చదువుకున్న మహిళలు కనిపిస్తున్నారు. కొత్త కొత్త రంగాలలో, స్థలాలలో మహిళల సంఖ్య అధికంగా ఉన్నట్లు పైకి కన్పించినప్పటికీ, వాస్తవ పరిస్థితులలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు ఉపాధి కోల్పోతున్నారు. అటు ఇళ్ళల్లోనూ, ఇటు సమాజంలోనూ ఉపాధి కోల్పోయిన లక్షలాది మహిళలు సమాజంలో నలుదిశలా విస్తరించియున్నారు. మహిళలు తమ ఆదాయాలను గురించి నిర్దిష్టమైన డిమాండ్‌లు చేయరు. వారికి లభించేది కూడా నామమాత్రం. అయినప్పటికీ ఉపాధి ఎంపికలో అసంఘటితంగానే మిగిలిపోతున్నారు. ఉపాధి రంగాలను ఊహించడం, ఆ దిశగా మహిళలను నడిపించడం, వారి ఆసక్తులను పరిక్షిస్తూ విభిన్న వృత్తుల్లోకి ప్రవేశం కల్పించడాన్ని మహిళా ఉద్యమాలు ప్రధానంగా స్వీకరించాలి.

శ్రామికవర్గంపై జరిపిన ఈ సర్వే ఫలితాలు తెలియజేసేదేమనగా, సర్వే జరిగే సంవత్సరం ముందు అనుబంధ రంగాలలో ఉపాధి కొంత లభించినప్పటికీ, భిన్న కారణాల రీత్యా అధికశాతం మంది మధ్యంతరంగా తొలగించబడ్డారు. ఆ సంవత్సరం చివర వరకూ వారికి ఉపాధి కల్పించలేదు. సరైన ఉపాధి, సరిపడా ఆదాయం లేకుండానే శ్రామిక వర్గం జీవనం సాగించింది. మరికొందరికి వారి వ్యక్తిగత నైపుణ్యాలకు తగిన ఉపాధి లభించలేదు.

### ఉపాధి గణాంకాలు ఏం చెబుతున్నాయి?

ప్రపంచవ్యాప్తంగా మహిళల ఉపాధి అవకాశాలు పెరుగుతుండగా, చిత్రంగా, మనదేశంలో వ్యతిరేక దిశలో సాగుతూ, నానాటికీ క్షీణిస్తున్నాయి. శ్రామికవర్గంలో మహిళల శాతం క్రమంగా తగ్గిపోతున్నది. 1993-94 నుండి 2004-05 వరకూ గణాంకాలను పరిశీలిస్తే మహిళా ఉపాధి ఏ స్థాయికి పడిపోయిందో స్పష్టమవుతుంది. ఇది సరళీకరణ విధానాల ఫలితం. ముఖ్యంగా గ్రామాలలో ఈ స్థితి ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. 1983వ సంవత్సరంలో గ్రామీణ మహిళల్లో 34 శాతం ఉపాధిరంగంలో ఉండగా, 2011-12 నాటికి 25 శాతానికి పడిపోయింది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఇంతగా పడిపోవడం ఇదే తొలిసారి. పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నట్లు కన్పించినప్పటికీ, 1980వ దశకంలో గ్రామీణ ప్రాంతం కన్నా, పట్టణ ప్రాంతంలో మహిళా ఉపాధి తక్కువగా ఉన్నది. తర్వాత మూడు దశాబ్దాలలో అవే గణాంకాలు కొనసాగినప్పటికీ, 2004-05 ఆ ప్రాంతంలో మరింత తగ్గుదల కన్పిస్తున్నది.

### మహిళా ఉపాధి గణాంకాలు

1) 2004-05 నుండి 2011-12 మధ్యకాలంలో సుమారు రెండుకోట్ల మంది మహిళలు తమ ఉపాధి రంగాల నుండి తొలగించబడ్డారు. ఆ తర్వాతకాలంలో మరి కొంతమంది ప్రవేశించినప్పటికీ ఆ సంఖ్య తొలగించబడిన వారికి సమానం కాదు.

2) ఈ గణాంకాలు కేవలం ఉపాధి కోల్పోయే మహిళల లెక్కలను తెలియజేయటం మాత్రమే కాక, స్త్రీ పురుష ఉపాధి నిష్పత్తిలో ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని కూడా తెలియజేస్తున్నాయి. దేశవ్యాప్తంగా చూసినట్లయితే 1993-94లో 33 శాతానికి పడిపోయిన ఉపాధి, 2011-12 నాటికి మరింత క్షీణించి 27 శాతానికి తగ్గిపోయింది.

3) కార్మికుల లెక్కల్లో ఎలాంటి వేతన చెల్లింపులు లేని వారు కూడా ఉంటారు. ఇంటి పనుల్లో సహాయకులుగా ఉండే చాలామందికి ఎలాంటి వ్యక్తిగత ఆదాయం ఉండదు. అందులో 40 శాతం మహిళలే ఉండగా, మగవారు 15 శాతం ఉంటారు. అంటే 25 శాతం స్పష్టమైన వ్యత్యాసం మనకు కనిపిస్తూనే ఉంది. వీరిలోనే ఇంత తేడా ఉండగా, చెల్లింపులున్న రంగాల్లో వ్యత్యాసం గ్రాఫ్‌లో కనిపించిన దానికన్నా ఎక్కువ ఉంటుంది. 2011-12 నాటికి వేతనాలున్న రంగాలలో మహిళా ప్రాతినిధ్యం 22 శాతమే కనిపిస్తుంది.

**"వివరాలను పరిశీలించినట్లయితే, అన్ని కులా ల్లోనూ ఉపాధి తగ్గడం స్పష్టంగా కనిపిస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో ఏ సామాజిక వర్గం కూడా ఈ ఉపద్రవం నుండి తప్పించుకోలేకపోయింది. కానీ, పట్టణ, నగర ప్రాంతాల లో కొని ఉన్నత కులాలకు లాభమే సమకూరింది. ఆదినుంచీ ముస్లిం మహిళల ఉపాధి అవకా శాలు, ఉద్యోగాలలో స్థిరపడటం తక్కువే."**



గిరిజన మహిళలు : విపరీతమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారు

### సామాజిక వర్గాల ఆధారంగా మహిళా కార్మికుల ప్రాతినిధ్యం

గ్రామీణ భారతదేశంలో ఆదివాసీ, దళిత మహిళలు అత్యంత దయనీయమైన స్థితిలో బ్రతుకుతున్నారు. సహజంగా సమాజంలోని కులాల ఆధారంగా మహిళా ఉపాధి ఉంటుంది. అగ్రకులాలలో ఉపాధి కోరేవారు తక్కువ శాతంలో, అట్టడుగువర్గాల మహిళలైన ఆదివాసీలు, దళితులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారు అధికశాతంలోనూ ఉంటారు. వివరాలను పరిశీలించినట్లయితే, అన్ని కులాల్లోనూ ఉపాధి తగ్గడం స్పష్టంగా కనిపిస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో ఏ సామాజిక వర్గం కూడా ఈ ఉపద్రవం నుండి తప్పించుకోలేకపోయింది. కానీ, పట్టణ, నగర ప్రాంతాలలో కొని ఉన్నత కులాలకు లాభమే సమకూరింది. ఆదినుంచీ ముస్లిం మహిళల ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలలో స్థిరపడటం తక్కువే. కాలం మారినా దశాబ్దాలు గడచినా వారి స్థితిగతుల్లో ఎలాంటి మార్పులేదు. ఎక్కడివారు అక్కడే ఉన్నారు. దీనికి ప్రధాన కారణం ముస్లిం మహిళలు ప్రధానంగా గృహ సంబంధిత ఉపాధి అవకాశాలకే పరిమితమవ్వడం కావచ్చు. గృహసంబంధ అవసరాలు పెరుగుతున్నప్పటికీ ఉపాధి అవకాశాలలో స్థిరత్వం, ఆదాయంలో పెరుగుదల గోచరించడం లేదు.

### మహిళల పనిహక్కు

నిరుద్యోగం, అర్హతలకు తగిన ఉపాధి లేకపోవడం, అస్థిరమైన ఉపాధివంటి అంశాలు మగవారికైనా, మహిళలకైనా క్లిష్టమైనవే... పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగాలే! నయా ఉదారవాద విధానాలలో ఈ అంతర్గత లక్షణాలన్నీ పెల్లుబికి వస్తాయి. ఇది అందరికీ తెలిసిన సత్యమే అయినప్పటికీ, పునరుద్ఘాటించడం అవసరం. ఎందుకంటే వీటివలన ఉపాధి అవకాశాలపై ప్రత్యక్ష ప్రభావం కనిపిస్తుంది.

ఎ) పారిశ్రామిక కార్మికవర్గం తమ స్థానాల నుండి తొలగించబడుతున్నారు. అడ్డూ అదుపులేకుండా ప్రవేశిస్తున్న విదేశీ వస్తువుల వలన, స్వదేశీయులు ఉత్పత్తిరంగం నుండి బయటకు నెట్టివేయబడుతున్నారు. స్థానిక ఉత్పత్తుల ఆధారిత రంగంలో ఉపాధి కోల్పోయి నిరుద్యోగం పెరుగుతుంది.

బి) అధిక లాభాలు వచ్చే దిశగా ప్రైవేటు, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడం, శ్రామికులను తొలగించి యంత్ర సహాయంతో వ్యవసాయం కొనసాగించడం, మరోవైపున భారతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటూ, తమ దేశీయ ఉద్యోగులను తొలగిస్తున్నారు.

సి) మార్కెట్‌లో తమకు అనుబంధంగా వ్యాపారం చేసుకొనే అనేకమంది చిన్న చిన్న వ్యాపారులకు కృత్రిమ కొరత సృష్టిస్తూ వారి ఉపాధి పోగొట్టడం.

డి) కర్మాగారాలు మూసివేయడం, మూకుమ్మడిగా శ్రామికులను తొలగించడం, శ్రామిక చట్టాలను, అతిక్రమించడం, నిర్వీర్యం చేయటం, గ్రామీణ ప్రాంతాలకు నిధులను తగ్గించడం, రైతాంగానికి అందాల్సిన విత్తనాలు, ఎరువుల రంగాలలో ప్రైవేటు వ్యక్తులు, మల్టీ నేషనల్ కంపెనీలు సైతం ప్రవేశించడం, ప్రజల ఆహార అవసరాలకన్నా, అంతర్జాతీయ మార్కెట్ లో అమ్ముడుపోయే వ్యాపార పంటలు పండించడం, గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ బ్యాంకుల సంఖ్యను తగ్గించడం, ప్రాధాన్య తారంగాలపై పరిమితులు, రాష్ట్ర ప్రభుత్వాలు సేకరించే ఆహార ఉత్పత్తులకు కనీస మద్దత్తు ధరలు ప్రకటించకపోవడం, పంటలపై అధిక పెట్టుబడి పెట్టవలసిన పరిస్థితులు, ఆదాయం మాత్రం తగ్గిపోవడం లాంటి అనేకానేక అంశాలుతోడై, రైతాంగంలో సైతం ఉపాధి కుదేలైంది. వ్యవసాయరంగంపై దెబ్బపడటం, 2005 మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడంలో శ్రద్ధ వహించక, పరిమితులు విధించడం వంటి అనేకానేక అంశాలు మహిళల ఉపాధికి గండికొట్టాయి.

మహిళలు ఎదుర్కొనే ఈ ముఖ్య సమస్యను మనం మరోకోణం నుంచి కూడా పరిశీలించాలి. నూతన ఆర్థిక విధానాలు, ఆర్థిక అసమానతలు, పురుష ప్రపంచం నుంచి ఎదురయ్యే పోటీకి తోడయ్యాయి. ఉపాధి కోసం మహిళలు పోరాటం చేయటం నిరంతర ప్రక్రియ అని గతానుభవాలు స్పష్టపరుస్తున్నాయి. మహిళలు తమపై జరిగే హింసకు, చూపే వివక్షతకు, స్త్రీజాతిపట్ల వైర స్వభావంతో దాడులకు పాల్పడుతున్న వారికి, కులాధారంగా సృష్టిస్తున్న విధ్వంసాలకు, సామాజికంగా వేసే వెలివేతలకు వ్యతిరేకంగా, తమ ఆహారభద్రత కోసం చేసే పోరాటాల్లాగానే ఉపాధి కోసం సైతం ఉద్యమించాలి.

ఈ అంశాలపై జరిగే ప్రతి ఉద్యమానికి అంతర్గతంగా, బయటి నుండి నిరంతరం మద్దత్తును సమీకరించాలి. తమపై జరిగిన అత్యాచారాలకు బలైన చాలామంది, ఉద్యోగం, ఆదాయం కావాలన్న డిమాండ్‌ను ప్రకటిస్తారు. కారణం ఈ సమాజంలో బ్రతకడానికి అవి ఆధారమౌతాయి.

"1995-96 నుండి 2009-10 మధ్య గడిచిన 15 సంవత్సరాలలో 36 లక్షల మంది పురుషులు చేనేత పరిశ్రమ నుండి నిష్క్రమిం చగా, మహిళలు గతంకన్నా 9 లక్షల మంది పెరిగారు. దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమలో 57 శాతం మహిళలే ఉండగా, ఈశాన్య రాష్ట్రాలలోనే 96 శాతం ఉన్నారు. వీరిలో అత్యధికశాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు."

ఇదే సమయంలో, భారతీయ సమాజ సంస్కృతిలో మహిళల ప్రధాన బాధ్యత గృహావసరాలు తీర్చడం, అందరికీ అందుబాటులో ఉంటూ వాళ్ళ అవసరాలు తీరుస్తూ బతకడం చాలా సామాన్య విషయంగా కనిపిస్తుంది. ఈ క్రమంలో తమ ఉపాధికన్నా, కుటుంబ సభ్యుల అవసరాలకు ఉపయోగపడడమే ప్రథమ ప్రాధాన్యంగా మహిళలు కూడా భావిస్తున్నారు. అందువలననే తమ ఇళ్ళవద్దే కూర్చొని చేసే విధంగా, రకరకాల వృత్తులను, వ్యాపారాలను, వర్తకుల అవసరాలకనుగుణమైన చిన్న చిన్న పనులను, అవి అల్పాదాయమైనప్పటికీ, అంగీకరించి చేస్తున్నారు. తమ కష్టానికి తగిన ఫలితం లేకున్నా ఎంతో కొంత అన్న ధోరణితో కష్టించి పని చేస్తున్నారు. ఇంటిపని చేసుకుంటూ సంపాదించే ఈ మొత్తం చాలా తక్కువగా ఉంటుంది. సామాజిక ఆంక్షలు సహకరించని వాతావరణ పరిస్థితుల మధ్య మహిళలు ఉద్యోగాల కన్నా, ఇంటిలోనే అధిక పనిభారంతో కొనసాగుతున్నారు. ఇంటివద్దే ఉండి చేసే ఉపాధి పనులు కూడా ఈ మధ్యకాలంలో క్రమేపీ మహిళలకు దూరమవ్వడం శోచనీయం. క్షీణిస్తున్న ఉపాధి అవకాశాల కారణంగా, ఎప్పుడైనా అనుకోకుండా పని లభిస్తే, దానిపై వచ్చే ఆదాయం కోసం శక్తిని మించి, అధిక కాలం శ్రమపడాల్సి వస్తుంది. పని దొరికినప్పుడే కాస్తంత ఎక్కువ సంపాదించుకోవాలన్న సగటు మనిషి ఆలోచనే ఇది. కనీస వేతనం లేకపోయినా, రాన్రానూ ఆదాయ వనరులు క్షీణిస్తున్నా, అనారోగ్య వాతావరణం పని ప్రాంతాలలో ఎదురవుతున్నా తరచూ తొలగించబడుతూ, సకాలంలో జీతాలు ఇవ్వకున్నా, ఇవ్వాల్సిన వేతనం సైతం ఎగ్గొడుతున్నా, ఏమీ చేయలేని నిస్సహాయతస్థితిలోనే ఇంటినుండి మహిళలు పనిచేస్తున్నారు. తమకు ఎక్కువ పనిదినాలు కావాలని అధికశాతం సర్వేలలో చెబుతున్నారు.

**గృహాధారిత పనులలో అవకాశాలు**

'నేషనల్ శాంపిల్ సర్వే సంస్థవారి లెక్కల ప్రకారం (2011-12) దేశంలో 160 లక్షలకుపైగా మహిళలు ఇంటివద్ద నుండిచేసే పనుల్లో ఉన్నారు. ఇందులో 34 లక్షల మంది బీడీ కార్మికులు, 30 లక్షలమంది రెడీమేడ్ దుస్తుల తయారీలో, 26 లక్షల మంది చేనేత పనుల్లోనూ, ముఖ్యంగా చేతితో నేసే పనిలోనూ, 33 లక్షల మంది ఇళ్ళవద్దే రిటైల్ వ్యాపారం నిర్వహిస్తూ ఉన్నారు.

బీడీ పరిశ్రమల్లోనూ, నేత పరిశ్రమల్లోనూ పనులు భిన్నంగా ఉన్నప్పటికీ పరిస్థితులు మాత్రం ఇంచుమించుగా ఒకేలా ఉన్నాయి. గతంలో లక్షా ఇరవై వేలకోట్లుండే బీడీల ఉత్పత్తి 1990 మధ్య కాలానికి 75,000 కోట్లకు పడిపోయింది. కానీ 1999-2000, 2011-12 మధ్యకాలానికి, బీడీ పరిశ్రమలోని మహిళా కార్మికుల సంఖ్యమాత్రం 14 లక్షలు పెరిగింది. ఉత్పత్తి తరిగింది, కార్మికులు పెరిగారు కానీ సగటు పనిదినాలు, వేతనం మాత్రం తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో గతంలో ప్రతి వెయ్యి బీడీలకు ఇచ్చే వేతనం, ప్రస్తుత పరిస్థితుల్లో ఇస్తున్న కూలీ రెండింటిలో వ్యత్యాసం క్రమంగా పెరుగుతూ కార్మికులకు అన్యాయం జరుగుతున్నది.

1995-96 నుండి 2009-10 మధ్య గడిచిన 15 సంవత్సరాలలో 36 లక్షల మంది పురుషులు చేనేత పరిశ్రమ నుండి నిష్క్రమించగా, మహిళలు గతంకన్నా 9 లక్షల మంది పెరిగారు. దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమలో 57 శాతం మహిళలే ఉండగా, ఈశాన్య రాష్ట్రాలలోనే 96 శాతం ఉన్నారు. వీరిలో అత్యధికశాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. ఆఖరుకు, అంత్యోదయ పథకంలోని 10 శాతంతో కూడా కలుపుకుంటే మొత్తం 57 శాతం ఉంటారు... వీరి నెలసరి ఆదాయం 2,500/- కన్నా తక్కువే! ఉత్తర భారత దేశంలోని జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో సరాసరి వేతనం 2 వేల రూపాయల కన్నా తక్కువే! చేనేత కార్మికుల జీవితాలు నికృష్టస్థితికి చేరడానికి ప్రధాన కారణం, సబ్సిడీ ధరకు బట్టలు తీసుకునే ప్రభుత్వం, సకాలంలో డబ్బు చెల్లించక పోవడం... అంతేగాక సబ్సిడీ రేట్లపై చేనేత వస్త్రాలను తీసుకోవటాన్ని విరమించుకోవడం. సహకార సంస్థలు కొంత మార్జిన్ ఇచ్చి వ్యాపారం చేస్తున్నప్పటికీ, అధికశాతం అప్పుల్లో కూరుకుపోవడం, బకాయిలు రాకపోవడం, మొదలగు కారణాలవల్ల 66 శాతం చేనేత కార్మికులు రకరకాల వెతలకు లోనవుతున్నారు.

గత రెండు నివేదికలలో స్పష్టమవుతున్న మరో ప్రధానాంశం. మాస్టర్ వీవర్స్ వద్ద పని చేసే చేనేత కార్మికులు 43 శాతం నుండి 25 శాతానికి పడిపోవడం. ఆకలి చావులు, అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు పెరుగుతున్న తరుణంలో తమవద్ద పనిచేసే చేనేత కార్మికులకు వేతనాలు చెల్లించలేక, వ్యాపారులు కూలీలను తగ్గించుకుంటున్నారు. అయినప్పటికీ నానాటికీ మహిళా, పురుష చేనేత కార్మికులు తగ్గుతున్నా, ఉత్పత్తులు యధావిధిగానే ఉంటున్నాయి. కార్మికులు పనిభారం మోస్తూ కొనసాగడం, నేత నేయడంలో నైపుణ్యం, పనిలో అనుభవం, కఠినమైన శారీరక శ్రమ అవసరమున్న చేనేత రంగంలో, గతంలో పనిని స్త్రీ పురుషులిద్దరూ సమానంగా పంచుకొనేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయి, భారం మొత్తం మహిళలపైనే పడుతున్నది. ఈశాన్య రాష్ట్రాలు, కేరళ, హిమాచల్‌ప్రదేశ్‌లతో పోల్చుకుంటే, దేశంలో మహిళా కార్మికులు 25 శాతం మాత్రమే. ఈ రంగం నుండి వైదొలుగుతున్న మగవారికి ప్రత్యామ్నాయంగా మహిళలసంఖ్య పెరుగున్నది. పరిమిత ఆదాయంలో కూడా, నైపుణ్యంగల వారికి ఎక్కువగా, లేనివారికి నామమాత్రపు చెల్లింపులు జరుగుతున్నాయి.

అంతర్జాతీయంగా రెడీమేడ్ దుస్తుల వ్యాపారంలో ఎగుమతులలో పెరుగుదల ఉన్నట్లు చెప్పబడుతుంది. కానీ వాస్తవంగా అతి తక్కువ శాతం మాత్రమే ఉన్నది. ఉన్నత ప్రమాణాలున్న సంస్థలు మినహా అధికశాతం రోజువారీ దుస్తుల తయారీతో స్థానిక మార్కెట్‌కే పరిమితమౌతున్నారు. అంతర్జాతీయ ఎగుమతులకు అనుగుణమైన దుస్తుల తయారీ ఫ్యాక్టరీలలో జరుగుతుంది తప్ప, ఇళ్ళవద్ద కాదు. చేనేత కార్మికులు దక్షిణ భారతంలో ఎక్కువే అయినప్పటికీ, ఉత్తర, ఈశాన్య భారతంతో పోల్చుకుంటే నామమాత్రమే. కానీ ఉత్తర

> **❝ ఎన్ఎస్ఎస్ఒ వారి అధికారిక గణాంకాలు సైతం 2004-05 నాటికి 42 శాతం, 2011-12 నాటికి 35 శాతానికి పడిపోయినట్లు ధృవీ కరించాయి. శాతాలలో, నిష్పతుత్లలో తేడాలున్నప్పటికీ, ఒక విషయంలో స్పష్టత ఉంది. అదే వ్యవ సాయరంగంలో మహిళలు తగ్గిపోవడం. ❞**

భారతదేశంలోకన్నా, దక్షిణ భారతదేశ కార్మికులకే చైతన్యమెక్కువ! అందుకే కర్నాటక ప్రభుత్వం, తన అవసరాల నిమిత్తం చేనేత కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ / భవిష్యత్ నిధిని వాడుకోవాలన్న నిర్ణయానికొచ్చినప్పుడు, కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెంగుళూరు రోడ్లమీదకొచ్చారు. (కరెంటుపోయిన కారణంగా అక్షరాలా చీకట్లో చిందులేశారని గమనించ వలెను). ఎన్ని రెడీమేడ్ వ్యాపారాలొచ్చినా ఇళ్ళవద్దే పనిచేసే మహిళా కార్మికుల సంఖ్య మాత్రం 1999-2000లో ఉన్న 63.7 శాతం నుండి 2011-12 నాటికి 85.5 శాతానికి పెరిగింది.. ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. అందువలనే అత్యంత తక్కువ జీతాలిచ్చినా, పనిభారం పెరిగినా, నిత్యం ఉపాధిలేకున్నా, దొరికినంత చేసుకొని, వచ్చిన ఆదాయంతోనే సరిపెట్టుకుందామని భావిస్తున్నారు.

### అన్ని తరగతుల్లోనూ, మహిళా కార్మికుల పెరుగుదల

ఆర్థికంగా ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నప్పటికీ, కొన్ని రంగాలలో మహిళల ప్రాధాన్యత క్రమంగా పెరగడం గమనించవచ్చు. నూతన అవకాశాలు, చైతన్యవంతమైన మహిళా నాయకులుద్భవించడం దీనికొక కారణం. భారతదేశంలోని ప్రధాన నగరాలలో 28 లక్షల మంది గృహ సేవికలు మంచి ఆదాయాన్నే గడిస్తున్నారు. ఎవరి యజమానుల వద్ద వారు వ్యక్తిగత సహాయకులుగా పనిచేస్తున్నప్పటికీ ఏదైనా ప్రధాన సమస్య ఉత్పన్నమైనప్పుడు చాలా త్వరితగతిన సంఘటితమవుతున్నారు. అదే రీతిగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కొన్ని పథకాలలో 50 లక్షలకు పైగా మహిళలు పనిచేస్తున్నారు. వారిలో 25 లక్షలమంది ఐసిడిఎస్ (ఇంటిగ్రేటెడ్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) అనే సమీకృత బాలల అభివృద్ధి పథకంలోనూ, 22 లక్షల మంది మధ్యాహ్న భోజన పథకంలోనూ, 9 లక్షల మంది జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకంలో 'ఆశా' వర్కర్లుగానూ కొనసాగు తున్నారు. వాస్తవానికి క్రమబద్ధమైన ఉపాధి అవకాశాలు, ఉద్యోగంలో హక్కులు, ఆలస్యంలేని వేతనాలు ఇవి ఏ కార్మికుడికైనా కనీసపు అవ సరాలు. ఇవేమీ లేకున్నా తమ జీవితానికి, చేసే పనికి శాశ్వతత్వం, భద్రత లేకున్నా, చిరు ఆదాయమే అయినా, మహిళలు కొనసాగు తున్నారు. కారణం ఏదో ఒక రోజు తమ పనులకు శాశ్వతత్త్వం లభిస్తుందన్న ఆశ.

మోడీ నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వంలో ఈ అవకాశాలు అత్యంత పరిమితమైపోయాయి. శిక్షణా కార్యక్రమాలంటూ ప్రభుత్వం ప్రకటన లిస్తూ ఆ దిశగా నామమాత్రపు చర్యలు మాత్రమే చేపడుతున్నది. కానీ నిరుద్యోగం నిర్మూలనకు శాశ్వత చర్యలు, నడుస్తున్న ఉపాధి కార్యక్రమా లలో, మహిళల వాస్తవ స్థితిగతులను మెరుగుపరిచే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ పథకాలు అమలుపరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వవలసిన బడ్జెట్‌కు కేంద్ర ప్రభుత్వం కోతలు పెడుతున్నది. సకాలంలో నిధులు పంపకపోవడంపై మహిళలు ఉద్యమిస్తున్నారు. అయినప్పటికీ, శాశ్వత ఉపాధి, సకాలంలో వేతనం తమ హక్కులుగా భావిస్తూ మహిళలు పని హక్కుకోసం పోరాడుతున్నారు.

### వ్యవసాయ రంగంలోమహిళలు

1990వ దశకంలో, భారతీయ వ్యవ సాయ రంగంలో ఓ స్పష్టమైన మార్పు వచ్చినట్లు నివేదికలు, అధ్యయనాలు తెలుపుతున్నాయి. అధికశాతం పురుషులు వ్యవసాయరంగం నుండి, ఇతర రంగాలకు వలసపోతుండగా, మహిళలు వ్యవసాయరంగంలోకి ప్రవేశించడం వీటిలోని ప్రధానాంశం. 1991లో 35 శాతం మహిళలు వ్యవసాయ రంగంలో ఉండగా, 2004-05 నాటికి 39 శాతానికి పెరగడం స్పష్టంగా కనిపిస్తుంది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు లెక్కల్లో ఇది మరింత వృద్ధిచెంది కనిపిస్తుంది. ఆ తర్వాత వ్యవసాయరంగంలో మహిళాచిత్రం మారిపోయింది. 2011 నాటికి దశాబ్దకాలంలో 2 శాతం కన్నా తగ్గిపోయింది. ఎన్ఎస్ఎస్ఒ వారి అధికారిక గణాంకాలు సైతం 2004-05 నాటికి 42 శాతం, 2011-12 నాటికి 35 శాతానికి పడిపోయినట్లు ధృవీ కరించాయి. శాతాలలో, నిష్పతుత్లలో తేడాలున్నప్పటికీ, ఒక విషయంలో స్పష్టత ఉంది. అదే వ్యవసాయరంగంలో మహిళలు తగ్గిపోవడం.

మరో చారిత్రాత్మక సత్యం కూడా భారతదేశంలో ప్రకటితమైంది. అదే... వ్యవసాయ దారులు తగ్గిపోవడం. 21వ శతాబ్దం తొలి దశకంలో 90 లక్షల మంది చిన్న రైతులు వ్యవసాయం నుండి వైదొలిగారు. 2001 నాటికి రైతుల సంఖ్య 12.7 కోట్లకు, 2011వ సంవత్సరం నాటికి 11.8 కోట్లకు ఆ సంఖ్య చేరుకుంది. కానీ వ్యవసాయ కూలీల సంఖ్య మాత్రం 37.5 లక్షలు పెరిగింది.

అదేవిధంగా మహిళా రైతుల సంఖ్య సైతం 59 లక్షలకు పడిపోయింది. మగరైతు లకన్నా ఇది రెండురెట్లు అధికం. తత్ఫలితంగా మహిళారైతుల సంఖ్య 33 శాతం నుండి 30 శాతానికి పడిపోయింది. ఆశ్చర్యకరంగా వ్యవసాయ కార్మికుల సంఖ్య సైతం 46 నుండి 43 శాతానికి పడిపోయింది. అదేవిధంగా మహిళా వ్యవసాయ కార్మికుల సంఖ్య 1.2 కోట్లకు చేరుకోగా, పురుషుల సంఖ్య రెట్టింపుపై 2.5 కోట్లకు చేరుకుంది.

భిన్న ప్రాంతీయ చరిత్రలు, భౌగోళిక, సామాజిక, వైరుధ్యాలు, వేర్వేరు వ్యవసాయ విధానాలున్న మన భారతదేశంలో సాధార ణంగా, భిన్న ప్రతిపాదనలతో వ్యవసాయం చేయడం కష్టం. అంతేగాక చిన్న వ్యవసాయ దారులు, వ్యవసాయ కార్మికులుగా మారడం, భిన్న ఉపాధి మార్గాలూ ఎంచుకుంటూ వైదొల గడం (ప్రధానంగా అందరూ కట్టడాల కూలీలుగా మారడం) నిస్సందేహంగా వాస్తవం. ఈ నేపథ్యంలో నయా ఉదారవాద విధానాలు రైతాంగాన్ని ఉపాధికి దూరం చేయడం, వలసలను ప్రోత్సహిస్తూ, జీవన ప్రమాణాలను దిగజార్చుతున్నాయి. ఈ విధానాలు వ్యవసా యదారుల మనుగడ సంక్షోభంలో పడటానికి కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో మారుతున్న సామాజిక, చారిత్రక పరిస్థితుల రీత్యా మహిళల ఉపాధికై పోరాటం చేయడం అనివార్యం.

**అనువాదం : డాక్టర్ శమంతకమణి**

# ఆర్థిక సంస్కరణలు భారతదేశంలో వ్యవసాయాభివృద్ధి

**శంతను డి. రాయ్**

ఆర్థిక సంస్కరణల ప్రారంభం, వ్యాపార సరళీకరణ, దానికి సంబంధించిన ధరల ప్రోత్సాహకాలు పెట్టుబడుల పెరుగు దలకు, వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు దారి తీస్తుందని భావించారు. అంతేకాకుండా వ్యవసాయానికి అనుకూలంగా ఉండే వ్యాపార నిబంధనలలో మార్పులు వచ్చి, అవి వ్యవ సాయ ఎగుమతులను మెరుగుపరచి, వ్యవసాయ వృద్ధి రేటును పెంచుతాయని అంచనా వేయబడింది. ఈ వ్యాపార అనుకూల నిబంధనలు వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల, భారతదేశంలో ప్రైవేట్ పెట్టు బడులపై ఒక సానుకూల ప్రభావం చూపుతా యని అంచనా వేశారు. ఈ విధమైన అంచ నాలు ఉన్నప్పటికీ, ఆర్థిక సంస్కరణల ప్రారంభం అనంతరం తీసుకోబడిన విధానపర మైన నిర్ణయాలు వ్యవసాయ వృద్ధి పెరుగుదలకు దోహదం చేయలేదు.

సాధారణంగా చిన్న ఉత్పత్తులు చేసే రంగాలకు, ముఖ్యంగా వ్యవసాయ రంగంపై ఆర్థిక సరళీకరణ ప్రతికూల ప్రభావాన్ని కలిగించింది. అంటే ఈ విధానాలు చిన్న ఉ త్పత్తి దారులకు, పేదవారికి వ్యతిరేకంగా ఒక భిన్నమైన వర్గ పక్షపాత ధోరణి కలిగి ఉన్నాయి. ఈ విధానాల ఫలితంగా గ్రామీణ మౌలిక సదుపాయ కల్పనలో, సాగునీటి కల్పన, వ్యవ సాయ పరిశోధనా రంగం, విస్తరణ సేవల కల్పనతో సహా ప్రభుత్వ పెట్టుబడులు తగ్గి పోయాయి. వ్యవసాయ వ్యాపార సరళీ కరణల తో గ్రామీణ పేద, చిన్న రైతులకు ఋణ సౌక ర్యాలు క్షీణించిపోయాయి. భారతదేశంలో వ్యవసాయ రంగంలో ఈ విధానాలలో ప్రతి ఒక్కటి ఏ విధమైన ప్రభావాన్ని చూపించిందో నేను విశ్లేషించడం జరిగింది.

**వ్యవసాయ వృద్ధి రేటు:** అన్ని విధాల ఆర్థిక అభివృద్ధి జరగాలంటే వ్యవసాయ రంగం యొక్క వృద్ధి పెరగడం చాలా ముఖ్యం. భారతదేశంలో జనాభాలో ఎక్కువ భాగం ప్రజలు పనికోసం వ్యవసాయంపైనే ఆధారపడడంతో దీని ప్రాముఖ్యత పెరిగింది. యన్‌యస్‌యస్ఒ లెక్కల ప్రకారం 2011-12 సం.లో 59 శాతం పురుషులు, 75 శాతం మహిళలు వ్యవసాయం పైనే ఆధారపడినారు. గ్రామీణ పేదరికం తగ్గాలంటే వ్యవసాయ వృద్ధిరేటు పెరగడం చాలా ముఖ్యం. 2 నుండి 4 శాతానికి పెరిగిన వ్యవసాయ వృద్ధిరేటుతోపాటు 8 శాతం ఆర్థిక వృద్ధిరేటు వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల మధ్య ఉన్న ఆదాయ అసమానతలను తగ్గిస్తాయి. కాబట్టి ఈ సందర్భంగా 1991-92లో సంస్కర ణలు ప్రవేశపెట్టబడిన అనంతరం వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు పెరుగుదలను పరిశీలిం చడం, మొత్తంగా ఆర్థిక వ్యవస్థపై దానియొక్క ప్రభావాన్ని విశ్లేషించడం అవసరం.

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టబడిన అనంతరం వ్యవసాయ రంగంలో జిడిపి వృద్ధిరేటు క్షీణించినట్లు స్పష్టమౌతున్నది. కానీ ఈ కాలంలో (2010-11 నుండి 2013-14 రెండు సం.ల కాలంలో తప్ప) జి.డి. పి. పెరుగుతూ వచ్చింది. వ్యవసాయం లోని, ఆర్థిక వ్యవస్థలోని జి.డి.పి.లోని వృద్ధి రేటులో 1990-91, 2009-10 సం.లలో భిన్నత్వం కారణంగా భారతదేశం యొక్క వృద్ధిలో వ్యవ సాయం యొక్క ప్రాధాన్యత క్షీణిస్తున్నట్లుగా సూచించబడింది.

1980లతో పోల్చినపుడు ఆర్థిక సంస్కరణ లు ప్రవేశపెట్టిన అనంతరం, ప్రధాన పంటలలో ఉత్పత్తి, దిగుబడి వృద్ధిరేట్లు క్షీణించాయి. ఈ పరిశీలన 2000-01 నుండి 2009-10 సం.లలో పప్పు ధాన్యాలు, పత్తి (ఉత్పత్తి, దిగుబడి పెరగడం వలన) పంటల విషయంలో మినహాయింపు ఉంటుంది. 1980లతో పోల్చినపుడు 1990-91 నుండి 1999-2000 సం.లో చెఱకు, గోధుమ ఉత్పత్తులు దిగుబడి కొంచెం పెరిగినాయి. 1981-82 , 2014-15 మధ్య కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల, దిగుబడి వృద్ధి రేటులో పెరుగుదల కారణంగానే జరిగింది. ఈ కాలంలో జరిపిన అధ్యయనం ప్రకారం, ఆహారధాన్యాల దిగుబడి వృద్ధిరేటు బాగా పెరిగింది 1980లలోనే, దానినే రెండవ దశ హరిత విప్లవం అంటాం. 1990ల నుండి ఆహారధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల వరి, గోధుమ వల్లనే జరిగింది. గోధుమ ఉత్పత్తిలో వృద్ధిరేటు పెరగడానికి గల కారణం 2000-01 నుండి సాగు చేయబడిన భూమి వైశాల్యం పెరగడమే. 1981-82, 2014 -15 మధ్య కాలంలో ముతక ధాన్యం పండించే భూమి వైశాల్యం తక్కువగా ఉండేది, ఆర్థిక సంస్కరణల అనంతరం సాగుచేసే భూమి వైశాల్యం మరింత తగ్గిపోయింది.

ఒక రకంగా ముతకధాన్యం పండించే భూమి వైశాల్యం ఎంత తగ్గిందో, అంత భూమి వరి, గోధుమ పండించే భూవైశాల్యానికి కలిసిందని చెప్పవచ్చు. ముతకధాన్యం పండించే భూమి వైశాల్యం తగ్గినంత మాత్రాన, దాని దిగుబడి రేటు తగ్గుతుందని అనుకోవాల్సిన పనిలేదు. దేవ్, పాండేల అధ్యయనం ప్రకారం, ముతక ధాన్యం దిగుబడి వృద్ధిరేటు పెరగడానికి ప్రధాన కారణం కొత్త విత్తన సాంకేతిక పరిజ్ఞానమే.

1980 దశాబ్దం చివర, 1990 ఆరంభ కాలంలో నూనె గింజల ఉత్పత్తిలో పెరుగుదల కు ప్రధాన కారణం దిగుమతులపై పరిమా ణాత్మక నిబంధనలు విధించడం. వ్యాపార సరళీకరణ విధానాలలో భాగంగా ఆ తర్వాత కాలంలో దిగుమతులు పెరగడంతో నూనె గింజలు పండించే భూవైశాల్యం, ఉత్పత్తులు తగ్గి పోయాయి. గడచిన దశాబ్దంతో పోలిస్తే 1990లలో నూనె గింజలు సాగుచేసే భూవైశాల్యం పెరిగినప్పటికీ, వాటి ఉత్పత్తి యొక్క

**"వ్యవసాయంపై పెట్టుబడి సగటు పెరుగుదల 1980లలో నిలిచిపోయింది. ప్రైవేటు, ప్రభుత్వ పెట్టుబడులు భిన్నమార్గాలలో వెళ్ళిపోయాయి. 1990ల వరకు ప్రభుత్వ పెట్టు బడులలో క్షీణత కొనసాగుతూనే ఉంది. 1981-82 సం.లలో సగటు స్థాయిని మించి 2004-05 స.లలో మాత్రమే ప్రభుత్వ పెట్టుబడులు పెట్టడం జరిగింది."**

వృద్ధిరేటు గణనీయంగా క్షీణించిపోయింది. 2001లో నూనె గింజల దిగుమతిపై సుంకం తిరిగి ప్రవేశపెట్టడంతో, మార్కెట్లో వాటి ధరలు పెరిగి, వాటిని ఉత్పత్తి చేయడానికి సాగుచేసే భూమి వైశాల్యం పెరిగింది. 2004లో ముడి చమురుపై 75 శాతం దిగుమతి సుంకంవిధిస్తే, 2010-11 సం.లో ఆ సుంకం తొలగిం చబడింది. ఇది నూనె గింజల ఉత్పత్తిదారులపై ప్రతికూల ప్రభావం చూపించింది. 2010-11, 2014-15 మధ్య కాలంలో వివిధ రకాల నూనె గింజలు పండించే భూవైశ్యాలం, ఉత్పత్తి, దిగుబడి క్షీణించింది.

ఆర్థిక సంస్కరణల అనంతరం ముఖ్యంగా 2000-01, 2009-10 మధ్య కాలంలో అన్ని పంటల కన్నా పత్తి ఎక్కువ వృద్ధిరేటును సాధించింది. పత్తి ఉత్పత్తిలో సంభవించే మార్పుల ఫలితంగానే 1980లలో, 2000ల లో ఉత్పత్తిలో పెరుగుదల ఉన్నదని సూచిస్తు న్నాయి. మిగతా కాలాలలో ప్రత్తి ఉత్పత్తిలో పెరుగుదలకు గల కారణం ఎక్కువ భూవైశాల్యం లో ఆ పంటను సాగుచేయడమే. 2000-01, 2009-10 మధ్య కాలంలో భారతదేశంలో ప్రత్తి సాగుచేసే ప్రాంతాలలో బిటి కాటన్ టెక్నాలజీని వినియోగించడంతో దిగుబడి వృద్ధిరేటు బాగా పెరిగింది. కానీ 2010-11, 2014-15 మధ్య కాలంలో పత్తి ఉత్పత్తి వృద్ధి రేటు బాగా తగ్గిపోయింది. బిటి కాటన్ టెక్నా లజీకి సంబంధించిన విత్తనాల వలన పెట్టు బడులు ఎక్కువ కావడం, వ్యవసాయం ప్రధాన మైన జీవనాధారంగా జీవిస్తున్న రైతులు ఎక్కువ దిగుబడిని పొందిన భూములలో ప్రత్తి పండించే ప్రయత్నం చేయడం వల్ల ప్రత్తిసాగు అననుకూల పంటగా తయారయ్యింది. బిటి కాటన్ విత్తనాలు ఉపయోగించడం పెరిగి నప్పటికీ పురుగు మందుల వాడకం బాగా పెరిగిపోయింది. దానితో పత్తిపంట దిగుబడి వృద్ధిరేటు క్షీణించింది.

**వ్యవసాయ వృద్ధిరేటుకు హానికల్గిస్తున్న ధరేతర అంశాలు:**

**వ్యవసాయంలో పెట్టుబడులు:** వ్యవ సాయంలో దీర్ఘకాలిక వృద్ధిరేటు పెరగ డానికి పెట్టుబడులు పెరగటం చాలా అవసరం. ఆర్థిక వ్యవస్థలో 1960 మధ్య సం.లో స్థూల పెట్టుబడి ఏర్పాటులో వ్యవసాయం, ఇతర కార్యకలాపాల వాటా పెరుగుతూ వచ్చింది, అదే విధానం 1970ల చివరి వరకూ కొనసాగింది. 1960, 70 దశకాలలో స్థూల పెట్టుబడి ఏర్పాటులో వ్యవసాయం, ఇతర కార్యకలాపాల వాటా పెరు గుదల ప్రభావం చూపించడంలో వెనుకబడడం వలన 1980లలో వ్యవసాయ వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నట్లు గమనించబడింది. కానీ, 1980ల నుండి ఈ వాటా క్షీణిస్తున్నట్లు కనపడు తుంది. 1990ల చివరి నుండి 2001-02 వరకు కొంత పెరుగుదల కనపడి మళ్ళీ క్షీణత ఏర్పడింది. 1990ల నుండి ఉన్న క్షీణతకు అర్థం ఏమంటే వ్యవసాయేతర రంగంతో పోలిస్తే వ్యవసాయ రంగంలో తక్కువ పెట్టు బడులు ఉంటున్నాయి.

వ్యవసాయంపై పెట్టుబడి సగటు పెరుగు దల 1980లలో నిలిచిపోయింది. ప్రైవేటు, ప్రభుత్వ పెట్టుబడులు భిన్నమార్గాలలో వెళ్ళిపోయాయి. 1990ల వరకు ప్రభుత్వ పెట్టు బడులలో క్షీణత కొనసాగుతూనే ఉంది. 1981-82 సం.లలో సగటు స్థాయిని మించి 2004-05 స.లలో మాత్రమే ప్రభుత్వ పెట్టుబడులు పెట్టడం జరిగింది. 1990లలో ప్రభుత్వ పెట్టుబడుల కన్నా ప్రైవేటు పెట్టుబడులు వేగంగా పెరిగాయి. ఈ దశాబ్దంలో పెరిగిన మొత్తం పెట్టుబడికి ఈ వేగం సహాయకారిగా ఉంటుంది. 2004-05 నుండి 2012-13 వరకు ప్రైవేట్, ప్రభుత్వ పెట్టుబడుల పెరుగుదల (మొదటిది రెండవదానికన్నా వేగంగా పెరిగి నప్పటికీ) నమోదైంది. 1981-82, 2012-13ల మూడు దశాబ్దాల మధ్య కాలంలో ప్రభుత్వ పెట్టుబడులు రెట్టింపు అయితే ప్రైవేటు పెట్టుబడులు ఎనిమిదింతలయాయి. 1981-82లో వ్యవసాయ రంగంలో మొత్తం పెట్టు బడిలో ప్రభుత్వ పెట్టుబడి వాటా 52 శాతంగా ఉంటే 2012-13 నాటికి అది 2 శాతానికి పడిపోయింది.

ప్రభుత్వ పెట్టుబడిలో క్షీణత వలన వ్యవసాయ రంగంలో వృద్ధిరేటుపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం పడుతుంది. ఉత్పత్తి విధానంలో సహాయపడే ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులలో తేడా ఉన్నది. దీనిలో ప్రభుత్వ పెట్టుబడి ప్రభుత్వ ఆస్తులైన సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలలాంటి వాటికి ఖర్చు పెడుతుంది. ప్రైవేట్ పెట్టుబడులు వీటి కోసం సమకూర్చబడవు. కాబట్టి ఉత్పత్తి విధానానికి సహాయం విషయంలో 2004-05 సం. వరకు ప్రభుత్వ పెట్టుబడుల ఏర్పాటులో ఉన్న క్షీణతను ప్రైవేట్ పెట్టుబడి సరిచేయలేకపోయింది.

భారతదేశంలో వ్యవసాయ స్థూల పెట్టు బడిలో 90 శాతం సాగునీటి సౌకర్యానిదే అవుతుంది. ఆహారధాన్యాల కొరకు నీటితో సాగుచేసే భూమి వైశాల్యం పెరుగుదల ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదలకు దారి తీసింది. కాబట్టి నీటిసాగు పెరుగుదల ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదలకు దోహదం చేస్తుంది.

సాగునీటి ఉత్పాదకత 1980లలో చాలా ఎక్కువగా ఉన్నది. తూర్పు భారతదేశంలో వరి పండించే ప్రాంతాలను కలుపుకొని విశాల దృక్పథంతో హరిత విప్లవానికి నాంది పలికిన కాలమది. 1980లతో పోలిస్తే 1990లలో సాగుచేయబడిన భూవైశాల్యం వృద్ధిరేటు కొంచెం పెరిగింది. ఈ కాలంలో ఆహార ధాన్యా ల ఉత్పత్తి వృద్ధిరేటు క్షీణించింది. కరు వును తట్టుకునే వ్యవసాయానికి ఉపకరించే దిగుబడి పెరిగే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయ డంలో ఉన్న లోపం కారణంగా 1990లలో సాగునీటి ఉత్పాదకతలో క్షీణత ఏర్పడింది. ఈ ప్రోత్సాహం లేకపోవడం అనేది ప్రత్యక్షంగా, పరిశోధన కొరకు పెట్టే ప్రభుత్వ ఖర్చులో క్షీణతకు దారితీసింది. రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో భూగర్భ జల వనరులతో చేసే సాగు కు 1990లలో ఉత్పాదకత తగ్గించడంలో ఒక చెప్పుకోదగిన పాత్ర ఉన్నది. రావు చెప్పి నట్లుగా "నీటిని సాధించడానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో విపరీతమైన కోతల కారణంగా

తూర్పు ఉత్తరప్రదేశ్‌లో వ్యవసాయ వృద్ధిరేటు గణనీయంగా తగ్గింది. ఈ ప్రాంతానికి తగ్గించిన విద్యుత్‌ను అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఉన్న కొంతమంది రైతులకు మళ్ళించడం జరిగింది. అంతకు ముందు దశాబ్దాల కాలంతో పోలిస్తే 2000-01 నుండి సాగుచేయబడిన భూవై శాల్యం వృద్ధిరేటు, ఉత్పత్తి వృద్ధిరేటు గణనీయంగా తగ్గింది.

వ్యవసాయ వృద్ధి పెరుగుదలకు నీటి సరఫరా హామీ ముఖ్యమైనదన్న విషయం వాస్తవమైనదని విధానపరమైన నియమ నిబంధనలలో ఉన్నప్పటికీ, భారతదేశంలో నీటిసాగును విస్తరించడానికి అవసరమైన వనరులను ప్రభుత్వం అరకొరగానే సమకూరుస్తున్నది. 1980ల నుండి జి.డి.పి.లో నీటిసాగుపై చేసే వ్యయం తక్కువగా ఉంటున్నది. ఇప్పుడు ఆ వ్యయం ఇంకా క్షీణిస్తూన్నది. విధాన ప్రకటనలు ఆచరణలో అమలు జరపబడడం లేదని సాగునీటికి చేసే కేటాయింపుల క్షీణత ఋజువు చేస్తున్నది.

**ఋణాల పాత్ర:** 1960లలో వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణతో సామాజిక, బ్యాంకింగ్ అభివృద్ధి విధానాలు ఆర్థిక సరళీకరణ విధానాల వలన తిరిగి ప్రవేశపెట్టబడినాయి. ఆర్థిక సరళీకరణ పద్ధతిలో ప్రాముఖ్యత కలిగిన రంగానికి ఋణాలు ఇవ్వాలన్న పట్టింపులో సడలింపు చిన్న, అణగారిన రైతులకు ఋణాలు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయం ఖర్చుతో కూడుకున్నదిగా మారిపోయింది. పంట దిగుబడితో తమ ఆదాయాలు ముడిబడివున్న రైతులకు ప్రభుత్వరంగ ఋణాలు ఎంతో ఉపయోగకరం. వాటితో సంవత్సర కాలం అంతా తమ అవసరాలు సాఫీగా తీర్చు కుంటారు.

ఋణాలు, డిపాజిట్లు నిష్పత్తి పరిస్థితి, వాణిజ్య బ్యాంకులు ప్రాధాన్యతా రంగమైన వ్యవసాయానికి ఇచ్చిన ఋణాల వాటా 1980లతో పోలిస్తే 1990లలో క్షీణించింది. కానీ 2001 నుండి ఈ రెండింటి నిష్పత్తులలో వేగం పుంజుకున్నది. 2001 నుండి గ్రామీణ ఋణాలలో పెద్ద మొత్తంలో పెరుగుదలకు ప్రాధాన్యతా రంగం కింద ఎగుమతులు పెంచే ఉద్దేశ్యంతో జరిగిన మార్పులే ప్రధాన కారణం. 1980తో పోలిస్తే నూతన మిలీనియంలో గ్రామీణ రుణాలు వ్యవసాయ రంగం అభివృద్ధికి అంతగా దోహదం చేయలేదు. పెద్ద సంఖ్యలో ఉన్న చిన్న, అణగారిన రైతులకు కూడా అంతగా లాభం చేకూర్చలేదు.

**“ఋణాలు, డిపాజిట్లు నిష్పత్తి పరిస్థితి, వాణిజ్య బ్యాంకులు ప్రాధాన్యతా రంగమైన వ్యవసాయానికి ఇచ్చిన ఋణాల వాటా 1980లతో పోలిస్తే 1990లలో క్షీణించింది. కానీ 2001 నుండి ఈ రెండింటి నిష్పత్తులలో వేగం పుంజుకున్నది. 2001 నుండి గ్రామీణ ఋణాలలో పెద్ద మొత్తంలో పెరుగుదలకు ప్రాధాన్యతా రంగం కింద ఎగుమతులు పెంచే ఉద్దేశ్యంతో జరిగిన మార్పులే ప్రధాన కారణం.”**

**పరిశోధన, విస్తరణ సేవలు:** పరిశోధన, విస్తరణలు, మార్కెట్ వైఫల్యాలకు ప్రధాన కారణం ప్రభుత్వ విధానాలు. కాబట్టి ఈ రెండింటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన పెట్టుబడుల కొరకు ప్రభుత్వం ప్రధానమైన పాత్రను పోషించాలి. 1953-1971 మధ్య కాలంలో భారతదేశంలో 15 రాష్ట్రాలలో సాధించిన ఉత్పాదకతపై అధ్యయనం చేసిన మోహన్ (1974), ఈ కాలంలో అత్యంత ఎక్కువ ఉత్పాదకత సాధించిన రాష్ట్రాలలో (ఇతర రాష్ట్రాలతో పోల్చినపుడు) పరిశోధనలపై కేంద్రీకరణ ఎక్కువ జరిగినట్లు పేర్కొన్నాడు. భారతదేశంలో హరిత విప్లవం సఫలం కావడానికి వ్యవసాయ పరిశోధన ప్రాథమికంగా వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ సేవలపై ఖర్చు చేసిన ప్రభుత్వవాటా 1990లలో అభివృద్ధి చెందిన దేశాలలో వాటా (2 శాతం నుండి 4 శాతం) అభివృద్ధి చెందుతున్న దేశాలలో సగటు వాటా (0.75%) కన్నా తక్కువేనని ఇవెన్సన్ (1999) అభిప్రాయపడినాడు.

వ్యవసాయం, అనుబంధ రంగాలలో పరిశోధన, విస్తరణపై చేసిన ఖర్చు, జి.డి.పి.లో వాటా వివరాలను గమనించవచ్చు. 1960ల నుండి ఆ తరువాత దశాబ్దాలలో వ్యవసాయం, అనుబంధ రంగాలలో జి.డి.పి.లో పరిశోధన, విస్తరణపై చేసిన ఖర్చు వాటాను ఈ పట్టిక తెలియజేస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే ఆర్థిక సంస్కరణల అనంతరం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సేవలపై ప్రభుత్వ ఖర్చు పెరగలేదు.

**వ్యవసాయ వృద్ధికి హానిచేసే ధరల అంశాలు:** వ్యవసాయ వ్యాపార సరళీకరణతో, సంస్కరణల అనంతరం వ్యవసాయానికి వ్యతిరేకంగా వివక్ష ధోరణి వలన ఆర్థిక వ్యవస్థలో అరుదుగా ఉన్న విదేశీ మారకం బాగా రావడానికి దారితీసే వ్యవసాయ సరుకులను ఎగుమతి చేసే దేశంగా భారతదేశం తయారు అవుతుందని అంచనా వేయబడింది. ఈ అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకునే వ్యవసాయ వాణిజ్యంలో నియమ నిబంధనలను విశ్లేషించడం ఆసక్తికరంగా మారుతుంది.

1980లలో వ్యాపార నిబంధనలు వ్యవసాయానికి అనుకూలంగా ఉండడం ప్రారంభమై, అది 1994-95 వరకు కొనసాగింది. ఆ తర్వాత 1998-99 వరకు నిలిచిపోయింది. 2008-09 నాటికి ఇంకొంచెం దిగజారి, 2010-11 అనంతరం పూర్తిగా పతనమైంది. 2009-10, 2011-12 మధ్య కాలంలో వ్యాపార నిబంధనలలో కొంత అభివృద్ధి ఉండి, మరల 2013-14 వరకు కొంత క్షీణత కనిపించింది. సంస్కరణల వలన ఊహించినంత అభివృద్ధి వ్యవసాయ వాణిజ్యంలో కనిపించలేదు. వాస్తవానికి సంస్కరణానంతర కాలంలో కొన్ని దశలలో, వ్యవసాయ ఉత్పత్తిదారులకు ప్రతికూలంగా వ్యాపార నిబంధనలు మరింత దిగజారినాయి.

ఇంతే కాకుండా వ్యవసాయ సరుకుల అంతర్జాతీయ ధరలు అస్థిరంగా ఉండేవి. పత్తి, పంచదార మినహాయిస్తే 1980లలోచాలా సరుకుల అంతర్జాతీయ ధరలు బాగా క్షీణించినట్లు స్పష్టమౌతున్నది. చాలా వ్యవసాయ సరుకుల అంతర్జాతీయ ధరలు 1981లో అంతర్జాతీయ ధరలతో పోలిస్తే 1995లో తక్కువగా ఉన్నప్పటికీ, 1990వ దశాబ్దం మధ్యలో కొంత పుంజుకున్నాయి. 1990వ దశాబ్ది చివరిలో ఈ ధరలు బాగా తగ్గి, ఆ స్థితి 2005 వరకు కొనసాగింది. మరల 2005, 2010 మధ్య కాలంలో కొంత పుంజుకొని తదనంతర కాలంలో ధరలు బాగా క్షీణించాయి. 2010తో పోలిస్తే అన్ని వ్యవసాయ సరుకుల ధరలు 2015 నాటికి

(మిగతా 35వ పేజీలో)

# మతతత్వాన్ని ఎదుర్కోడానికి ఎన్నికల ఎత్తుగడలే సరిపోవు

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో, ముఖ్యంగా యుపిలో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా మనం నిర్వహించిన పాత్ర ఏమిటి? ప్రస్తుతం మనం అనుసరిస్తున్న ఎన్నికల ఎత్తుగడలు మతోన్మాదశక్తులను ఎదుర్కొనే నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించబడ్డాయా?**

2017 ఫిబ్రవరి, మార్చి మాసాలలో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్‌లో భారతీయ జనతాపార్టీ 325 స్థానాల్లో గెల్చి అఖండ విజయాన్ని సాధించింది. మిగిలిన రాష్ట్రాల్లో పరిమిత ఫలితాలనే దక్కించుకోగల్గింది. ఉత్తరాఖండ్‌లో పూర్తి మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పంజాబ్‌లో బిజెపి అకాలీదళ్ అధికార కూటమి కాంగ్రెస్, చేతుల్లో ఘోర పరాజయం పొందింది. గోవాలో ద్వితీయ స్థానంలోకి నెట్టబడింది. దొడ్డి త్రోవన ప్రభుత్వాన్ని చేజిక్కించుకున్నది. మణిపూర్‌లో కాంగ్రెస్ ఏకైక పెద్ద పార్టీగా ఎన్నికైనప్పటికీ, బిజెపి ఫిరాయింపులను ప్రోత్సహించి అప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని కైవశం చేసుకున్నది.

ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే అధికారంలో ఉన్న పార్టీలు ప్రజా వ్యతిరేకతను రుచి చూశాయన్న విషయం స్పష్టం అవుతున్నది. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్, పంజాబ్‌లో బిజెపి – అకాలీదళ్, గోవాలో బిజెపి ఎంపీలు ఓట్లను సీట్లను కోల్పోయాయి. అయితే కీలకమైన యు.పి.లో బిజెపి సంఘ్‌పరివార్ శక్తులు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి విద్వేష రాజకీయాల ద్వారా ప్రజలను చీల్చి ఎన్నికల్లో లబ్ది పొందగలిగాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఇది ఒక ప్రమాదకర పరిణామం. బిజెపి మతోన్మాద ప్రచారంతో పాటు ప్రధాన లౌకిక ప్రతిపక్ష పార్టీల వైఫల్యాలు కూడా ఎన్నికలలో బిజెపికి తోడ్పడ్డాయి. సమాజ్‌వాది పార్టీలో అంత:కలహాలు, ఆ పార్టీ ప్రభుత్వ పాలనా వైఫల్యాలు బిజెపి ప్రచారానికి బలం చేకూర్చాయి. అన్నింటికన్నా ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అసమర్థ వ్యవహార సరళి ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని కల్గించలేకపోయింది. ఈ రాష్ట్రాలన్నింటిలో వామపక్షాల బలం చాలా పరిమితం కావడం కూడా లౌకిక శక్తులను మోహరించడానికి అవసరమైన స్ఫూర్తిని లేకుండా చేసింది. అయినా ఉన్నంతలో వామపక్షాలు తమ పాత్రను నిర్వహించే ప్రయత్నం చేశాయి. తమ ఉద్యమానికి కొంత ప్రజాబలం ఉన్న చోట పరిమితంగా పోటీ చేసి, బిజెపి కూటమిని ఓడించే రాజకీయ ప్రచారంపై ప్రధానంగా కేంద్రీకరించాయి. తాము పోటీజేయని చోట బిజెపిని ఓడించగల లౌకికశక్తులకు మద్దతునిచ్చి శాయాశక్తులా కృషిజేశాయి.

ఇప్పుడు యుపిలో బిజెపి పచ్చి మతోన్మాదిగా ముద్రపడ్డ యోగి ఆదిత్యనాద్‌ను ముఖ్యమంత్రిగా చెయ్యడం ద్వారా తన మతోన్మాద ఎజెండాను ముందుకు తీసుకుపోదల్చినట్లు స్పష్టం చేసింది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడం దేశ లౌకిక శక్తులముందున్న నేటి ప్రధాన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ఎన్నికల ఎత్తుగడలే సరిపోవు. ప్రజా ఉద్యమాలు, లౌకిక శక్తుల నిరంతర ప్రచార ఆందోళన అవసరం. ఈ కృషిని ముందుకు తీసుకెళ్ళేందుకు పార్టీ ప్రయత్నిస్తున్నది.

**2015లో కలకత్తాలో జరిగిన ప్లీనంలో పార్టీ నిర్మాణంలోని లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకోవాలని నిర్ణయించాం. ఆ నిర్ణయాల అమలుకు జరిగిన కృషి, సాధించిన ఫలితాలు ఏమిటి?**

కలకత్తా నిర్మాణ ప్లీనం నిర్ణయాలను అమలుజేయడానికి అఖిలభారత పార్టీ కేంద్రం కృషి ప్రారంభించింది. ప్లీనం ఆదేశాలను అఖిలభారత కేంద్రానికి అన్వయించుకుని కొన్ని నిర్దిష్ట చర్యలను తీసుకున్నది. కేంద్రంలోని పోలిట్‌బ్యూరో సభ్యుల మధ్య సమన్వయం పెంచేందుకు ఎప్పటికప్పుడు ఉద్యమ నిర్మాణ అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుల పూర్తిరోజు సమావేశాల సంఖ్యను పెంచింది. అవసరమైన అదనపు కార్యకర్తలను సమకూర్చుకుంటున్నది. వివిధ ప్రజా రంగాలను క్రమం తప్పకుండా సమీక్షించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటికే కిసాన్ సభ కృషికి దిశానిర్దేశాన్ని రూపొందించింది. సామాజిక సమస్యలపై, మతోన్మాద ప్రమాదంపై, స్థానిక సమస్యలపై దేశ వ్యాపితంగా పార్టీ ప్రజారంగాల కృషి పెరిగేట్లుగా ప్రయత్నం చేస్తున్నది.

ఈ కాలంలో పశ్చిమబెంగాల్, కేరళ ఎన్నికలు రావడం, మరికొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగడం, ఇంకొన్ని ఇతర ముఖ్య అంశాలు పార్టీ సమయానికి, కేంద్రీకరణకు కొన్ని పరిమితులు విధించినప్పటికీ పార్టీ నిర్మాణ కృషిని పెంచే ప్రయత్నం చేసింది. ❀

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# ఉద్యమ 'సూర్యుడు' సజ్జా సూర్య బాలానందం

(2వ పేజీ తరువాయి)

సూర్య బాలానందం మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. "నిర్బంధం తీవ్రంగా వుంది. ప్రజల సహకారం తక్కువగా వుంది. మనం లొంగి పోవాలి" అని రంగయ్య వాదించాడు. అందుకు బాలానందం "నీ అభిప్రాయం పార్టీకి చెప్పు. అప్పటి వరకు పార్టీ చెప్పింది చేయాలి. పార్టీ అనుమతి లేనిదే లొంగిపోవడం తప్పు" అని వాదించాడు. ఈ చర్చ తరువాత నాగవరపమ్మ గుడి వద్ద నుండి ఇద్దరూ విడిపోయారు. మే ఒకటో తేదీ రాత్రికి బాలానందం పందిళ్ళపల్లి పడమర ప్రాంతంలో షెల్టర్ తీసుకుంటున్న కుటుంబరావు దళంతో కలిశారు.

మరుసటి రోజు ఉదయం జాండ్రపేటకు వెళ్ళి అన్నం తెస్తానని వారి కొరియర్ బండారు సుబ్బారావు పోలీసులకు లొంగిపోయాడు. చివరకు కుటుంబరావు, బాలానందం మాత్రమే దళంలో మిగిలారు. జాండ్రపేట ఊరి చివరనున్న సూర్యబాలానందం అత్తగారింటికి వెళ్ళి అక్కడ భోజనం చేయవచ్చున్న ఆలోచనతో ఇద్దరూ జాండ్రపేట బయలుదేరారు. తప్పని పరిస్థితుల్లో కుందేరుకు తూర్పునున్న జాండ్రపేట దగ్గరి తోటల్లోకి చేరారు. తమ వారికి సమాచారం అందించేందుకు వారు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఆకలి దప్పులతో కళ్లు తిరిగి పడిపోయారు. ఆ ప్రాంతానికి పిట్టల వేట కోసం వచ్చిన జాండ్రపేట వాసి బీరక మల్లయ్య బాలానందాన్ని గుర్తుపట్టాడు. నందిగాడు (సూర్య బాలానందం) ఇక్కడున్నాడేమిటీ అని పెద్దగా అరిచాడు. సమీపంలోని జనం ఆ మాటలు విన్నారు. వెంటనే గ్రామంలోకి కబురు వెళ్లింది. మునసబు సైన్యం క్షణాల్లో వచ్చి స్పృహలో లేని వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. సూర్య బాలానందం దృఢకాయుడు. అయినా ఆరోజు ప్రతిఘటించే శక్తి లేదు. వారిద్దరినీ హస్తినా పురం తీసుకువచ్చారు. మునసబుకు అప్పగిం చారు. ఆ గ్రామంలోని బాలానందం మామకు విషయం తెలిసింది. వెంటనే మునసబును కలి శాడు. వారిని వదిలి పెట్టమని ప్రాథేయపడ్డాడు. మునసబులో కనికరం ఛాయలే కనిపించలేదు. చివరకు "చివరకు మన కులస్తుడు కాబట్టి బాలా నందాన్ని వదిలిపెడతామని, కుటుంబరావును వదిలే సమస్య లేదు" అని బేరం పెట్టాడు. తమను, భార్యా బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని లొంగిపొమ్మని బాలా నందాన్ని ఆయన మామ ఒత్తిడి చేశారు. అప్పుడు బాలా నందం ఇచ్చిన సమాధానం విన్నవారంతా ఆశ్చర్యపడ్డారు.

"ప్రజల క్షేమం కోసం ప్రాణా లివ్వడానికి సిద్ధపడిన వాడే నిజమైన వుద్యమకారుడు. ఎక్కడో పుట్టి, ఇక్కడకు వచ్చి పేద ప్రజలను, చేనేత జనాన్ని చైతన్య పరుస్తూ సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్న నాయకుడు కామ్రేడ్ కస్తూరి! ఆయన్ని విడిచి నేను రావడమా? ఆయన ప్రాణాలు బలిపెట్టి మా ప్రాణాలు కాపాడుకోవడమా? భార్యాబిడ్డలు నాకే కాదు, కస్తూరికీ వున్నారు. కుటుంబం కోసం లొంగిపోయి ఉద్యమానికి ద్రోహం చేయలేను. మా నాయకుణ్ణి బలి చేయలేను. ఈ సమరంలో చచ్చినా బతికినా కస్తూరితోనే! కస్తూరి బాటే నా బాట! కస్తూరి అడుగులో అడుగు వేయడం తప్ప వెనుకడుగు వేసిది లేదు". అంటూ బాలానందం తేల్చి చెప్పా రు. ఆ తర్వాత పోలీసులు వారిద్దరినీ చీరాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పందిళ్ళపల్లిలో బండారు వెంకటేశ్వర్లును కూడా చీరాల పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. తర్వాత అందరినీ పాలపర్తి పోలీసు క్యాంప్‌కు తరలించారు. అక్కడ వారిని చిత్రహింసలు పెట్టారు. పార్టీ రహస్య సమాచారం చెప్పాలని వేధించారు. కొట్టారు. సూదులతో గుచ్చారు. రక్తం మోడుతున్న శరీరాలపై కారం రాశారు. ఎంతగా చిత్రహింసలు పెట్టినా ఒక్క విషయ మైనా వారి నుంచి రాబట్టలేకపోయారు. ఆ వీరుల వుద్యమశక్తి ముందు ఓడిన పోలీసులు 1950 మే 12వ తేదీన పాలపర్తిలో మూకుమ్మ డిగా వారందరినీ దుర్మార్గంగా కాల్చి చంపారు. ప్రస్తుతం బాలానందం అక్కకుమార్తె సుబ్బ నాగమ్మ జాండ్రపేటలో వున్నారు. ఆమె తల్లి దండ్రులు మరణించడంతో మేనమామ బాలా నందం వద్దే పెరిగారు.

**ఎర్రజండా లెగురుతున్నాయ్**
**కూలిగుండెలు మండుతున్నాయ్**
**దోపిడీ, స్వార్థాలమూలం**
**రూపుమాపగ పోరుతున్నాయ్!**
**భూమికోసం, భుక్తికోసం**
**నీడకోసం సాగుతున్నాయ్**
**గుండెనెత్తురు ధారపోస్తూ**
**విప్లవ ధృవతార చూస్తూ!**

❋

---

# భారతదేశంలో వ్యవసాయాభివృద్ధి

(33వ పేజీ తరువాయి)

బాగా తగ్గినట్లు మనకు అర్థం అవుతుంది.

తక్షణ, భవిష్యత్ సరుకు వర్తకానికి సంబం ధించిన నిబంధనలలో మార్పులు, సరుకుల మార్కెట్‌లో ఊహాజనిత కార్యకలాపాలకు పెద్ద ఎత్తున బలం చేకూర్చింది. ఊహలతో వ్యవహ రించేవారు, ఫైనాన్స్ సంస్థలు - బ్యాంకులు, పెన్షన్ నిధులు, ధరలలో సంభవించిన స్వల్పకాలిక మార్పుల కారణంగా పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి ప్రవేశించారు. అంటే దీనర్థం, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన భారతదేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న వ్యవసాయ దారులు నష్టపోయే విధంగా ప్రాథమిక సరుకుల అంతర్జాతీయ ధరలు అస్థిరంగా ఉంటాయి. .

భారతదేశంలో 91 శాతం కుటుంబాలు మధ్య తరగతి, చిన్న, అంచున ఉన్న రైతాంగ ప్రజలు 5 ఎకరాలలోపు వ్యవసాయం చేసేవారున్నారు. వ్యవసాయ సరుకుల అంతర్జాతీయ ధరలలో అస్థిరత్వం వలన గ్రామీణ ప్రాంతాలలోని అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలకు ప్రమాదం సంభవిస్తుంది. 2005, 2007 మధ్య కాలంలో భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలోని 8 గ్రామాలలో జరిపిన సర్వేలో, చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్న కుటుంబాలు వివిధ వ్యవసాయ పర్యావరణ పరిస్థితులలో, భిన్నమైన సాగు పద్ధతులున్న ప్రాంతాలలో ఉన్నవారికి వ్యవసాయ పంటలలో ప్రతికూల ఆదాయాలు వస్తున్నాయని తేలింది. ఆదాయాన్ని సృష్టించే సామర్థ్యం కలిగి ఉన్న వ్యవసాయ రంగం భయానకమైన పరిస్థితులలో వున్నదని అర్థం చేసుకోవచ్చు.

సంస్కరణల అనంతరం వ్యవసాయ వర్తకం అభివృద్ధి అవుతుందన్న అంచనాలు అమలు జరగలేదు. దానితోపాటు వ్యవసాయ వర్తక సరళీకరణ, వ్యవసాయ సరుకుల అంతర్జాతీయ ధరల అస్థిరత వ్యవసాయాన్ని లాభసాటి కాని వృత్తిగా మార్చివేశాయి. చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్న కుటుంబాలు పంటల ఉత్పత్తి ద్వారా ప్రతికూల ఆదాయాలు గడిస్తున్నాయని దేశంలో విభిన్న ప్రాంతాలలో జరిగిన అధ్యయనాలు ఋజువు చేశాయి. సంస్కరణల అనంతరం వ్యవసాయ వర్తకానికి అనుకూలంగా చెప్పుకోదగిన చర్యలు లేవు. అంతర్జాతీయ మార్కెట్, ధరల ద్వారా రైతులు గడించిన లాభాలూ లేవు.

**అనువాదం :బోడపట్ల రవీందర్**

# దళితుల హక్కులను నిరాకరించిన వారికి తమ హక్కులు అడిగే హక్కుండదు

**– డా॥ బి.ఆర్. అంబేద్కర్**



**హిం**దువులు పెడుతున్న ఈ హింసలనుంచి, ఉపద్రవాల నుంచి తమను కాపాడవలసిందిగా దర్బారుకు బాలాయీలు అర్జీలు పెట్టుకొన్నారు. అయితే – సకాలంలో వారికి ఎట్టి సహాయమూ లభించనందువల్ల, హిందువుల హింసాకాండ రోజు రోజుకూ పెచ్చరిల్లడం వల్ల, వందలకొలది బాలాయీలు భార్యా బిడ్డలను తీసుకొని, తరతరాలుగా తమ పూర్వీకులు నివసించిన తమ మాతృస్థలాన్ని విడిచి పెట్టుకొని – ధార్, దేవాస్, బగ్లీ భోపాల్, గ్వాలియర్ మొదలయిన పొరుగు సంస్థానాలలోని గ్రామాలకు వలసపోక తప్పలేదు. అక్కడ వాళ్ళ బ్రతుకులు ఎలా తెల్లవారాయి అనేది ప్రస్తుతానికి వదిలేద్దాం. బలాయి కులం అస్పృశ్యులు అక్కడి హిందువుల చేతుల్లో పొందిన హింసాకాండ గురించే నేను చెప్పేది.

గుజరాత్ లోని కవితా గ్రామానికి చెందిన సంఘటన గత సంవత్సరం జరిగినదే! గ్రామంలోని గవర్నమెంటు స్కూళ్ళలోకి తమ పిల్లల్ని చేర్చుకోవలసిందిగా పట్టుపట్టవద్దని అక్కడి అస్పృశ్యులకు హిందువులు ఒక శ్రీ ముఖం జారీచేశారు. అక్కడి అస్పృశ్యులు హిందువుల అభీష్టాలకు వ్యతిరేకంగా తమ పౌరహక్కులు రక్షించుకోవడానికి సాహసించి ఎన్ని బాధలుపడ్డారో ఇక్కడ నేను వివరించనక్కరలేదు. అదంతా మీకు బాగా తెలుసు. గుజరాత్‌లోనే అహ్మదాబాద్ జిల్లాలోని 'జాను' గ్రామంలో జరిగిన సంఘటన కూడ మీరందరూ ఎరిగిందే. 1935 నవంబరులో కొంచెం కలిగిన కుటుంబాలకు చెందిన అస్పృశ్య స్త్రీలు నీళ్ళు పట్టుకోవడానికి కుండలకు బదులు బిందెలను వాడడం మొదలుపెట్టారు. ఈ మార్పు తమ హోదాకు భంగకరమని భావించిన హిందువులు ఆ స్త్రీలపై దౌర్జన్యం జరిపారు. ఇలాంటి సంఘటనే ఒకటి ఈ మధ్య జయపూర్ సంస్థానంలోని చక్వారా గ్రామంలోనూ జరిగినట్టు పత్రికా వార్తలవల్ల తెలుస్తున్నది.

అదే గ్రామానికి చెందిన ఒక అస్పృశ్యుడు యాత్ర చేసుకొని తిరిగి వచ్చి, ఆ గ్రామంలోని తన తోడి అస్పృశ్యులకు మత విషయమైన ఒక విందు ఏర్పాటుచేశాడు. విందు కొంచెం బాగా చేద్దాం అనుకొన్నాడు. విందులో వడ్డించిన వివిధ పదార్థాలలో నేయి ఒకటి. భోజనం వడ్డించారు. అతిథులందరూ తినడం ప్రారంభించారు. అంతలోనే ఆ గ్రామానికి చెందిన హిందువులు వందలమంది హఠాత్తుగా ఆ విందు పార్టీని ముట్టడించి విందు గడుస్తున్న అస్పృశ్యులపైబడి అందినంతమందిని చావమోది, ఆహార పదార్థాలను చిందరవందర చేసి, నానా భీబత్సం చేశారు. అమాయకంగా అన్నాలు తింటున్న అసహాయులైన అస్పృశ్యులమీదకు ఇంతటి దౌర్జన్యంగా దండెత్తడం ఎందుకు జరిగినట్లు? అందుకు హిందువులు చెప్పిన కారణం ఒకే ఒకటి. ఆ విందులో నేయి ఉపయోగించడం!

అస్పృశ్యుడైన వ్యక్తి విందులో నేయి వడ్డించడం! అస్పృశ్యులు దానిని తినడం! అస్పృశ్యులు నేతిని వాడడం గర్వపోతుతనాన్ని ప్రదర్శించడమట! అది హిందువుల దర్జా, హోదాలకు భంగకరమట. అదే హిందువులు జరిపిన అంతటి అఘాయిత్యానికి కారణం. నేయి కలిగినవాడు తినే భోగభోజ్యం కావచ్చు. కానీ అది ఉన్నతస్థాయికి సూచకం అని ఎవరంటారు? అంటే, అస్పృశ్యుడు తాను కొనుక్కోగల శక్తి ఉన్నా సరే, నేతిని ఉపయోగించడం అహంకార సూచనన్నమాట. నేతిని వాడుకొనే ప్రత్యేక హక్కుగల హిందువుడి ఔన్నత్యాన్ని అహంకారంతో భంగపరచడం అన్నమాట! అస్పృశ్యుడు నేతిని ఉపయోగించడం హిందువు పట్ల ఘోరమైన అపరాధం చెయ్యడం అన్నమాట. ఈ సంఘటన 1936 ఏప్రియల్ 1వ తేదీ ప్రాంతంలో జరిగింది.

ఈ సంఘటనలన్నిటినీ పేర్కొన్న తరువాత ఇప్పుడు సాంఘిక సంస్కరణకు ఎందుకు ప్రాధాన్యతం ఇవ్వాలో మనవి చేస్తాను. ఈ విషయంలో శ్రీ బెనర్జీ ప్రతిపాదించిన పాత పద్ధతినే నేను చాలావరకు అనుసరిస్తాను. అదే ధోరణిలో రాజకీయ మనస్కులైన హిందువులను నేను ప్రశ్నలు అడుగుతున్నాను. అస్పృశ్యుల వంటి అత్యధిక సంఖ్యాకులైన మీ సొంత దేశీయుల్ని ప్రభుత్వ పాఠశాలలోకి మీరు రానివ్వడం లేదు కదా! అయినప్పటికి కూడా, మీరు రాజకీయ అధికారాన్ని పొందటానికి అర్హులేనా? ప్రభుత్వ బావుల నుంచి అస్పృశ్యులు నీళ్ళు తోడుకోవడానికి మీరు అనుమతించడం లేదు కదా! అయినప్పటికి కూడా, మీరు రాజకీయ అధికారాలకు అర్హులేనా? పబ్లిక్ విధులలో అస్పృశ్యులు నడవడానికి మీరు ఇష్టపడడం లేదు. అయినప్పటికి కూడా మీరు రాజకీయాధికారాలకు అర్హులేనా? అస్పృశ్యులు తమ ఇష్టం వచ్చిన దుస్తులను, నగలను ధరించడానికి మీరు ఒప్పుకోవడం లేదు కదా! అయినప్పటికీ, మీరు రాజకీయ అధికారానికి అర్హులేనా? అస్పృశ్యులు తమకు నచ్చిన తిండి తాము తినడాన్ని కూడా మీరు ఓర్చుకోవడం లేదు కదా! అయినప్పటికీ, మీరు రాజకీయాధికారానికి అర్హులేనా?

ఈ విధమైన ప్రశ్నలను ఎన్నటికైనా నేను అడగగలను. కానీ ఇవి చాలు. అయితే ఈ ప్రశ్నలకు శ్రీ బెనర్జీ ఏమి సమాధానం ఇచ్చి ఉండేవాడో! వివేకం గల ఏ మనిషి కూడా 'అర్హులే' అని జవాబు ఇవ్వడానికి సాహసిస్తాడని నేననుకోను. ఒక దేశాన్ని పరిపాలించే అర్హత మరొక దేశానికి లేదనే 'మిల్' దొర సిద్ధాంతాన్ని పదే పదే వల్లించే ప్రతి కాంగ్రెస్ వ్యక్తీ ఒక వర్గం ప్రజల్ని అణగద్రొక్కి ఉంచే అధికారం మరొక వర్గానికి లేదనే విషయాన్ని అంగీకరించాలి. **(ఈ వ్యాక్యాలు అంబేద్కర్ వ్రాసిన కులనిర్మూలన గ్రంథం నుండి గ్రహించ బడ్డాయి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.12. Published on April 1, 2017